మే
2018

145

సంపుటి : 13 సంచిక : 1 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాలు జరపండి
మహారాష్ట్ర రైతాంగ పాదయాత్ర
రాజ్యాంగ ఫెడరల్ స్వభావాన్ని గౌరవించండి
అత్యాచారాలకు చిరునామా సంఘ్ పరివార్
విప్లవ వీరుల మహోజ్వల చరిత్ర
లెనిన్ బాటలో ముందుకు
ద్రవ్య పెట్టుబడిని ప్రతిఘటించాలి
భారత్ - రష్యా ఇంధన సహకారం
వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం ప్రధానం
త్యాగమయి కామ్రేడ్ భిక్షావతి

# త్యాగమయి కామ్రేడ్ భిక్షావతి

**యు. రామకృష్ణ**

భూస్వామ్య కుటుంబంలో జన్మించినా.. కమ్యూనిస్టుగా మారి చివరి శ్వాస వరకూ ఆదర్శవంతంగా జీవించిన ధన్యజీవి ఆమె.. పార్టీని కుటుంబంగా చూడటం.. పార్టీ కార్యకర్తలను పలుకరించడం ఆమెకు నిత్యాభరణాలు.. పార్టీ పత్రికల స్థాపనలో భర్తకు చేదోడువాదోడుగా ఉన్నారామె. భర్త.. కుటుంబ భూములమ్మి, వచ్చిన సొమ్మును పత్రిక స్థాపనకు ఖర్చు పెడితే, దాని నిర్వహణకు తన వంతుగా మెడలో బంగారు గొలుసు, సూత్రాలను సైతం సమర్పించారామె. అంతేకాదు భర్త మరణానంతరం తన చేతి గాజులనూ పార్టీకి ఇచ్చారు. ఆమే తొలితరం మహిళా నేత.. దండమూడి భిక్షావతి.



భిక్షావతి.. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం (పూర్వపు గన్నవరం తాలూకా) గండిగుంటలో వల్లభనేని సుభద్రమ్మ – అంజయ్య దంపతులకు 1932లో జన్మించారు. వారిది భూస్వామ్య కుటుంబం. కమ్యూనిస్టు పార్టీకి సానుభూతిపరులుగా ఉండేవారు. భిక్షావతి పెదనాన్న కుమారుడు వల్లభనేని వెంకటేశ్వరరావు బాల సంఘాలు నిర్వహించేవారు. ఆమె తొమ్మిదో ఏట నుంచే బాల సంఘంలో పనిచేసేది. ఖాళీ దొరికితే చాలు బాల సంఘం సభ్యులు గ్రామం లోని గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతుండేవారు. కొంతకాలం తరువాత భిక్షావతి యువజన సంఘం సభ్యులయ్యారు. ఆ సంఘానికి డి.వి. సుబ్బారావు (డివిఎస్) అధ్యక్షుడుగా ఉండేవారు. డివిఎస్ ఆమెకు స్వయానా మేనమామ. పార్టీ పట్ల ఆరాధనా భావంతో ప్రముఖుల జీవిత చరిత్రలు, పార్టీ పుస్తకాలు చదివే క్రమంలో.. డివిఎస్ ఇచ్చిన 'జెన్నీ మార్క్స్' పుస్తకం జీవితాన్ని ఏ దిశగా మలుచుకోవాలో తనకు ఖచ్చితమైన దిశానిర్దేశం చేసిందని ఆమె చెప్పేవారు. అతి పెద్ద ధనవంతుల కుటుంబంలో పుట్టిన జెన్నీ.. నిరుపేద అయిన తన బాల్య స్నేహితుడు మార్క్స్‌ను ఇష్టపడి వివాహం చేసుకోవడం.. ఆయన ఆదర్శాలకు తన సహకారం పూర్తిగా అందించి తిండిలేని రోజులు గడిపి.. కనీసం బిడ్డకు పాలు కూడా ఇవ్వలేని దైన్య స్థితిలోనూ ఏ మాత్రం చలించక... ఎంతో గుండె నిబ్బరం తో వ్యవహరించిన తీరు.. తండ్రి వద్దకు వెళ్లి ఉండగలిగే అవకాశం ఉండి కూడా పరిస్థితులకు తలవొగ్గక మొండిగా ఎదురు తిరిగిన జెన్నీ వ్యక్తిత్వం.. ఆమెను పూర్తిగా కదిలించి వేసింది. అందుకేనేమో ప్రజలు.. వారి సమస్యల గురించిన అవగాహన ఆమెలో ఆ వయసులోనే ఏర్పడింది.

భిక్షావతి ఎనిమిదో తరగతి వరకూ చదువుకున్నారు. అంతకన్నా ఎక్కువ తరగతులు లేకపోవడంతో స్కూలు మాన్పించి హిందీ నేర్పించారు. డివిఎస్ బిఏ వరకూ చదువుకున్నారు. కాటూరుకు మానికొండ సూర్యావతి గారు తరచూ వస్తుండేవారు. ఆమె తో పరిచయం ఏర్పడ్డాక మహిళా ఉద్యమం గురించి ఆమె అనేక విషయాలు తెలుసుకున్నారు. ఆ గ్రామంలో జరిగే కార్యక్రమాల వరకే ఆమెను ఇంటి నుంచి పంపేవారు. ఇతర గ్రామాలకు వెళ్లనిచ్చేవారు కాదు. 1948 మే నెలలో ఆమె పదిహేడో ఏట డివిఎస్‌తో వివాహం జరిగింది. అప్పుడు డివిఎస్‌కు 21 ఏళ్లు. డివిఎస్ మొదటి నుంచీ కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలలో భాగమైపోయారు. ఆయన పూర్తిగా పార్టీ వ్యవహారాల్లో నిమగ్నమై ఉండేవారు. దానితో ఆమె ఎక్కువ సమయం పుస్తకాలు చదువుతూ గడిపేవారు.

1949లో పార్టీపై నిషేధం విధించారు. పార్టీ కార్యక్రమాలు రహస్యంగా నిర్వహించాల్సి వచ్చింది. మచిలీపట్నంలో కాపురం పెట్టారు. డివిఎస్ బిఏ చదువుతూ అక్కడ రహస్యంగా ఉన్న పార్టీ జిల్లా కమిటీకి కొరియర్‌గా ఉన్నారు. వారు ఉండే ఇంట్లో సైక్లో స్టయిల్ మెషీన్ ఉండేది. ఆమె పార్టీకి అవసరమైన కరపత్రాలు రాయడం, కాపీలు తీయడం చేస్తుండేది. ఆ సందర్భంలోనే రహస్యం జీవితం గుడుపుతున్న వారితో ఆమెకు పరిచయాలేర్పడ్డాయి. వారికి ఇంట్లో వంట చేసి పెట్టేవారు. వారి పక్క గదిలో ఉండే కామ్రేడ్ బోగాదుల రామారావు (ట్రేడ్ యూనియన్ సభ్యుడు), కామ్రేడ్ చలసాని వాసు (స్టూడెంట్ నాయకుడు) ఎప్పటికప్పుడు పార్టీ వివరాలు చెబుతూ ఆమెకు స్ఫూర్తి నిచ్చేవారు. ఇంతలో కొరియర్‌గా ఉన్న డివిఎస్ పట్టుబడ్డారు. దివి తాలూకాలో భోగాదుల రామారావు, విజయవాడలో చలసాని వాసులను పోలీసులు కిరాతకంగా కాల్చి చంపారు. ఆ సమయంలో ఆమె గర్భవతి. ఇన్నాళ్లూ పుస్తకాల ద్వారా పొందిన స్ఫూర్తితో ఒక్కసారిగా ఎదురైన ఆ గడ్డు అనుభవాన్ని ఎదుర్కొని నిబ్బరంగా నిలబడ్డారు. ఆనాడు పార్టీ జిల్లా కమిటీలో ఉన్న కడియాల గోపాలరావు, మానికొండ సుబ్బా రావు, సూర్యావతి ఆచూకీ తెలపాల్సిందిగా పోలీసులు డివిఎస్‌ను జైలులో ఎన్నో రకాలుగా చిత్రహింసలు పెట్టారు. కానీ వేటినీ లెక్కజేయ లేదు. ఏ చిన్న సమాచారమూ ఆయన అందించలేదు.

1951 మే నెలలో పార్టీపై నిషేధం ఎత్తివేశాక డివిఎస్ బయటకు వచ్చారు. దాదాపు ఏడాదిన్నర జైలులో ఉన్నారు. కృష్ణాజిల్లా కమిటీ ఆఫీసు విజయవాడలో ఉండటంతో మళ్లీ వారి కాపురం అక్కడికి మార్చారు. అదే సంవత్సరం భిక్షావతి మహిళా సంఘంలో సభ్యులయ్యారు. విశాలాంధ్ర బుక్‌హౌస్ బాధ్యతలు డివిఎస్‌కు అప్పగించారు. 1951లో పార్టీపై నిషేధం సడలించినప్పుడు పుచ్చలపల్లి సుందరయ్యగారు జైలు నుంచి విడుదలయ్యారు. ఆ సందర్భంగా భిక్షావతి ఆయనను కలిశారు. అప్పుడు ఆయనతో కేవలం పరిచయం మాత్రమే ఉండేది. చైనా యుద్ధ సమయంలోనూ సుందరయ్యగారు అరెస్టయి విడుదల అయినప్పుడూ వారి ఇంటికి వచ్చారు. ఆ తర్వాత ఆయన అనేకసార్లు విజయవాడ వచ్చినప్పుడు వారింట్లోనే ఉండేవారు. ఆయన వారి కుటుంబ సభ్యుడయ్యారు. భిక్షావతి 1952లో పార్టీ సభ్యత్వం పొందారు. 1960లో విజయవాడ మున్సిపల్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీచేసి కేవలం ఐదు ఓట్ల తేడాతో ఓటమి చెందారు.

1959 నుంచి డివిఎస్‌కు తరచూ జ్వరం

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. త్యాగమయి కామ్రేడ్ భిక్షావతి
యు. రామకృష్ణ........................ 2

2. మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాలు జరపండి ............................ 4

3. వ్యవసాయ సంక్షోభానికి చిహ్నం మహారాష్ట్ర రైతాంగ పాదయాత్ర
అశోక్ ధావలే .................... 6

4. రాజ్యాంగ ఫెడరల్ స్వభావాన్ని గౌరవించండి
పినరయి విజయన్ ............ 10

5. అత్యాచారాలకు చిరునామా సంఘ్ పరివార్
జగదీష్........................ 12

6. విప్లవ వీరుల మహోజ్వల చరిత్ర
గుల్ల తిరుపతిరావు ............. 16

7. లెనిన్ బాటలో ముందుకు
పాతూరి వెంకటేశ్వరరావు ..... 21

8. ద్రవ్య పెట్టుబడిని ప్రతిఘటించాలి.....
ప్రభాత్ పట్నాయక్ ............ 23

9. భారత్ – రష్యా ఇంధన సహకారం
సంజయ్‌కుమార్ ప్రధాన్ ...... 29

10. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం ప్రధానం
బి.వి. రాఘవులు............... 33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటోరియల్ 9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# పార్టీ 22వ మహాసభలు

నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా విస్తృతమైన, ఉధృతమైన ఐక్యపోరాటాలు నిర్మించడం ద్వారా మాత్రమే ఈ దేశాన్ని మతోన్మాద ప్రమాదం నుండి రక్షించగలం, పార్టీ స్వతంత్ర బలం పెంచుకోవడం ద్వారానే ఈ ఐక్య పోరాటాలు నిర్మించబడతాయి....ఇదీ హైదరాబాద్‌లో ఏప్రిల్ 18 నుండి 22 వరకు జరిగిన సిపిఐ(ఎం) అఖిల భారత మహాసభలు ఇచ్చిన పిలుపు. నేటి పరిస్థితుల్లో సిపిఐ(ఎం) మహాసభ నిర్ణయాలు ఎంత ప్రాముఖ్యత సంతరించుకున్నాయో ఆ మహాసభ చేసే నిర్ణయాల గురించి మొత్తం జాతీయ మీడియా ఎదురు చూసిన తీరే తెలియజేసింది.

మహాసభ మూడు ముఖ్యమైన నిర్ధారణలు చేసింది. మొదటిది, 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం సమసిపోలేదు. సంక్షోభం ప్రజల్లో సృష్టించిన అసంతృప్తిని ఉపయోగించుకుని అనేక దేశాల్లో మితవాద చీకటి శక్తులు బలపడుతున్నాయి. అసంతృప్తిని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు పోరాటాల్లోకి మళ్లించే చోట అవి బలపడుతున్నాయి. ఇక మధ్యేమార్గానికి అవకాశాలు తగ్గిపోతున్నాయి. రెండవది, భారత దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి రావడం అంటే నయా ఉదారవాద కార్పొరేట్ శక్తులు, మతోన్మాద శక్తుల కాక్‌టైల్ పాలన అధికారంలోకి రావడమే. ఇది కొత్త పరిస్థితులు సృష్టించింది. ప్రజలపై ఆర్థిక దోపిడీ పెరగడంతోపాటు మతోన్మాద ఫాసిస్టు ధోరణులు, నియంతృత్వ పోకడలు, అమెరికాతో మరింతగా అంటకాగే విధానాలు పెరిగాయి. చివరిది, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా విస్తృత ఐక్య ఉద్యమాలు నిర్మించడమే మతోన్మాదాన్ని ఎదుర్కొనే ప్రధాన మార్గం. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్దిష్ట అంశాలపైనా, ప్రజా ఉద్యమాల్లోనూ అన్ని రకాల లౌకిక, ప్రజా తంత్ర శక్తులను కలుపుకుంటూనే మరోవైపు పాలక వర్గ ప్రతినిధిగా ఉన్న కాంగ్రెస్‌తో ఎటువంటి రాజకీయ పొత్తులు పెట్టుకోకూడదని మహాసభ దిశానిర్దేశం చేసింది. పార్టీలో విధాన పరంగా పెద్ద గందరగోళం ఉన్నట్లు కార్పొరేట్ మీడియా మహాసభకు ముందు చేసిన ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ మహాసభ స్పష్టమైన విధానంతో, పటిష్టమైన ఐక్యతతో ముందుకొచ్చింది.

సిపిఎం విధానం అంటే అది కేవలం పార్టీకే పరిమితమైన విషయంగా భావించకూడదు. అది దేశంలోని విశాలమైన ప్రజారాశులకు సంబంధించిన విధానం. పాలక వర్గాల దాడులనుండి ప్రజలను రక్షిస్తూ వారిని సమీకరించి, సంఘటితపరిచి దోపిడీనుండి విముక్తి పరిచే అంతిమ లక్ష్య సాధనవైపు నడిపించే విధానం. అందువల్లనే పార్టీ విధానం బూర్జువా–భూస్వామ్య పార్టీల మాదిరిగా నాలుగు గోడల మధ్య కాకుండా ప్రజల మధ్య, పార్టీలో ప్రజాతంత్ర చర్చద్వారా రూపుదిద్దు కుంటుంది. పాలక పార్టీల మాదిరిగా కొద్ది మంది పెట్టుబడిదారీ, భూస్వాముల ప్రయోజనాల కోసం కాకుండా కార్మిక, కర్షక, దళిత, గిరిజన, ఇతర సామాన్య ప్రజల ప్రయోజనాలకోసం రూపుదిద్దబడుతుంది. అందువల్ల సిపిఐ(ఎం) మహాసభలు పార్టీ సభ్యులు, కార్యకర్తలకే కాకుండా ప్రజలందరికీ సంబంధించిన మహాసభలు. అటువంటి మహాసభలు తీసుకునే నిర్ణయాలు దేశానికీ, దేశ ప్రజానీకానికీ ఎంతో ప్రాధాన్యతగలవి కనుకనే ఈ నిర్ణయాలను అర్థం చేసుకుని, ఈ విధానాన్ని ప్రజల్లోకి తీసుకుపోవలసిన బాధ్యత ప్రతి పార్టీ సభ్యునిపై ఉంది.


### చందా వివరాలు

విడిప్రతిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

### చిరునామా

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**సిపిఐ(ఎం) మహాసభల తీర్మానం**

# మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాలు జరపండి

## సిపిఐ(ఎం) 22వ అఖిలభారత మహాసభల పిలుపు

కారల్‌మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించాలని సిపిఐ(ఎం) 22వ అఖిలభారత మహాసభలు పిలుపునిచ్చాయి. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన మహాసభల్లో ఈ మేరకు పార్టీ శ్రేణులకు పిలుపునిస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. 'అన్ని పార్టీ శాఖలు, అందరు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు కారల్‌మార్క్స్ 200వ జయంతి ఉత్సవాలను మే 5 2018 నుండి మే 4 2019 వరకు ఘనంగా నిర్వహించాలని 22వ మహాసభ పిలుపునిస్తోంది' అని తీర్మానం లో పేర్కొన్నారు. తీర్మానం వివరాలు క్లుప్తంగా: కారల్‌మార్క్స్ యూదు న్యాయవాదుల కుటుం బంలో జన్మించాడు. ఆయన మూలాలు ఏమైనప్పటికీ అవి విప్లవాత్మకమైనవి. జీవిత ప్రయాణం ముగిసే సయమానికి మానవత్వ చరిత్రమీద, మానవ ఆలోచనలమీద అప్పటివరకు ఉన్న విప్లవకారులందరికన్నా మార్క్స్ తనదైన గాఢముద్ర వేశారు. ఆయన అంతిమశ్వాస విడిచిన 35 సంవత్సరాల్లోనే మార్క్స్ ఆలోచనా విధానాన్ని ఒక దేశంగా సోవియట్ యూనియన్ తనదిగా చేసుకుంది. దశాబ్దాలు గడిచే కొద్దీ అనేకదేశాలకు చెందిన లక్షలాది మంది అదే బాట పట్టారు. 1883లో మరణించినప్పుడు ఆయన సమాధివద్ద అంతిమనివాళు లర్పించడానికి కేవలం 11 మందే ఉన్నారు, ఆ తరువాత రోజుల్లో ఆయన జయంతిని, వర్ధంతిని ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది ఘనంగా జరుపుకున్నారు. విముక్తికి మార్గం చూపిన మహనీయుడిగా ఇప్పటికీ మనం మార్క్స్‌కు నివాళులర్పిస్తున్నాం.

ఈ అసాధారణ వారసత్వానికి మూలం ఏమిటి? సామాన్యజనం మార్క్స్ జీవితాన్ని, ఆయన చేసిన కృషిని నేటికీ ఎందుకు శ్లాఘిస్తున్నారు? పెట్టుబడిదారీ యుగంలో కార్మికవర్గ స్థితిగతులు, వారి విముక్తి గురించి తీవ్రంగా ఆలోచించిన వారిలో మొట్టమొదటి వ్యక్తి మార్క్స్. ఫ్రెడరిక్ ఏంగెల్స్‌తో కలిసి ఆయన ఈ పనిని శాస్త్రీయంగా నిర్వర్తించారు. ఈ క్రమంలోనే శతాబ్దాల తరబడి దోపిడి ఎలా వ్యవస్థీకృతమైందో, ఎలా కొనసాగుతుందో తనకన్నా ముందువారు దీనిని ఎలా చూశారో ఆయన విశ్లేషించారు. దోపిడి జరుగుతున్న విధానాన్ని విశ్లేషించడానికే మార్క్స్ కృషి పరిమితం కాలేదు. ఆ దోపిడి శృంఖలాలను తెంచుకునే మార్గాన్ని ఆయన చూపాడు. అనితరసాధ్యమైన రీతిలో ఆయన చూపిన ఈ మార్గమే మిగతా వారికన్నా భిన్నంగా, మార్క్స్‌ను మొదటి స్థానంలో నిలిపింది. సిద్ధాంతానికి ఆచరణకు మధ్య ఉన్న సంబంధాన్ని మార్క్స్ తన రచనల ద్వారా పునర్‌నిర్వచించారు. 'సమాజం ఇలా ఎందుకు ఉంది అన్న అంశాన్ని తత్వవేత్తలు వివిధ రూపాల్లో నిర్వచించారు. ఇప్పుడు కావాల్సింది దానిని మార్చడం' అని ఆయన రాశారు.

దోపిడీ విధానం సరైనదా, న్యాయమైనదా, ఏదో మినహాయింపుగా ఉందా అని దోపిడీని గురించి విశేషణలు కొనసాగుతున్నాయని మార్క్స్ అభిప్రాయం పడ్డాడు. దోపిడి ఎలా కొనసాగు తోంది అనే అంశాన్ని బట్టి ఆ సమాజ స్వభా వాన్ని అర్థం చేసుకోవచ్చు. మరో మాటలో చెప్పాలంటే అన్ని సమాజాలు వర్గాలుగా విడి పోయాయి. దోపిడి చేసేవారు. దోపిడికి గుర య్యే వారుగా సమాజంఎప్పుడో చీలిపోయింది. ఈ రెండు వర్గాల మధ్య జరిగిన పోరాటాలే చరిత్ర! ఈ వర్గ పోరాటాలను లిఖించిందే చరిత్ర! మార్క్స్ సమాధి వద్ద ఆయన జీవిత కాలపు సహచరుడు ఫ్రెడరిక్ ఏంగెల్స్ మాట్లా డుతూ 'డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని ఆవిష్కరించిన విధంగానే మార్క్స్ మానవ సమాజ అభివృద్ధి సూత్రాలను కనుగొన్నారు. మార్క్స్ ఆవిష్కరించిన దానిలో మరో ప్రత్యేకత కూడా ఉంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి చలన సిద్ధాంతాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. బూర్జువా సమాజంలో ఉత్పత్తి ఎలా జరుగు తోందో వివరించారు. మార్క్స్ ఎప్పుడైతే అదన పు విలువను కనుగొన్నారో, అది అప్పటివరకు దాగిఉన్న ఎన్నో విషయాలను బట్టబయలు చేసింది. పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ఒక్క కుదు పు కుదిపింది. సమాజంలో నెలకొని ఉన్న ఎన్నో సమస్యలకు పరిష్కారం కోసం అంధ కారంలో వెతుకుతున్న బూర్జువా, అర్థశాస్త్ర, సామాజిక విశ్లేషకులకు, పరిశోధకులపై అదనపు విలువ సిద్ధాంతం వెలుతురులా ప్రసరించింది.

పెట్టుబడిదారీ సమాజంలో అనివార్యంగా నూతన సామాజిక వర్గం పుడుతుందని మార్క్స్ విశ్లేషించారు. నూతనంగా ఆవిర్భవించే ఆ శ్రామికవర్గాన్ని పెంచి పోషించడం పెట్టుబడీదారులకు తప్పనిసరని, ఆ శ్రామిక వర్గమే పెట్టుబడీదారి సమాజానికి సమాధిని తవ్వుతుందని మార్క్స్ చెప్పారు. మరో మాటలో చెప్పా లంటే పెట్టుబడిదారీ వర్గం తన సమాధిని తానే తవ్వుకుంటుందని మార్క్స్ రాశారు. మిగిలిన పరిశోధకుల మాదిరే మార్క్స్ కూడా గతి తార్కిక, చారిత్రిక భౌతిక వాదాలను అధ్య యనం చేశారు. పెట్టుబడీదారి విధానాన్ని గతి తార్కిక పద్దతుల్లో అధ్యయనం చేసిన ఆయన ఆ వ్యవస్థలో తప్పనిసరిగా ఉత్పన్నమయ్యే సంక్షోభాలను బట్టబయలు చేశారు. పెట్టుబడీ దారి విధానంలోని అమానవీయత బట్ట బయంల య్యేకొద్దీ కార్మికవర్గం సంఘటితమవుతుందని, స్వార్థాపేక్ష తప్ప మరేమి లేని ఆ విధానాన్ని కూకటి వేళ్లతో

సహా మార్చివేసి నూతన సామాజిక ఉత్పత్తి విధానాన్ని ఆవిష్కరిస్తుందని, అదే సోషలిజమని మార్క్స్ చెప్పారు. వర్గ రహిత సమాజాన్ని సృష్టించడంలో ఈ దశ తప్పనిసరి అని మార్క్స్, ఏంగెల్స్ అభిప్రాయపడ్డారు. తరతరాలుగా కొనసాగుతున్న దోపిడిని అంతం చేయడమొక్కటే మార్క్స్ ఆవిష్కరణలోని స్ఫూర్తి దాయక అంశం కాదు. ఆయన అంతకన్నా భిన్నమైన వర్గరహిత, అత్యున్నత సమాజాన్ని చూశాడు. సమాజాభివృద్ధిలో నూతన దశకు పునాదిరాయి వేశారు. దోపిడిలేని, అభివృద్ధి ఫలాలు అందరికి అందే, ప్రతిఒక్కరి సంక్షేమా నికి రాజ్యమే స్వయంగా పూచీ ఇచ్చే కమ్యూనిస్టు సమాజ దశను ఆయన ప్రతిపాదించి, అభివృద్ధి చేశారు.

దోపిడితో నిండిన ఈ సమాజాన్ని మార్చే దిశలో విప్లవ, పురోగామి శక్తులకు, విద్యార్థులకు, శ్రామిక ప్రజలకు మార్క్స్ రచనలు కొన్ని తరాలుగా స్ఫూర్తినిస్తున్నాయి. మేధా వులను, సమాజ విశ్లేషకులను, శాస్త్రవేత్తలను ప్రభావితం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ సమాజం సృష్టించిన కార్మికవర్గాన్ని, పురోగమనంలో దాని నాయకత్వ పాత్రను ప్రతిపాదించిన మార్క్స్ రచనలు లెనిన్ వంటి ఎందరో విప్లవ కారులకు మార్గదర్శనం చేశాయి. సమాజాన్ని మార్చాలని భావించే ప్రతి ఒక్కరికీ ఇప్పటికీ దిశా నిర్దేశం చేస్తూనే ఉన్నాయి. దీనినే ఇప్పుడు మార్క్సిజం అని పిలుస్తున్నాం. కొన్ని తరాలుగా కమ్యూనిస్టులకు ఇదే కరదీపికగా నిలిచింది. మార్క్స్ పెట్టుబడి గ్రంథం రచించి 150 సంవత్సరాలైంది. కమ్యూనిస్టు మ్యానిఫెస్టోకు 170 సంవత్సరాలు. మార్క్స్ జన్మించి 200 సంవత్సరాలు అయ్యాయి. ఈ ఉత్సవాలను ఇప్పుడు మనం ఘనంగా నిర్వహించుకుం టున్నాం. ఈ క్రమంలోనే పారిస్ కమ్యూన్, చారిత్రాత్మక అక్టోబర్ సోషలిస్టు విప్లవం, ఫాసిజం ఓటమి, తూర్పు యూరప్ సోషలిజం, చైనా, వియత్నాం, క్యూబన్ విప్లవాలు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వివిధ దేశాల్లో సాగిన పోరాటాలు ఈ కాలంలో మనం చూశాం. దీనితో పాటు భౌతికశాస్త్రం, సామాజిక శాస్త్రాలు, సాంస్కృతిక రంగం, సాహిత్యం, ఫెమి నిజం, పర్యావరణం, కృత్రిమ మేధస్సు వంటి విజ్ఞానశాస్త్రాలను మార్క్సిస్టు దృక్పథంతో ఎలా అధ్యయనం చేయాలో మనం నేర్చుకున్నాం.

భారతదేశంలో కమ్యూనిస్టులుగామనతో పాటు, అనేకమంది ఇక్కడి సమాజాన్ని అర్థం

❝సమాజాన్ని మార్చాలని భావించే ప్రతి ఒక్కరికీ ఇప్పటికీ దిశానిర్దేశం చేస్తూనే ఉన్నాయి. దీనినే ఇప్పుడు మార్క్సిజం అని పిలుస్తున్నాం. కొన్ని తరాలుగా కమ్యూనిస్టులకు ఇదే కరదీపికగా నిలిచింది. మార్క్స్ పెట్టుబడి గ్రంథం రచించి 150 సంవత్సరాలైంది. కమ్యూనిస్టు మ్యానిఫెస్టోకు 170 సంవత్సరాలు. మార్క్స్ జన్మించి 200 సంవత్సరాలు అయ్యాయి. ఈ ఉత్సవాలను ఇప్పుడు మనం ఘనంగా నిర్వహించుకుంటున్నాం.❞



తీర్మానానికి ఆమోదాన్ని తెలియజేస్తున్న ప్రతినిధులు

చేసుకోవడానికి, సమస్యలను అధ్యయనం చేయడానికి, పరిష్కారమార్గాలు వెతకడానికి మార్క్స్ సిద్ధాంతాన్ని, ఆలోచనలను సృజనాత్మకంగా వినియోగించుకుంటున్నారు. మిగిలిన ప్రాంతాల్లో కమ్యూనిస్టులు సాధించిన స్థాయిలో మన విజయాలు ఉండకపోవచ్చు కానీ, భారతీయ సమాజాన్ని, కార్మికవర్గాన్ని మార్క్స్ ఆలోచనా విధానంతో సుసంపన్నం చేసి, విప్లవస్ఫూర్తిని అందించడంలో మన వంతు పాత్రను నిర్వర్తిస్తున్నాం.

❊ కారల్‌మార్క్స్‌కు, ఆయన విప్లవకర సిద్ధాంతానికి వారసులుగా ఈ అనుభవాలు, అధ్య యనాల నుండి సరైన గుణపాఠాలు తీసు కుని, భవిష్యత్ కాలానికి సరైన కార్యాచరణ ప్రణాళికను మనం సిద్ధం చేసుకోవాలి.

❊ కారల్‌మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ కిందివాటితో సహా బహుముఖ కార్యక్రమాలను నిర్వహించాల్సిందిగా సిపిఎం 22వ అఖిలభారత మహాసభ పార్టీ శాఖలకు, సభ్యులకు, సానుభూతిపరులకు పిలుపునిస్తోంది.

❊ బహిరంగసభలు, ప్రదర్శనలతో పాటు ప్రజా సమూహాలలో నిర్వహించ వీలయ్యే ఇతర కార్యక్రమాలు

❊ మార్క్సిజం-లెనినిజం ప్రాసంగికతపై సెమినార్లు

❊ మార్క్స్ జీవితానికి. ఆయన సేవలకు అనుసంధానిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు


❊ మార్క్స్, ఏంగెల్స్ రచనలను అన్ని భారతీయ భాషల్లో ముద్రించడం, పునర్ ముద్రించడం.

❊ అధ్యయన కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ మార్క్సిస్టుల రచనలను ముద్రించడం, పునర్ముద్రించడం.
మార్క్సిజం-లెనినిజంను తప్పుదోవ పట్టించిన తీరుపై రచనలను ముద్రించడం, పునర్ముద్రించడం.

❊ మార్క్సిజం-లెనినిజంపై జరిగిన ప్రధాన చర్చలను సంక్షిప్తీకరించి ప్రచురించడం
మార్క్స్ అనంతరం మార్క్సిస్టు విప్లవ కారులు అభివృద్ధి చేసిన మార్క్సిజాన్ని ప్రజలకు, ముఖ్యంగా యువతకు పరిచయం చేయడం. ❊

## వ్యవసాయ సంక్షోభానికి చిహ్నం

# మహారాష్ట్ర రైతాంగ పాదయాత్ర



రచయిత
ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు

**అశోక్ ధావలె**

మార్చి12న అఖిల భారత రైతు సంఘం (ఎఐకెఎస్) ఘన విజయాన్ని సాధించింది. నాసిక్‌లో ప్రారంభమైన రైతాంగ ప్రతిఘటన పాదయాత్ర కొద్దిరోజుల్లోనే పెద్ద సమూహంగా మారింది. ఈ రైతాంగ మహా పాదయాత్ర దేశ మంతా ప్రఖ్యాతిగాంచింది. దేశంలో తీవ్రమవు తున్న వ్యవసాయ సంక్షోభ ప్రమాదాన్ని ప్రజానీ కం దృష్టికి తెచ్చేందుకు ఈ యాత్ర ముంబాయి చేరుకుంది. ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలె ఈ పోరాట వివరాలను, దాని ప్రభావాలను ఫ్రంట్‌లైన్ పత్రిక ప్రతినిధి అను పమ కటకంతో పంచుకున్నారు.

**ఇంటర్వ్యూలోని ప్రధానాంశాలు:**

**ఈ మహా పాదయాత్ర ద్వారా మహారాష్ట్ర వ్యాపితంగా రైతాంగం సామూహిక శక్తిని ప్రదర్శించింది. ఈ కాలంలో బహుశా ఇదే అతిపెద్ద రైతాంగ ఉద్యమం. ఈ ఉద్యమానికి ఇంత బలం ఎలా చేకూరింది? ఈ పాదయాత్ర జరిపేందుకు తోడ్పడిన సంఘటనలేవి?**

ఈ పాదయాత్రకు ముందు జరిగిన మూడు ప్రధాన ప్రతిఘటనోద్యమాలు ఈ మహోద్య మానికి దారితీశాయి. 2016, మార్చిలో నాసిక్‌లో ఒక లక్షమంది రైతాంగంతో 48 గంటల బైఠాయింపు జరిగింది. దానితో రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కొన్ని హామీ లను ఇచ్చాడు. అవి అమలుకు నోచుకోలేదు. 2016, అక్టోబరులో ఆదివాసీ అభివృద్ధి శాఖామంత్రి నివాసాన్ని 50వేల మంది గిరిజన రైతాంగం ముట్టడించారు. ఇది కూడా 48 గంటల నిరవధిక పోరాటమే. ఈసారి ప్రభుత్వం దిగివచ్చి ఒక సర్క్యులర్‌ను జారీచేసింది. 2017, జూన్1 నుండి ఋణాల రద్దు, పంటల గిట్టుబాటు ధరల కోసం రైతాంగం రాష్ట్ర వ్యాపి తంగా 11 రోజులు సమ్మె చేశారు. ఈ సమ్మె కాలంలో గ్రామాల నుండి పట్టణాలకు పాలు, కూరగాయలు, పండ్లు సరఫరా నిలిచిపోయింది.

ఇది ఇతర సంఘాలతో కలిసి ఎఐకెఎస్ నిర్వహించిన ఉమ్మడి ఉద్యమం. పోరాడుతున్న రైతాంగానికి మద్దతుగా జూన్ 5న రాష్ట్రవ్యాపిత బంద్ జయప్రదంగా జరిగింది. ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ ఋణాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ 15 రోజుల తరువాత ప్రభుత్వం తన వాగ్దానాన్ని భంగపరి చింది. ఋణాల రద్దుకు అనేక విషమ షరతు లను విధించింది. 2017 ఆగస్టు 14న రెండు లక్షలమంది రైతాంగం రాష్ట్ర వ్యాపితంగా రహదారులను దిగ్బంధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ఎండగట్టారు.

2018 ప్రారంభం నాటికి పైన తెలిపిన రైతాంగ సమస్యలేవీ పరిష్కారం కాలేదు. ప్రభుత్వ వాగ్దానాలు గాలిలో కలిసిపోయాయి. ఫిబ్రవరి 16న జరిగిన రైతుసంఘం సమావేశం లో గిరిజనుల అటవీహక్కుల చట్టం, ఋణాల రద్దు, గిట్టుబాటుధరల కొరకు ఉద్యమించాలని నిర్ణయించింది. అందుకు మార్చి నెలలో సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించాలని తీర్మానించింది.

**మార్చిలో ఈ పాదయాత్ర జరపాలని నిర్ణయించటానికి ఉన్న ప్రాధాన్యత ఏమిటి?**

అవును. ప్రాధాన్యత ఉన్నది. మా పాద యాత్ర హోలీ పండుగ ముగిశాక మార్చిలో రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాక మా ఉద్యమాన్ని జరపాలనుకున్నాం. మార్చి12, సోమవారం నాటికి మా పాదయాత్ర ముంబయి చేరాలని నిర్ణయించాం. వెంటనే ప్రారంభించాలనుకున్నాం.

**ఈ సందర్భంగా మీరు ప్రభుత్వం ముందుం చిన కోర్కెలపై గ్రామీణ సమాజం తమదృష్టిని సారించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ కోర్కె లను వివరించండి?**

మొదటిది: మొత్తం రైతాంగ ఋణాలు మాఫీచేయాలి. రెండు: సామినాధన్ కమిషన్ సిఫార్సులను అమలుపరచాలి. పంటల ఉత్పత్తి వ్యయం కంటే ఒకటిన్నర రెట్లు గిట్టుబాటుధర ఇవ్వాలి. మూడు: అటవీహక్కుల చట్టాన్ని అనుసరించి గిరిజన రైతాంగానికి అటవీ భూములను పంచాలి. నాలుగు: కరువు సహాయ కార్యక్రమాలు చేపట్టాలి. ఇవి మా ప్రధానమైన కోర్కెలు. వీటితోపాటు పోషకాహార లోపంతో జరుగుతున్న శిశు మరణాలను అరికట్టాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలును మెరుగుపర్చాలని, ఆదివాసీ ప్రాంతాల్లో విద్యా వసతులు పెంచాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతూ అక్టోబరులో ఒక ఉద్యమం నిర్వహించాము. ఈ పాదయాత్ర సందర్భంగా పై డిమాండ్స్ అన్నింటినీ ప్రభుత్వం ముందుకు తెచ్చాం. దేశంలోని రాష్ట్రాలన్నిటి కంటే మహారాష్ట్ర రైతాంగం ఆత్మహత్యల్లో అగ్రభాగానుండటం సిగ్గుచేటు. 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' సమాచారం ప్రకారం నూతన ఆర్థిక విధానాల ప్రభావం వల్ల 1992 తరువాత దేశవ్యాపితంగా నాలుగు లక్షల మంది రైతాం గం ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అందులో 75 వేలమంది మహారాష్ట్రలోనే ఆత్మహత్యలు చేసుకో వడం విచారకరం. తరచూ అప్పుల వలయంలో చిక్కుకోవడమే ఈ రైతాంగ ఆత్మహత్యలకు కారణం. అందుకే ఋణాల రద్దు మరియు పంటల గిట్టుబాటు ధరలు అంశాలకు దేశ వ్యాపితంగా అంతపెద్ద ప్రాచుర్యం లభించింది.

**గిరిజన ప్రాంతాలలో పోడుభూమిపై హక్కులను రైతాంగానికి దఖలు పరచాలన్న కోర్కె ఈ ఉ**

**ద్యమంలో ప్రధానమైనది. మరి పర్యావరణము, సామాజిక సమస్యల మాటేమిటి?**

పర్యావరణము, సామాజిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే 2006లో పార్లమెంట్ అటవీహక్కుల చట్టాన్ని ఆమోదించింది. 61మంది వామపక్ష పార్టీల సభ్యుల ఒత్తిడి ఇందుకు తోడ్పడింది. అనేక తరాలుగా గిరిజనులు ఈ పోడు భూమిలో వ్యవసాయం చేస్తున్నారు. అనేక శతాబ్దాలుగా ఈ ప్రాంత అడవులకు రక్షణ కల్పిస్తున్నారు. ఈ చట్టం ద్వారా మొదటిసారిగా పది ఎకరాల వరకు అటవీ భూమిపై గిరిజనులకు హక్కులు కలుగుతున్నాయి. పండ్లు, తేనె, దుంపలు వంటి లఘు అటవీ ఉత్పత్తుల సేకరణకు వీరికి హక్కులు కల్పించబడ్డాయి. ఈ చట్టం ఆమోదించబడి 12 సంవత్సరాలు గడుస్తున్నా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని అమలు పరచటంలో విఫలమయ్యాయి. వామపక్ష ప్రభుత్వాలు ఉన్న త్రిపుర (వామపక్షాలు అధికారంలో ఉన్న కాలంలో), కేరళ రాష్ట్రాలలో మాత్రమే ఈ చట్టం అమలు పరచబడింది. మహారాష్ట్రలో అటవీ భూముల హక్కుల కోసం రైతుసంఘం నాయకత్వంలో గత 50 సంవత్సరాలుగా ఉద్యమాలు నడుస్తున్నాయి. అందుకే ఈ అంశం రైతాంగ మహా పాదయాత్రలో ప్రధాన డిమాండ్‌గా మారింది. ఈ మహోద్యమంలో పాల్గొన్న వారిలో 70% గిరిజనులుండటం గమనించదగ్గ అంశం.

**ముంబాయి చేరేటప్పటికి మహా పాద యాత్రలో 50 వేల మంది ఉద్యమకారులు జమ య్యారు. వ్యవసాయ సమాజంలో పెరుగుతున్న దుస్థితికి, అసంతృప్తికి ఈ సమీకరణ ప్రతి బింబం. ఇంతపెద్ద సంఖ్యలో మీరు రైతాంగాన్ని ఎలా సమీకరించగలిగారు?**

ఈ మహా పాదయాత్ర నాసిక్‌లో 25 వేల మందితో ప్రారంభమయింది. పాదయాత్ర నడిచిన వారం రోజుల్లో దారి పొడవునా రైతాంగం తోడయినందున ఆ సంఖ్య ముంబయి చేరేటప్పటికి 50వేలకు చేరింది. ఫిబ్రవరి 20నుండి రైతాంగ సమీకరణపై కేంద్రీకరించాం. వందలాది గ్రామాల్లో రైతు సంఘం సభలు జరిపింది. ఈ పాదయాత్ర ప్రాధాన్యతను ప్రజలకు వివరించింది. ఈ ప్రతిఘటనోద్యమంలో పెద్ద సంఖ్యలో రైతాంగాన్ని సమీకరించగలిగితేనే ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగలమన్న అంశాన్ని రైతాంగం దృష్టికి తెచ్చాం. కరపత్రాల పంపిణీ ద్వారా ఈ సమాచారాన్ని రాష్ట్ర రైతాంగానికి చేర్చగలిగాం. ఈ కృషిలో గతంలో ఏడుసార్లు శాసనసభ్యులుగా పనిచేసిన రైతు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు జె.పి. గోవిత్ గారి కృషిని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆయన ఈ కాలంలో అవిశ్రాంతంగా గ్రామాల్లో తిరిగి ఈ పోరాటంలో పాల్గొనవలసిందిగా రైతాంగాన్ని ప్రోత్సహించారు. పెద్ద సంఖ్యలో వారిని సమీకరించారు. ఆయనతో పాటు రాష్ట్రంలోని ఇతర రైతుసంఘం నాయకత్వ బృందం అంతా సమిష్టిగా కదిలి పనిచేసింది. సమిష్టి నాయకత్వం కృషి ఉంటేనే ఏ పోరాట మైనా జయప్రదమవుతుంది. ఒక నిరసన లేదా పోరాటం అనేక రూపాల్లో చేయవచ్చు. ఈసారి నాసిక్ నుండి ముంబయి వరకు 180 కిలో మీటర్ల దూరాన్ని ఆరు రోజుల్లో చేరుకోవాలి. అంటే రోజుకు 30 కిలోమీటర్ల వంతున కాలినడకన ఈ లక్ష్యం చేరాలనుకున్నాం. విస్తారమైన రైతాంగంతో కలిసి ఎఐకెఎస్ నాయకత్వం కూడా పాదయాత్రలో నడక సాగించింది.

**"థానే మరియు ముంబాయి పట్టణ పరిసరాలకు చేరేటప్పటికి ఆ ప్రాంత ప్రజలు ఆహారం, మంచి నీరు, పాదరక్షలు ఇంకా ఇతర అవసరాలను సమకూర్చారు. మతం, కులం, జాతి భేదాలను అధిగమించి కార్మికవర్గం, మధ్య తరగతి ప్రజలు అందించిన అద్భుతమైన సహకారానికి మేమెంతో ముగ్ధులమయ్యాము."**



ముంబయిలో రైతుల లాంగ్‌మార్చ్ దృశ్యం

ఎఐకెఎస్ దేశంలో గుర్తింపుగల రైతు ఉద్యమ సంస్థ. అందుకే పాదయాత్రలో అవసరమైన సరంజామాలను ప్రణాళికాబద్ధంగా సమకూర్చుకున్నాం. అందుకు ముందస్తుగా సన్నాహాలు పూర్తి చేశాం. మండుటెండల్లో తారు రోడ్ల పైన పగలంతా నడిచాక రాత్రిసమయాల్లో మాత్రమే విశ్రాంతికి కేటాయించడమైనది. దారిపొడవునా అవసరమైన నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసుకున్నాం. బియ్యం, పప్పులు, వంటనూనెతో పాటు వంట చెరుకును కూడా రైతాంగం తమ వెంట తెచ్చుకున్నారు. వాలంటీర్లు ఆహారాన్ని వండిపెట్టారు. పాదయాత్ర బృందంతోపాటు వైద్యులతో కూడిన ఒక అంబులెన్స్ కూడా అందుబాటులో ఉంది. పాదయాత్ర థానే మరియు ముంబాయి పట్టణ పరిసరాలకు చేరేటప్పటికి ఆ ప్రాంత ప్రజలు ఆహారం, మంచి నీరు, పాదరక్షలు ఇంకా ఇతర అవసరాలను సమకూర్చారు. మతము, కులము, జాతి భేదాలను అధిగమించి కార్మికవర్గం, మధ్య తరగతి ప్రజలు అందించిన అద్భుతమైన సహ కారానికి మేమెంతో ముగ్ధులమయ్యాము.

**పాదయాత్రలో పాల్గొన్న రైతాంగం ఆత్మ విశ్వాసం, పట్టుదల ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని చెప్పారు. ఎలా?**

మహా పాదయాత్రలో వేలాదిమంది మహిళలు కూడా పాల్గొన్నారు. వారి మనో నిబ్బరం, పట్టుదల నమ్రత ఎంతో అద్భుతమనిపించింది. వారిలో అనేక మంది చెప్పులు లేకుండా నడిచారు. అయినప్పటికీ వారిలో వీసమెత్తు నీరసం కూడా కన్పించలేదు. వారి పట్టుదల సడలలేదు. వారు ముందుకే ...ముమ్ముందుకే సాగారు.

**❝ మార్చి12వ తేది పాదయాత్ర ముగింపు రోజు. ఆ రోజు 10వ తరగతి పరీక్షల బోర్డు రెండు పరీక్షలను నిర్వహించింది. ఆ పరీక్షలకు హాజరయ్యే పిల్లలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా మార్చి11న రోజంతా నడిచి కొద్ది విశ్రాంతితో మళ్లీ రాత్రంతా నడుస్తూ 12వ తేది ఉదయానికి దక్షిణ ముంబయిలోని అజాద్ మైదానం చేరుకున్నారు. మేము పాఠశాల విద్యార్థులపట్ల తీసుకున్న జాగ్రత్తలకు దేశవ్యాప్తంగా ప్రజల నుండి అభినందనలు లభించాయి.❞**



రైతుల డిమాండ్లను ఆమోదిస్తూ రాతపూర్వక ఒప్పందం చేసుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం

**ఈ పోరాటానికి పెద్ద ఎత్తున ప్రచారం లభించింది. రైతాంగ పోరాటాలను పట్టించుకోని ఈ కాలంలో పాదయాత్రకు లభించిన ప్రచారం అసాధారణమైనది. రాష్ట్ర ప్రభుత్వం మీద పెద్ద ప్రభావం కనిపించింది. దీనిపై మీ అభిప్రాయం?**

ప్రింటు, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలు ఇందుకు బాగా తోడ్పడ్డాయి. న్యాయం కోసం రైతాంగం జరుపుతున్న పోరాటాన్ని దేశ వ్యాప్తంగా ప్రచారం చేశాయి. అందుకు మొత్తం మీడియాకు మా ధన్యవాదములు. మూడవ రోజున ఇగాత్‌పురి దగ్గర కాసరాఘాట్ కొండ వాలుకు పాదయాత్ర దిగుతున్న ఆ సమయంలో మేం తీసిన వీడియోను ప్రసారం చేయడంతో మీడియా ప్రచారం ప్రారంభమయింది. ఎర్ర బ్యానర్లు, ఎర్ర టోపీలు ధరించిన పెద్ద సంఖ్యలో రైతాంగం మీడియాను మేల్కొల్పింది. తర్వాత దేశమంతా ఈ వీడియో విస్తారంగా ప్రాచుర్యం లోకి వచ్చింది. మీడియాలో ప్రచారం జరిగేకొద్దీ కొత్త కొత్త ప్రజానీకం మహారాష్ట్ర వ్యాప్తంగా వచ్చి ఈ ఉద్యమంలో చేరిపోయారు. ఈ ఉద్యమంలో చేపట్టిన నాలుగు ప్రధానమైన కోర్కెలు దేశవ్యాపిత రైతాంగ కోర్కెలు. అందువల్ల ఈ ఉద్యమ స్ఫూర్తి దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించింది.

మహారాష్ట్రలో ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలను కూడా జోడించాము. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల రైతాంగం దుస్థితిలో ఉంది. విదర్భ, మరాట్వాడా ప్రాంతాల్లో కాయతొలిచే పురుగువల్ల పత్తి రైతాంగం రూ॥లు 12వేలకోట్లు నష్టపోయారు. మేము వారికి తక్షణ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ ప్రాంతంలోనే రైతాంగం ఆత్మహత్యలు ఎక్కువ సంఖ్యలో జరిగాయి. నాసిక్, పాల్ఘర్, థానేజిల్లాల్లో నదుల అనుసంధానం ప్రాజెక్టు వల్ల ముంపుకు గురవుతున్న గ్రామాల్లోని వేలాది గిరిజనులు నిర్వాసితులవుతున్నారు. ఈ సమస్య పై మేము ప్రభుత్వానికి మెరుగైన ప్రత్యామ్నా యాన్ని సూచించాం. ఇలాంటి ఉమ్మడి సమస్య లను చేపట్టడం వల్ల రైతాంగం పెద్ద ఎత్తున ఐక్యమయ్యేందుకు అవకాశం ఏర్పడింది.

**థానే, ముంబాయి ప్రజానీకం నుండి ఈ ఉద్యమానికి గొప్ప సంఘీబావం లభించింది. వివరాలు తెల్పండి?**

అవును. మా పాదయాత్రకు పట్టణ ప్రజానీకం నుండి వెల్లువలా సహకారం లభించింది. వాస్తవంగా మేమూహించిన దానికంటే చాలా ఎక్కువగా ఈ సహకారం ఉంది. అక్కడి ప్రజలు పాదయాత్రలో పాల్గొన్నవారి కోసం తాగునీరు, పానకం, బిస్కట్లు, ఆహారం, పాదరక్షలు అందించి తమ మద్దతును ప్రకటించారు. వ్యవసాయ సంక్షోభంతో తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్న రైతాంగం గురించి మీడియా చేసిన ప్రచారం వల్ల పేద ప్రజలు న్యాయం కోసం చేస్తున్న పోరాటానికి పట్టణ ప్రజలు ప్రభావితమయ్యారు. అంతేకాదు. ఈ పాదయాత్ర పూర్తిగా ప్రశాంతంగా, క్రమశిక్షణాయుతంగా, ప్రజాతంత్ర యుతంగా, అహింసాయుత పద్ధతుల్లో కొనసాగడం పట్ల వారు గొప్పగా అభినందనలు తెల్పారు.

మార్చి12వ తేది పాదయాత్ర ముగింపు రోజు. ఆ రోజు 10వ తరగతి పరీక్షల బోర్డు రెండు పరీక్షలను నిర్వహించింది. ఆ పరీక్షలకు హాజరయ్యే పిల్లలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా మార్చి11న రోజంతా నడిచి కొద్ది విశ్రాంతితో మళ్లీ రాత్రంతా నడుస్తూ 12వ తేది ఉదయానికి దక్షిణ ముంబయిలోని అజాద్ మైదానం చేరుకున్నారు. మేము పాఠశాల విద్యార్థులపట్ల తీసుకున్న జాగ్రత్తలకు దేశవ్యాప్తంగా ప్రజల నుండి అభినందనలు లభించాయి.

**అజాద్ మైదానంలో వేదికపైన అనేక ఇతర రాజకీయ పార్టీల నాయకులు కనిపించారు. జయప్రదమైన లాంగ్ మార్చ్ నుండి రాజకీయ లబ్దిపొందేందుకే వారు అక్కడికి చేరుకున్నారా?**

ప్రారంభం నుండి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), పెజెంట్స్ & వర్కర్స్ పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీలు ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచాయి. కాంగ్రెస్, శివసేన, మహారాష్ట్ర నవ నిర్మాణ సేన, ది రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, సమాజ్‌వాది పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీల అగ్ర నాయకులు ఈ ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించారు. రాజకీయ పార్టీల విశాల మద్దతు వల్ల రైతాంగ ఉద్యమానికి అదనపు బలం చేకూరిందని మేము అభిప్రాయపడుతున్నాము. ఈ క్రమంలో భారతీయ జనతా పార్టీ ఎక్కడా కనిపించకపోవడాన్ని అందరూ గుర్తించారు.

మేము గట్టిగా పట్టుబట్టినందువల్ల మొదటిసారిగా రైతాంగ సమస్యలపై అధికార పూర్వకమైన ఒప్పందాన్ని సాధించగలిగాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ ఒప్పందానికి ఒక కవరింగ్ లెటర్ కూడా జతచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, రైతు సంఘానికి మధ్య జరిగిన ఈ ఒప్పందాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి అసెంబ్లీ ఆమోదం పొందాలన్న మా

> **“దేశవ్యాపితంగా పెల్లుబుకుతున్న రైతాంగ పోరాటాల్లో అంతర్భాగంగా ఈ పాదయాత్రను మనం చూడాలి. బిజెపి నాయకత్వంలో నడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈ పోరాటం ఎక్కు పెట్టబడింది. దేశంలో పెరుగుతున్న వ్యవసాయ సంక్షోభానికి వ్యతిరేకంగా పెరుగుతున్న రైతాంగ ప్రతిఘటనలకు ఒక సంకేతంగా ఈ పాద యాత్రను మనం చూడాలి.”**



రైతాంగానికి ఆహారం అందిస్తున్న ముంబై నగరవాసులు

డిమాండ్‌ను ముఖ్యమంత్రి అంగీకరించాడు. ఆ మేరకు మరునాడు ఒప్పందాన్ని ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం ఒప్పందానికి అసెంబ్లీ ఆమోద ముద్రవేసింది. గతంలో ఈ ప్రభుత్వం రైతాంగాన్ని పలుమార్లు మోసం చేసింది. అందుకే ఈ అధికార పూర్వక మైన ఒప్పందాన్ని సాధించటం ప్రాధాన్యత గల అంశంగా గమనించాలి. అంతేగాక ఈ ఒప్పందంలోని ప్రతి హామీ అమలుకు ప్రభుత్వ నుండి నిర్దిష్ట కాలపరిమితిని కూడా పొంద గలిగాం.

**ఇక్కడ ఒక పెద్ద దృశ్యం ఆవిష్కరించ బడుతున్నది. ప్రజల సమస్యలపై కార్యాచరణ తగ్గుతున్న సమయంలో ప్రజలకు కొన్ని అభి ప్రాయాలున్నాయని, వాటిని పాలకులు తప్పక విని తీరాలన్న వాస్తవాన్ని ఈ పాదయాత్ర నిరూపించింది. అనేక ఉద్యమాల్లో పాల్గొన్న నాయకుడిగా మీ అభిప్రాయం ఏమిటి?**

అవును. ఇది దీర్ఘ యాత్ర విజయం. దేశ వ్యాపితంగా పోరాడే శక్తులన్నింటికీ ఒక విశ్వా సాన్ని కల్గిస్తున్నది. ప్రజాస్వామ్యానికి, లౌకికతత్వా నికి ఒక ఉత్తేజాన్ని అందిస్తున్నది. ఇందులో ముఖ్యమైన అంశం, మండుటెండల్లో, రోజుల పర్యంతం చెప్పులు కూడా లేకుండా నడుస్తున్న పేద రైతాంగ స్త్రీ,పురుషుల సమాహారం దేశ ప్రజానీకాన్ని ఆకర్షించింది. వారిలో అనేకమంది పాదాలు కమిలి పోయాయి, బొబ్బలెక్కాయి. బొబ్బలు పగిలి రక్తం కారుతున్నా పట్టుదలతో, క్రమశిక్షణతో పాదయాత్రను కొనసాగించడం దేశ ప్రజల చైతన్యాన్ని తట్టిలేపింది. దేశంలో కొనసాగుతున్న ఆర్థిక, సామాజిక అసమానతల గురించి ఈ పాదయాత్ర అనేక వాస్తవాలను ప్రజానీకం దృష్టికి తేగలిగింది. అసమానతలకు, అన్యాయా లకు వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రజలకు ఈ ఉద్యమం ఉత్తేజాన్నిస్తుందని గట్టిగా నమ్ము తున్నాను.

దేశవ్యాపితంగా పెల్లుబుకుతున్న రైతాంగ పోరాటాల్లో అంతర్భాగంగా ఈ పాదయాత్రను మనం చూడాలి. బిజెపి నాయకత్వంలో నడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానా లకు వ్యతిరేకంగా ఈ పోరాటం ఎక్కు పెట్ట బడింది. దేశంలో పెరుగుతున్న వ్యవసాయ సంక్షోభానికి వ్యతిరేకంగా పెరుగుతున్న రైతాంగ ప్రతిఘటనలకు ఒక సంకేతంగా ఈ పాద యాత్రను మనం చూడాలి. సరళీకృత ఆర్థిక విధానాల అమలుకు నిరసనగా దేశవ్యాప్తంగా సాగుతున్న రైతాంగ ప్రతిఘటనోద్యమాలు మరింత సంఘటితమ య్యేందుకు ఈ పాద యాత్ర తప్పక దోహదపడుతుందని ఆశిస్తు న్నాను. ప్రజలు నూతన ఆర్థిక విధానాలను తిప్పికొట్టగలరని భావిస్తున్నాను. మరొక ముఖ్య మైన అంశం. కులం, మతం, జాతి ఆటంకా లను ఈ పోరాటం అధిగమించింది. రైతాంగం సంఘటితమయ్యారు. ఒక వర్గంగా ఉద్యమించి ముందుకు సాగారు. బిజెపి, ఆరెస్సెస్‌ల మతో న్మాద, కులోన్మాద విచ్ఛిన్నకర శక్తుల కుట్రలను సమర్థవంతంగా ప్రతిఘటించేందుకు పోరాట మార్గమే ఏకైక పరిష్కారమని పాదయాత్ర అంతిమ విశ్లేషణలో మనకు అర్థమవుతున్నది.

**అణగారిన ప్రజలపక్షాన పోరాడే ఏకైక శక్తిగా వామపక్షం ప్రాధాన్యత మనకు అర్థమవుతున్నది. మీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటి?**

దేశంలోనే మెజారిటీగా ఉన్న రైతాంగం, ఆర్థిక దోపిడీకి, సామాజిక పీడనకు గురవుతున్న వారందరి పక్షాన వామపక్షం ఆవిర్భావం నుండి అంకిత భావంతో కృషి చేస్తున్నది. అభివృద్ధి నిరోధకులు, అరాచకంతో ఎన్ని లెనిన్ విగ్రహాల నైనా కూల్చేయవచ్చు. కానీ, వామపక్షాల ప్రాధాన్యత అవిచ్ఛినంగా నిలబడుతుంది. రాబోయే కాలంలో వామపక్ష ఉద్యమం వేగంగా అభివృద్ధి అయి తీరుతుందన్న విశ్వాసం నాకుంది.

ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఎఐకెఎస్ కేంద్ర కమిటీ సమావేశంలో మా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకున్నాం. రైతాంగం ఋణాల రద్దు, పంటల గిట్టుబాటు ధరల అంశంపైన రైతాంగం నుండి దేశ వ్యాప్తంగా పదికోట్ల సంతకాలు సేకరించాలని మేము నిర్ణయించుకున్నాం. ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమం 76వ వార్షికోత్సవం సందర్భంగా లక్షలాది మంది రైతాంగాన్ని సమీకరిస్తాం. ఈ సంతకాలను దేశంలోని ప్రతి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తాం. ఈ డిమాండ్ల సాధనకు దేశ వ్యాప్తంగా శాంతియుతంగా జైల్‌భరో ఆందోళనలు చేస్తాం. ఇదే కాలంలో గిరిజనులకు భూమి హక్కుల చట్టం అమలు, మరికొన్ని రైతాంగ స్థానిక సమస్యలపై అనేక పోరాటాలను నిర్వహిస్తాం. ఆటంకాలను అధిగమించగల మన్న విశ్వాసంతో మేమున్నాం.

**ఇంటర్వ్యూ చేసినవారు:**
**అనుపమ కటకం (ఫ్రంట్‌లైన్)**
**అనువాదం: వై సిద్ధయ్య**

# రాజ్యాంగ ఫెడరల్ స్వభావాన్ని గౌరవించండి



రచయిత
కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి

పినరయి విజయన్

ఆర్థిక వనరుల సమీకరణను, పంపిణీని చేసే క్రమంలో రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య సమతుల్యత ఉండేలా చూడటానికి మన రాజ్యాంగంలో చేసిన ఏర్పాటే ఆర్థిక సంఘం. ఐదేళ్ళకొకసారి ఈ ఆర్థిక సంఘం ఏర్పాటౌతుంది. ప్రస్తుతం 15వ ఆర్థికసంఘం ఆ విధంగానే ఏర్పడింది.

ఈ ఆర్థిక సంఘం ఏయే అంశాలను పరిశీలించి సిఫార్సులను రూపొందించాలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. మోడీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలు పలు రాష్ట్రాలలో ఆందోళనలను, అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఆర్థికసంఘానికి సంబంధించి సూత్రబద్ధమైన వైఖరి ఎలా ఉండాలి?

1. భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగంలోని ఒకటవ అధికరణం చెప్తోంది. ఈ సమాఖ్య స్ఫూర్తితో దేశం సమైక్యంగా ఉండాలంటే కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య అధికారాలను, ఆర్థిక వనరులను పంపిణీ చేయడంలో సమన్యాయం ఉండాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ నిష్పక్షపాతంగా జరిగేలా చూడడం ఆర్థిక సంఘం మొదటిలక్ష్యంగా ఉండాలి.

రాజ్యాంగంలోని 7వ అధికరణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధులేమిలేమిటో విభజించి చూపుతుంది. ప్రజల జీవన ప్రమాణాలను, ఆదాయాలను మెరుగుపరచడం, వారికి బతుకు తెరువు కల్పించడం, వనరులను, పర్యావరణాన్ని కాపాడటం వంటివి రాష్ట్రాల బాధ్యతలుగా రాజ్యాంగం పేర్కొంటున్నది. ఇటువంటి ముఖ్యమైన జాతి నిర్మాణ బాధ్యతలు రాష్ట్రాలకు కేటాయించినప్పటికీ, అందుకవసరమైన ఆర్థిక వనరులన్నీ ప్రధానంగా కేంద్రం అజమాయిషీలోనే ఉన్నాయి.

రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను నెరవేర్చడానికి అవసరమైన వనరులు రాష్ట్రాల చేతుల్లో లేవు. అటువంటి వనరులను సొంతంగా సమీకరించుకొనే అధికారాలూ రాష్ట్రాలకు లేవు. ఆ విధంగా మన ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థలో ఒక తీవ్రమైన అసమతుల్యత ఉంది. రాష్ట్రాలతో పోల్చితే కేంద్రానికి ఆర్థిక వనరులను సమీకరించగల శక్తి చాలా ఎక్కువ. కాగా, రాష్ట్రాల ఆర్థిక వనరుల సమీకరణశక్తితో పోల్చితే అవి చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలు చాలా ఎక్కువ. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించే బాధ్యతను రాజ్యాంగం ఆర్థిక సంఘానికి అప్పజెప్పింది. కాబట్టి ఆర్థిక సంఘం మొట్టమొదటి బాధ్యత కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య ఆర్థిక వనరుల పంపిణీ చేయడం. ఈ పంపిణీకి ఎటువంటి ముందస్తు షరతులూ ఉండరాదు. కేంద్రం తలపెట్టిన ప్రత్యే క పథకాలేమైనా ఉంటే, వాటి అమలు నిమిత్తం రాష్ట్రాలకు నిధులు కేటాయించవలసివస్తే, అటువంటి గ్రాంట్లు అదనం.

పెద్దనోట్ల రద్దు, జిఎస్టి అమలు కావడంతో ఒకేసారి రెండువైపుల నుండి కాష్ట్రాల ఆర్థిక వనరులకు పెద్ద గండి పడినట్లైంది. ముఖ్యంగా జిఎస్టి వలన ఇబ్బంది మరీ ఎక్కువైంది. రాష్ట్రాలు తమ పరిధిలో ఆర్థిక వనరులను సమీకరించుకొనే స్వేచ్ఛను కోల్పోయాయి. తమకు తాముగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి ప్రధానమైన ఆర్థిక వనరు అంటూ ఏదీ లేకుండాపోయింది. ఈ నేపథ్యం లో 15వ ఆర్థిక సంఘం ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశం రాష్ట్రాల ఆర్థిక వనరు లను ఏ విధంగా బలోపేతం చేయాలన్నదే.

రెండవ అంశం: 2011 జనాభాలెక్కల ప్రాతిపదికన వనరులను కేటాయించే అంశం. ఏ రాష్ట్రాలైతే విజయవంతంగా జనాభా పెరుగుదలను నియంత్రించాయో ఆ రాష్ట్రాలకు కేటాయింపులు తగ్గిపోతాయి. ఇలా జనాభా పెరుగుదలను నియంత్రించడానికి ఆ రాష్ట్రాలు తమ ఆర్థిక వనరులను చాలా ఖర్చు చేశాయి. విద్య, వైద్యం, కుటుంబ సంక్షేమం వంటి కార్యక్రమాలపై దృష్టి పెట్టి, వనరులను ఖర్చుచేసి ప్రజలు స్వచ్ఛందంగా జనాభా నియంత్రణకు సహకరించేలా ప్రోత్సహించాయి. జనాభా పెరుగుదలను నియంత్రించడమంటే రాష్ట్రాలు ఎక్కువ ఖర్చుచేయడమన్నమాట. జనాభా పెరుగుదలను నియంత్రించడం వలన ఇంకొక పర్యవసానం కూడా ఉంది. జనాభాలో వృద్ధుల శాతం బాగా పెరుగుతుంది. ఈ వృద్ధుల సంక్షేమానికి మరింత ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ బాధ్యత కూడా రాష్ట్రాలదే కదా. ఈ విధంగా పెరిగిన బాధ్యతను కూడా పరిగణనలోకి తీసుకుని ఆ రాష్ట్రాలకు తగు విధంగా అదనపు నిధులను కేటాయించాలి కదా. అలా కాకుండా జనాభా పెరుగుదల రేటు తగ్గింది కాబట్టి నిధుల కేటాయింపు తగ్గిద్దాం అనే వైఖరి తీసుకోవడం తప్పు.

ఇక మూడవది: రాష్ట్రాలు తమ ఆర్థిక వ్యవహారాలను నిర్వహించాల్సిన దిశ ఎలా ఉండాలో నిర్దేశించడం. కేంద్రం చేసిన ఈ ప్రతిపాదన ఖచ్చితంగా రాజ్యాంగం ఆర్థిక సంఘానికి నిర్దేశించిన హద్దులను దాటిపోయి, రాష్ట్రాల హక్కులను ఉల్లంఘిస్తున్నది. ఇది కేంద్ర ప్రభుత్వం తన సైద్ధాంతిక, ఆర్థిక ఎజండాను రాష్ట్రాలపై బలవంతాన రుద్దడం తప్ప వేరొకటి కాదు. ఏ విధానాలను చేపట్టి తమ తమ రాష్ట్రాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో నిర్ణయించాల్సింది ఆక్కడ ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వాలు తప్ప కేంద్రం కాదు.

నాలుగో అంశం: మరీ అభ్యంతరకరంగా ఉంది. "రాష్ట్రాల రెవెన్యూ లోటును భర్తీ చేయడానికి గ్రాంట్లు ఇవ్వాల్సిన అవసరం ఉందా? లేదా?" అన్న విషయాన్ని 15వ ఆర్థిక సంఘం పరిశీలించాలని కేంద్రం కోరింది. ఇది రాష్ట్రాలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల అమలుకు

అదనపు వనరుల సమీకరణ తప్పనిసరి. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను రూపొందించుకుంటుంది. ముఖ్యంగా విద్య, వైద్యం వంటి రంగాలలో పెట్టే ఖర్చు దీర్ఘకాలంలో ఫలితాలనిస్తుంది. అందువలన రాష్ట్రాల బడ్జెట్‌లో ఏర్పడే రెవెన్యూలోటును స్వల్పకాల వ్యవధిలో పూడ్చుకోడం సాధ్యమయేదికాదు. అందుకే రెవెన్యూలోటును భర్తీచేసేందుకు కేంద్రం వైపు నుండి ప్రత్యేకంగా గ్రాంటు ఇచ్చే విధానం వచ్చింది. ఇప్పుడు ఈ విధానాన్ని కొనసాగించాలా? వద్దా? అన్న చర్చకు తెర తీయడమంటే అది వాస్తవంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిపై ఎక్కుపెట్టిన దాడిగా భావించాలి. ఇది కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో కీలకం అయిన "సహకార ఫెడరలిజం" అనే సూత్రానికి పూర్తి విరుద్ధం.

ఐదో అంశం: "కేంద్రం కట్టుబడివున్న ఖర్చు". మొత్తం వనరులలో కేంద్ర, రాష్ట్రాల వాటాలను పంపిణీ చేశాక, ఎవరి ప్రాధాన్యతలను బట్టి వారు తమ వనరుల నుండి కేటాయించుకోవచ్చు. అలాగాక, ముందు కేంద్రం ప్రాధాన్యతల కనుగుణంగా వనరులను కేటాయించాక మిగిలిన దానిలో రాష్ట్రాలకు కేటాయించాలనే ఈ ప్రతిపాదన ఫెడరలిజానికి భిన్నమైనది.

ఇక అసాధారణమైన ఆరో అంశం: రాష్ట్రాలు తమ ప్రభుత్వాలను నిర్వహించిన తీరును బట్టి కొన్ని ప్రోత్సాహకాలను ఇవ్వడం. ఇప్పుడు ద్రవ్యలోటు నియంత్రణ, స్థానిక సంస్థలకు నిధులు, విధుల వికేంద్రీకరణ, జనాభా నియంత్రణ వంటివి కొన్ని కొలబద్దలు ఉన్నాయి. ఇవిగాకుండా ఇంకా ఏమేమి కొలబద్దలు ఉండాలనేది కేంద్రం, రాష్ట్రాలు చర్చించుకుని అంగీకారానికి వచ్చి అమలు జరపడం పద్ధతి. అలాగాక, ఏకపక్షంగా ఆర్థిక సంఘానికి ఈ పనిని అప్పజెప్పడం అంటే రాష్ట్రాల పరిధిలోకి కేంద్రం చొరబడడమే. విద్య, వైద్యం, అడవుల యాజమాన్యం, ప్రజాపంపిణీ వ్యవస్థ, వ్యవసాయోత్పత్తి వంటి అంశాలకు సంబంధించి కొలబద్దలను పెట్టడమంటే రాష్ట్రాల సూక్ష్మ వ్యవహారాలలోకి కేంద్రం చొరబడటమే. ఈ రంగాలలో వివిధ రాష్ట్రాలు కొంతమేరకన్నా అభివృద్ధిని సాధించాయంటే అందుకు కారణం ప్రోత్సాహకాలు కాదు, ఆయా రాష్ట్రాలు తమ స్వంత చొరవతో, తమ ప్రత్యేక పరిస్థితుల కనుగుణంగా కృషిచేయడం ప్రధానకారణం. కనుక, "కొలవడానికి వీలయే విధంగా

> **"విద్య, వైద్యం, అడవుల యాజమాన్యం, ప్రజాపంపిణీ వ్యవస్థ, వ్యవసాయోత్పత్తి వంటి అంశాలకు సంబంధించి కొలబద్దలను పెట్టడమంటే రాష్ట్రాల సూక్ష్మ వ్యవహారాలలోకి కేంద్రం చొరబడటమే. ఈ రంగాలలో వివిధ రాష్ట్రాలు కొంతమేరకన్నా అభివృద్ధిని సాధించాయంటే అందుకు కారణం ప్రోత్సాహకాలు కాదు, ఆయా రాష్ట్రాలు తమ స్వంత చొరవతో, తమ ప్రత్యేక పరిస్థితుల కనుగుణంగా కృషిచేయడం ప్రధానకారణం."**



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న కేరళ ఆర్థిక శాఖామంత్రి థామస్ ఐజాక్

లక్ష్యాలను నిర్దేశించడం, దానిని బట్టి ప్రోత్సాహకాలను ఇవ్వడం" అంటే రాజ్యాంగం నిర్దేశించిన ఫెడరల్ స్వభావాన్ని దెబ్బతీయడమే. రాష్ట్రాల రోజువారీ పరిపాలన ఏ విధంగా సాగాలనేది ఆ రాష్ట్రాలు నిర్ణయించుకోగలవు. ఇది ఆర్థిక సంఘం పని కానేకాదు. ఏ పథకం రాజకీయ పలుకుబడిని పెంచుకునే అక్కంతో అమలు జరుగుతోంది? ఏది కాదు? అనేది నిర్ధారించే పని ఆర్థిక సంఘానిది కాదు. సంక్షేమంలో భాగంగా పేదలకు పెన్షన్లను ఇవ్వడంగాని, కొన్ని బలహీన తరగతుల ప్రజలకు చౌకగా ఆహారధాన్యాలను అందించడం గాని, ఇతరత్రా పేదలకు ఊరట కలిగించే కార్యక్రమాలు గాని "రాజకీయ పలుకుబడి కార్యక్రమాల"ముద్రవేసి వాటిని రాష్ట్రాలు చేపట్టకుండా, అటువంటి కార్యక్రమాలకు ఆర్థిక తోడ్పాటు అందించకుండా చేయడానికి, మరోవైపు కేంద్రం తన అజెండాను రాష్ట్రాలపై రుద్దడానికి ఇది దారి తీస్తుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వాల స్వయం ప్రతిపత్తిపై దాడి.

ఏడవ అంశం: పేదలకు కేటాయించటం కోసం కేంద్రం చేతుల్లో ఉండే ఆర్థిక వనరులు కుదించుకుపోయాయన్న వాదన. 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులను అమలుచేసిన కారణంగా రాష్ట్రాలకు కేటాయించే నిధుల వాటా 32 శాతం నుండి 42 శాతానికి పెరిగిందని, ఫలితంగా కేంద్రం వాటా తగ్గిపోయిందని ఒక వాదనను ముందుకు తెస్తున్నారు. ఈ వాదన వాస్తవ విరుద్ధంగా ఉంది. 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులను అమలు చేసే క్రమంలో కేంద్రప్రాయోజిత పథకాలకు కేటాయించే నిధులకు కోతబెట్టారు. ఈ కోత పెట్టిన భాగం దాదాపుగా పెరిగిన రాష్ట్రాల వాటాతో సమానంగా ఉంది.

నిజానికి స్థూలజాతీయోత్పత్తిలో శాతంగా చూస్తే రాష్ట్రాలకు దక్కుతున్న వాటా క్రమేపీ తగ్గిపోతోంది. పైగా అభివృద్ధి కార్యక్రమాలబాధ్యత నుండి కేంద్రం క్రమంగా వెనక్కి తగ్గి ఆ బాధ్యతను మొత్తంగా రాష్ట్రాలపైకే నెట్టివేసేందుకు ప్రయత్నిస్తోంది. దీనిని ఆర్థిక సంఘం గనుక అంగీకరిస్తే కేంద్రం వాటా తగ్గకపోగా వాస్తవంగా మరింతగా పెరుగుతుంది.

భారతదేశపు విశిష్టత, శక్తి దాని భిన్నత్వంలో ఉంది. వివిధ రాష్ట్రాలు వివిధ, ప్రత్యేక మార్గాలలో అభివృద్ధి విధానాలను చేపడతాయి. ఆ క్రమంలో మాత్రమే వెనుకబాటుతనాన్ని అధిగమించి సమన్యాయాన్ని సాధించడం సాధ్యపడుతుంది. ఒక ప్రజాతంత్రయుత విధానం ద్వారా కేంద్రానికి, రాష్ట్రాలకు నడుమ ఆర్థిక వనరులను పంపిణీ చేయడం ద్వారా మాత్రమే ఇది జరగాలి.

**స్వేచ్ఛానువాదం: ఎంవిఎస్ శర్మ**

# అత్యాచారాలకు చిరునామా సంఘ్ పరివార్



రచయిత ప్రజాశక్తి న్యూఢిల్లీ ప్రతినిధి

**జగదీష్**

దేశంలో మహిళలపై అత్యాచారానికి సంబంధించి రెండు ఘటనలు యావత్తు భారతదేశాన్నే కుదిపేస్తున్నాయి. ఆయా ఘటనల్లోని మానవ మృగాలను కాపాడేందుకు బిజెపి, ఆరెస్సెస్ పెద్దలు చాలా కష్టపడుతున్నారు. నిందితులకు మద్దతుగా ఏకంగా ఆందోళనలు చేస్తున్నారు. దేశంలో సంచలనం కలిగించిన రెండు ఘటనలు చాలా ఆలస్యంగా దేశప్రజల దృష్టికి వచ్చాయి. ఒకటి బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావోలో ఉద్యోగం కోసం వెళ్లిన 16 ఏళ్ల అమ్మాయిని బిజెపి ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ మానభంగం చేశాడు. రెండోది బిజెపి, పిడిపి భాగస్వామ్య పాలిత జమ్మూ కశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఎనిమిదేళ్ల ముస్లిం(బకర్వాల్) పసిమొగ్గను కిడ్నాప్ చేసి, దేవాలయంలో ఉంచి, డ్రగ్స్ ఇచ్చి, నాలుగు రోజుల పాటు అక్కడే సామూహిక అత్యాచారం చేసి, చివరకు అతి కిరాతకంగా హత్య చేశారు. ఈ రెండు ఘటనల్లో రెండు అంశాలు ఒకదానికొకటి అనుసంధానంగా ఉన్నాయి. మొదటి అంశం, ఈ రెండు ఘటనల లోనూ నేరస్తులు బిజెపి నాయకులు, కార్యకర్తలే. రెండో అంశం బాధితులిద్దరు నిరుపేదలు. ఒక ఘటనలో హిందువు, మరో ఘటనలో ముస్లీం బాలికలు బాధితులు. అంటే దేశంలో హిందువులైనా, ముస్లీంలైనా బాలికలు, మహిళలకు రక్షణ లేదని స్పష్టంగా కనబడుతున్నది. ప్రస్తుతం ఈ రెండు ఘటనలు యావత్తు భారత దేశాన్నే కుదిపేస్తున్నాయి. మీడియా, సామాజిక మాధ్యమాల్లో తీవ్రస్థాయిలో చర్చ ఖండాంతరాలు దాటింది. దేశంలో మేథావులు, విద్యార్థులు, మహిళలు, యువత, సినిమా పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఆందోళనలో భాగస్వాములు అయ్యారు. ఈ రెండు ఘటనలే కాకుండా ఇటీవలి మరో రెండు ఘటనలు బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే చోటు చేసుకున్నాయి. బిజెపి పాలిత ప్రధాని మోడీ స్వరాష్ట్రం గుజరాత్‌లోని సూరత్‌లో ఓ మైనర్ బాలిక(11)ను వారం రోజులు లైంగిక దాడి చేసి, చిత్రహింసలు పెట్టిన మృగాళ్లు, చివరికి గొంతునులిమి హత్య చేశారు. ఏప్రిల్ 6న సూరత్‌లోని భెస్తన్‌లోని క్రికెట్ మైదానంలో బయటపడ్డ బాలిక మృతదేహంపై 86 గాయాలు ఉన్నాయని పోస్ట్‌మార్టం రిపోర్టు తెలిపింది. బిజెపి, జెడియు భాగస్వామిగా పాలిస్తున్న బీహార్‌లోని రోహతస్ జిల్లాలో ఆరేళ్ల బాలిక రేప్‌కు గురైంది. ఈ నాలుగు ఘటనల్లో బాధితులు మైనర్లే.. ముక్కుపచ్చలారని చిన్నారులే. పేదవారే. దేశంలో చిన్నపిల్లలపై దాడులు పెరిగాయనడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) నివేదిక స్పష్టం చేసింది. ఎన్సీఆర్బీ ప్రకారం చిన్నారులపై 2016లో 1,06,958(24.0శాతం) దాడులు జరగగా, 2015 కంటే 2016లో 8.3శాతం దాడులు పెరిగాయి. ఈ దాడుల్లో బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మహారాష్ట్రలో రోజుకు 12 మంది మహిళలు అత్యాచారాలకు బలవుతున్నట్టు గత ఏడాది ఆ రాష్ట్ర క్రైం బ్యూరో రికార్డ్స్ స్పష్టం చేస్తున్నాయి. ముంబై పోలీసుల గణాంకాల ప్రకారం గత ఏడాది నగరంలో 751 మంది స్త్రీలు అత్యాచారానికి గురైతే, అందులో 284 మంది పసిమొగ్గలు, మైనర్లే. మహారాష్ట్రలో 2017లోనే దాదాపు 2,300 మంది పసిపిల్లలపై అత్యాచారాలు జరిగాయి. మధ్యప్రదేశ్‌లో గతేడాది 12,068 మంది చిన్నారులు అదృశ్యమయ్యారు.

**కథువాలో ఏం జరిగింది?**

జమ్మూ కశ్మీర్‌లోని కథువా జిల్లా రసన గ్రామంలో చిన్న భూవివాదం కారణంగానే విద్వేషంతో అన్నెంపున్నెం ఎరుగని పసిపాపపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. అంతేకాదు ఆ తెగను ఆగ్రామం నుంచి బహిష్కరించాలని పెత్తందార్లు నిర్ణయించారు. ఈ వివాదం సందర్భంలో ఆ చిన్నారి అక్కడే ఉంది. అప్పుడే ఈ మానవ మృగాలు ఆచిన్నారిపై కన్నేశారు. బకర్వాల్ అనే సంచార తెగవాసులు రసన ప్రాంతంలో గుర్రాలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భూముల వ్యవహారం, పొలాల్లో గుర్రాలను మేపే అంశంపై ఈ తెగవారికి, గ్రామంలో ఉన్నత వర్గాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ మాజీ ఉద్యోగైన సాంజీ రామ్ బకర్వాల్ తెగపై కక్ష గట్టాడు. ఆ సంచార తెగను ఆ ప్రాంతం నుంచి తరిమేయాలని కుట్ర పూనాడు. ప్రతీకారం కోసం జనవరి 7న తన మేనల్లుడితో పాటు ప్రత్యేక పోలీసు అధికారులు దీపక్ కజూరియా, సురేందర్ కుమార్‌లను సాంజీ రామ్ సంప్రదించాడు. వారికి వేరువేరుగా బాధ్యతలు అప్పగించాడు. ఆ తెగకు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారం చేయాలని మేనల్లుడికి సూచించాడు. ఆ చిన్నారి గుర్రాలను మేపడానికి సాంజీరామ్ ఇంటి వెనుక నుంచి అడవుల్లోకి వెళుతుంటుంది. ఆ చిన్నారి అపహరణ, అత్యాచారానికి ప్రణాళిక రచించిన మేనల్లుడు, ఈ విషయాన్ని తన స్నేహితుడు పర్వేశ్ కుమార్‌తో పంచుకున్నాడు. జనవరి 9న వీరిద్దరూ కలిసి హీరానగర్ వెళ్లి, మత్తు పదార్థాన్ని కొనుగోలు చేశారు. ఆ ముందు రోజు తప్పిపోయిన తన గుర్రాల గురించి ఓ మహిళను ఆరాతీస్తున్న ఆ చిన్నారి సాంజీరామ్, అతడి మేనల్లుడి కంట పడింది. తాము ఆ గుర్రాలను చూశామని నమ్మబలికిన సాంజీ రామ్, అతని మేనల్లుడు, పర్వేశ్ కుమార్‌లు ఆ చిన్నారిని సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లారు. మత్తుమందు ఇచ్చిన మేనల్లుడు ఆమెపై అత్యాచారం చేశాడు. పర్వేశ్ కూడా అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ

తరువాత వారు సాంజీరామ్ ఆధ్వర్యంలో సమీప దేవాలయంలో పాపను బంధించారు. జనవరి 11న బాలిక తల్లిదండ్రులు ఆ గుడివద్దకు వెళ్లి, తమ కుమార్తె గురించి వెతికారు. బంధువులు ఇంటికి వెళ్లిందేమోనని సాంజీరామ్ బదులి చ్చాడు. వెంటనే ఆ చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి పెద్దగా స్పందన లేదు. అమ్మాయి అదృశ్యం కేసుకింద నామమాత్రపు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. అదే రోజున అతడి మేనల్లుడు మీరట్‌లో చదువుకుంటున్న సాంజీరామ్ కుమారుడు విశాల్ జంగోత్రాకు ఫోన్ చేశాడు. అత్యాచారంపై ఆసక్తి ఉంటే రసన గ్రామానికి రావాలని చెప్పాడు. దాంతో జనవరి 12న విశాల్ రసనకు చేరుకున్నాడు. జనవరి 13న ఉదయం 8.30గంటల సమయంలో సాంజీరామ్, అతడి కుమారుడు విశాల్, మేనల్లుడు, పర్వేశ్‌లు గుడి వద్దకు చేరుకున్నారు. ఆ చిన్నారిని విశాల్, మేనల్లుడు రేప్ చేశారు. ఆ రోజు సాయంత్రం ఆ చిన్నారిని చంపేయాలని సాంజీరామ్ సూచించాడు. మేనల్లుడు, విశాల్, పర్వేశ్‌లు ఆ చిన్నారిని ఒక కల్వర్ట్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి ప్రత్యేక పోలీసు అధికారి దీపక్ కజూరియా కూడా చేరుకున్నాడు. ఆ చిన్నారిని చంపేసే లోగా తానూ అత్యాచారం చేయాలనుకుంటున్నట్లు దీపక్ చెప్పాడు. అతడితో పాటు మేనల్లుడు కూడా అత్యాచారం చేశారు. ఆ తరువాత ఆ చిన్నారి మెడకు దీపక్ ఉచ్చు బిగించగా, మేనల్లుడు ఒక రాయితో ఆమెను రెండు సార్లు కొట్టి చంపేశాడు. మృత దేహాన్ని అడవిలో పడేశారు. అలా నాలుగు రోజుల పాటు బాలికకు తిండి పెట్టకుండా, మత్తులో ఉంచి వంతుల వారీగా అత్యాచారానికి పాల్పడి చివరికి దారుణంగా కడతేర్చారు. జనవరి 17న

**"ఆ రోజు సాయంత్రం ఆ చిన్నారిని చంపేయాలని సాంజీరామ్ సూచించాడు. మేనల్లుడు, విశాల్, పర్వేశ్‌లు ఆ చిన్నారిని ఒక కల్వర్ట్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి ప్రత్యేక పోలీసు అధికారి దీపక్ కజూరియా కూడా చేరుకున్నాడు. ఆ చిన్నారిని చంపేసే లోగా తానూ అత్యాచారం చేయాలనుకుంటున్నట్లు దీపక్ చెప్పాడు. అతడితో పాటు మేనల్లుడు కూడా అత్యాచారం చేశారు."**



కథువాలో అత్యాచారం, హత్యకు గురైన అసిఫా

సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆ చిన్నారి మృతదేహం దొరికింది. ఆ చిన్నారి మృత దేహాన్ని ఖననం చేసేందుకు కూడా అగ్రవర్ణ పెత్తందార్లు అనుమతి ఇవ్వలేదు. బాలిక కుటుంబం తమ సొంత భూమిలో మృత దేహాన్ని ఖననం చేయబోయినా పెత్తందార్లు అడ్డుకున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వారు ఎనిమిది కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళి అడవిలో ఖననం చేశారు. అంతకు ముందు మృత దేహాన్ని పోస్ట్‌మార్టంకు పంపించారు. ఆ చిన్నారికి డ్రగ్స్ ఇచ్చి దారుణంగా సామూహికంగా రేప్ చేసినట్లు ఫోరెన్సిక్ రిపోర్టు స్పష్టం చేసింది. దీనిపై దర్యాప్తు జరిపిన స్థానిక పోలీసులు దీపు భయ్యా అనే 15 ఏళ్ల బాలుడిని ప్రధాన నిందితుడిగా కేసు దాఖలు చేశారు. ఆ బాలుడు అమాయకుడని స్థానికులు చెప్పడం, మొదట పోలీసుల చిత్రహింసలతో నేరాన్ని తనపై వేసుకున్న ఆ బాలుడు ఆ తరువాత తాను కాదని చెప్పడం స్థానికంగా సంచలనం సృష్టించింది. ఈ ఘోరాన్ని కప్పి పుచ్చేందుకు సాంజీరామ్ స్థానిక పోలీసులకు మూడు విడతల్లో లంచమిచ్చాడు. ఎస్సై ఆనంద్ దత్తా, కానిస్టేబుల్ తిలక్ రాజ్‌లు ముడుపులు తీసుకొని, నిందితులను రక్షించేందుకు ప్రయత్నించారు. సాక్ష్యాలను తారుమారు చేశారు. దాంతో వాస్తవాలు మరుగున పడ్డాయి. వెంటనే జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ఈ కేసు విచారణ నిమిత్తం క్రైం బ్రాంచ్‌కి అప్పగించింది. క్రైం బ్రాంచ్ పోలీసు బృందం జనవరి 23న ఈ కేసును టేకప్ చేసింది. పోలీస్ బృందం 22 మంది సాక్షులను విచారించిన తరువాత గ్యాంగ్ రేప్ కింద 18 పేజీల చార్జిషీట్ దాఖలు చేసింది. ఎనిమిది మంది నిందితులపై లైంగిక దాడి, సాక్ష్యాల తారుమారు, నేరపూరిత కుట్ర వంటి అభియోగాలతో రెండు చార్జిషీట్లు దాఖలు

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్**– 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్,
డోర్ నెం:27-30-4 ఆకులవారి వీధి,
గవర్నరుపేట, విజయవాడ-2

> "మళ్లీ బాధితురాలి తల్లి ఈ ఏడాది ఫిబ్రవరి 12న మరోసారి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసింది. ప్రధాని, రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేశారు. ఈ రెండో ఫిర్యాదు కూడా అధికార బిజెపికి చెందిన ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్‌పైన ఉండటంతో సిఎం యోగి పట్టించుకోలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. కానీ ఆయుధ చట్టం ఉల్లంఘన కింద పోలీసులు బాధితురాలి తండ్రి సురేంద్ర సింగ్‌పై ఏప్రిల్ 3న కేసు నమోదు చేశారు."



మృతురాలు అసిఫాకు న్యాయం చేయాలని కోరుతూ ప్రదర్శన

అయ్యాయి. అందులో భాగంగానే పోలీసులు మూడు రోజుల్లోనే ఆ బాలున్ని, సాంజీరామ్, పర్వేశ్ కుమార్, విశాల్ జంగోత్రా, ఆనంద్ దత్తా, తిలక్ రాజ్‌లతో పాటు దీపక్ కజారియా, సురీందర్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. దీపక్ కజారియా, సురీందర్ కుమార్‌లు కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక భద్రతా దళానికి చెందినవారు. దాన్ని ఆధారం చేసుకుని సైన్యాన్నే అరెస్టు చేస్తారా అని బిజెపి రెచ్చిపోయింది. అరెస్టు అయిన వారంతా అగ్రవర్ణానికి చెందిన హిందువులు. కాబట్టీ వీరికి మద్దతుగా ఫిబ్రవరి 14, 17 తేదీల్లో బిజెపి, ఆరెస్సెస్ కార్యకర్తలు ప్రదర్శనలు జరిపారు. ఫిబ్రవరి 22న కథువా జాతీయ రహదారి దిగ్బంధనానికి పాల్పడారు. అప్పుడే కొత్తగా "హిందూ ఏక్తా మార్చ్"ను ఏర్పాటు చేసిన కశ్మీర్ బిజెపి ప్రధాన కార్యదర్శి, న్యాయవాది విజయ్ వర్మ ఫిబ్రవరి 17న నిందితులకు మద్దతుగా భారీ ర్యాలీ తీశారు. ఆ ర్యాలీలో కథువా బిజెపి అధ్యక్షుడు విజయ్ శర్మతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలోని పరిశ్రమల శాఖ మంత్రి సిపి గంగా, అటవీ శాఖ మంత్రి లాల్ సింగ్‌లు హాజరయ్యారు. ఈ ఇద్దరు మంత్రులు ఏప్రిల్ 14న రాజీనామా చేశారు. దేవాలయాల గురించి, దేవుడు గురించి గొంతుచించుకునే హిందూత్వ సేనలు, ఆరెస్సెస్, బిజెపిలు దేవాలయంలో అభం శుభం ఎరగని చిన్నారిని రేప్ చేస్తే..రేపిస్టులకు మద్దతుగా వారు నిలబడటం వారి దైవభక్తి బండారాన్ని బట్టబయలు చేస్తున్నది. మరోవైపు ఈ ఘటనపై న్యాయపోరాటం చేస్తోన్న మహిళ న్యాయవాది దీపిక సింగ్ రజావత్‌పై అత్యాచారం చేస్తామని, చంపుతామని సహచర న్యాయవాదులు, హిందూత్వ శక్తులు బెదిరింపులకు దిగుతున్నారు. ఆమె బార్ కౌన్సిల్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేశారు. ప్రస్తుతం కథువా కేసు విచారణ ఢిల్లీ హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో సాగుతుంది.

### ఉన్నావోలో ఏం జరిగింది?

ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, కాన్పూర్ మధ్య పారిశ్రామిక ప్రాంతం ఉన్నావోకు సమీపంలో మాఖి గ్రామంలో బంగర్‌మావ్ బిజెపి ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ నివాసం ఉంటున్నాడు. ఉన్నావోలో కుల్దీప్ సింగ్ సెంగర్ చెప్పేదే శాసనం. ప్రజల్లో భయం రేకెత్తించడం ద్వారా, డబ్బుతోనూ రాజకీయాలను నడుపుతున్నాడు. గతేడాది జూన్ 4న ఉద్యోగం కోరుతూ ఎమ్మెల్యే నివాసానికి 16 ఏళ్ల బాలిక వెళ్లింది. అదేరోజు ఎమ్మెల్యే ఆమెపై అత్యాచారం చేశాడు. దీన్ని ఎవరికైన చెబితే ఆమె తండ్రిని, పెదనాన్నని చంపేస్తానని బెదిరించాడు. ఒకపక్క తనకు జరిగిన అన్యాయం చెబితే తండ్రి, పెదనాన్న లను చంపేస్తారు. చెప్పకపోతే అన్యాయానికి గురైనందున జీవితాంతం బాధతో నిస్సహాయ స్థితిలో ఉండాల్సి వస్తుందని బాలిక తనలో తాను కుమిలిపోయింది. మళ్లీ జూన్ 11న బాధితరాలిని ఎమ్మెల్యే అనుచరులు అపహరించి అతని నివాసానికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సోదరుడు అతుల్‌తో పాటు మరికొందరు ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. జూన్ 22న బాధితురాలి కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే జూన్ 11 నాటి సంఘటనను మాత్రమే పేర్కొంది. ఈ ఎఫ్ఐఆర్ లో పోలీసులు కుల్దీప్ సింగ్ పేరు చేర్చలేదు. బాధితురాలు తీవ్ర భయాందోళనలకు గురవడంతో ఆమెను, తన కుటుంబం ఢిల్లీలోని బంధువుల ఇంటికి పంపించింది. అక్కడ ఆమె తన బంధువుకు ఎమ్మెల్యే అత్యాచారం చేసిన తొలి సంఘటన గురించి చెప్పింది. ఆ తరువాత గత ఏడాది ఆగస్టు 17న బాధితురాలు, ఆమె బంధువు..ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌ను కలిసి కుల్దీప్ సింగ్ అత్యాచారం చేసిన సంఘటనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును ముఖ్యమంత్రి పట్టించుకోలేదు. మళ్లీ బాధితురాలి తల్లి ఈ ఏడాది ఫిబ్రవరి 12న మరోసారి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసింది. ప్రధాని, రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేశారు. ఈ రెండో ఫిర్యాదు కూడా అధికార బిజెపికి చెందిన ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్‌పైన ఉండటంతో సిఎం యోగి పట్టించుకోలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. కానీ ఆయుధ చట్టం ఉల్లంఘన కింద పోలీసులు బాధితురాలి తండ్రి సురేంద్ర సింగ్‌పై ఏప్రిల్ 3న కేసు నమోదు చేశారు. ఏప్రిల్ 5న అతన్ని అరెస్టు చేశారు. బాధితురాలు తల్లికి మందులివ్వడానికి వెళ్తున్న ఆమె తండ్రి సురేంద్ర సింగ్‌పై పోలీసుల సమక్షంలోనే ఎమ్మెల్యే సోదరుడు అతుల్, ఆయన అనుచరులు తీవ్రంగా దాడి చేశారు. నిందితుల్ని గాలి కొదిలేసి, అమాయక బాధిత కుటుంబ పెద్దని అరెస్టు చేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ఆ విమర్శలను బిజెపి పెద్దలుగాని, యుపి సర్కార్ పెద్దలు గాని పట్టించుకోలేదు. నీతులు చెప్పే ఆరెస్సెస్ స్పందించలేదు. సురేంద్ర సింగ్‌ని పోలీస్ కస్టడీలోనూ తీవ్రంగా

హింసించారు. నిందితులపై చర్యలు తీసుకోక పోవడం, ఎమ్మెల్యే అనుచరగణం నుంచి బెదిరింపులు రావడంతో ఏప్రిల్ 8న ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్ నివాసం ఎదుట తనను తాను తగలబెట్టుకోవడానికి బాధితు రాలు ప్రయత్నించింది. మరోవైపు అదే రోజు పోలీస్ కస్టడీలో ఉన్న సురేంద్ర సింగ్‌పై హింస తీవ్రతరం చేయడంతో విపరీతమైన కడుపు నొప్పితో బాధపడటంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఏప్రిల్ 9న సురేంద్ర సింగ్ చికిత్స పొందుతూ ఆస్పత్రిలోనే మరణించారు. ఆయ నను పోలీస్ కస్టడీలో తీవ్రంగా హింసించారని, అందుకే ఆయన చనిపోయారని, శరీరంపై తీవ్రమైన గాయాలున్నాయని పోస్టుమార్టం రిపోర్టు తెలిపింది. దాంతో ఈ సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జాతీయ స్థాయిలో సర్వత్ర చర్చకు దారి తీసింది. అప్పుడు ఆరెస్సెస్, బిజెపి పెద్దల్లో కదలిక వచ్చింది. ఆ కదలిక కూడా బాధితురాలికి న్యాయం చేసేందుకు కాదు, నిందితుల్ని కాపాడి, కేసులు లేకుండా, ఈ చర్చకు అడ్డుకట్ట వేసేందుకు మాత్రమే. ఇంతలోనే ఏప్రిల్ 10న జాతీయ మానవ హక్కుల సంఘం(ఎన్‌హెచ్‌ఆర్సీ) ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై సీరియస్ అయ్యింది. కస్టడీలో ఉన్న బాధితురాలి తండ్రి మరణంపై సమగ్ర నివేదిక సమర్పించాలని, బాధితురాలకు రక్షణ కల్పించాలని యోగి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, రాష్ట్ర డిజిపికి నోటీసులు జారీ చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు ఎందుకు నిరాకరించారో, పోలీసులు ఏం చర్యలు తీసుకున్నారో నాలుగు వారాల్లోగా తెలపాలని పేర్కొంది. ఏప్రిల్ 11న నిందితుడు ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ ఆడియోతో అడ్డంగా దొరికాడు. కేసును వెనక్కి తీసుకోవాలని కుల్దీప్ సింగ్, బాధితురాలి మావయ్య మహేష్ సింగ్‌ను బెదిరిస్తున్న ఆడియో రికార్డులు బయటపడ్డాయి. దాంతో హైకోర్టు జోక్యంతో బిజెపి ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్, సోదరుడు అతుల్ సెంగార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఐపిసి సెక్షన్ 302(మర్డర్) కింద కేసు నమోదు చేశారు. అత్యాచార బాధితురాలి తండ్రి పోలీస్ కస్టడీలో మరణించడం, ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు జారీ చేయడం ఘటనల నేపథ్యంలో ఈ అరెస్ట్‌తో కేసును మరుగున పెట్టచ్చునని యుపి ప్రభుత్వం, పోలీసులు భావించారు. అయితే అప్పుడప్పుడే జాతీయ స్థాయిలో చర్చ జరుగుతున్న ఈ అంశం ఎమ్మెల్యే సోదరుడు అతుల్

> **❝ఏప్రిల్ 9న సురేంద్రసింగ్ చికిత్స పొందుతూ ఆస్పత్రిలోనే మరణించారు. ఆయనను పోలీస్ కస్టడీలో తీవ్రంగా హింసించారని, అందుకే ఆయన చనిపోయారని, శరీరంపై తీవ్రమైన గాయాలున్నాయని పోస్టుమార్టం రిపోర్టు తెలిపింది. దాంతో ఈ సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జాతీయ స్థాయిలో సర్వత్రా చర్చకు దారి తీసింది. అప్పుడు ఆరెస్సెస్, బిజెపి పెద్దల్లో కదలిక వచ్చింది.❞**



కథువా, ఉన్నావో బాధితులకు న్యాయం చేయాలని ప్రదర్శనలు

అరెస్టుతో ఈ కేసులో మరో ముగ్గురిని అరెస్టు చేయాల్సి వచ్చింది. అయినప్పటికి అసలు నిందితుడు ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌ను మాత్రం అరెస్టు చేసేందుకు సాహసించలేదు. ఏప్రిల్ 8 నుంచి జరుగుతున్న ఈ మొత్తం వ్యవహారాన్ని దర్యాప్తు చేసేందుకు ఏప్రిల్ 11న ప్రత్యేక విచారణ బృందం (సిట్)ను ఏర్పాటు చేసేందుకు సిఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. ఆఘామేఘాల మీద వేసిన ఈ సిట్ కేసును మరుగనపెట్టేందుకేనని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు విమర్శలు చేస్తూ సిబిఐ విచారణకు డిమాండ్ చేశాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో కుల్దీప్ సింగ్‌పై యుపి పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లను దాఖలు చేశారు. కానీ అరెస్టు మాత్రం చేయలేదు. ఉన్నవ్ ఘటనపై నిరసన స్వరం పెరగడంతో ఏప్రిల్ 12న కేసును సిబిఐకి అప్పగించింది. సిబిఐ వెనువెంటనే ఎమ్మెల్యే కుల్దీప్‌పై కిడ్నాపింగ్, లైంగికదాడి, నేరపూరిత కుట్ర, పోస్కో చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. యుపి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కూడా సిబిఐ రీరిజిస్టర్ చేసింది. అలహాబాద్ హైకోర్టు యుపి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసులు తీరు ఈ విధంగా ఉంటే బాధితు లెవ్వరూ ఇక ఫిర్యాదు చేసేందుకు ముందుకు రారని తెలిపింది. అయితే మళ్లీ ఏప్రిల్ 13 అలహాబాద్ హైకోర్టులో ఈ కేసు విచారణ సందర్భంగా నిందితుడు, బాధితులతో పాటు విచారణను ప్రభావితం చేయొచ్చని, సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశముందని న్యాయ స్థానం పేర్కొంది. అందుకనే నిందితుడు కుల్దీప్‌ను తక్షణమే అరెస్టు చేయాలని హైకోర్టు, సిబిఐని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులు అందుకున్న సిబిఐ ఎట్టకేలకు నిందితుడు, బిజెపి ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌ను అదే రోజు ఉదయం అదుపులోకి తీసుకుంది. కొన్ని గంటల విచారణ అనంతరం అదే రోజు సాయంత్రం నిందితుడు కుల్దీప్ సింగ్‌ను సిబిఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం కేసు అలహాబాద్ హైకోర్టు విచారణలోనూ, సిబిఐ విచారణలోనూ ఉంది. నిరంతరం నీతులు వల్లించే ఆరెస్సెస్ ఉత్తరప్రదేశ్, జమ్మూ కశ్మీర్ ఘటనలో రేపిస్టుల పక్షానే ఉంది. బాధిత చిన్నారులకు న్యాయం చేయడంలో రెండు ప్రభుత్వాలూ విఫలం అయ్యాయి. ❊

పుస్తక సమీక్ష

# విప్లవ వీరుల మహోజ్వల చరిత్ర

గుల్లా తిరుపతిరావు



రచయిత ప్రజాశక్తి బుక్‌హౌస్ సబ్ ఎడిటర్

**శివవర్మ రాసిన జాతీయ విప్లవవీరుల మహోజ్వల సంస్మృతులు పుస్తక సమీక్ష**

భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్ ప్రపంచానికి పరిచయం అక్కర్లేని పేర్లు అవి. ఒక్కొక్కరిదీ ఒక్కో వీర చరిత్ర. స్వాతంత్ర్యోద్యమ కాలంలో వీరు పోషించిన పాత్రను తలచుకుంటేనే రోమాంచితులమవుతాం. వారి జీవిత గాథలు చదివినా, వారు చేసిన త్యాగాలు తలచుకుంటే ఒళ్లు గగుర్పాటుకు గురవుతుంది. బ్రిటీష్ పాలకులను భారత దేశం నుంచి పారద్రోలాలని అందరూ బలంగా కోరుకుంటున్న ఆ సమయంలో కేవలం స్వాతంత్ర్య సముపార్జనే కాక మానవాళికి అతి ఉత్కృష్టమైన సోషలిస్టు సమాజాన్ని కలలుగన్నారు వారు. ఆ లక్ష్య సాధన కోసం చేసే పోరాటంలో తృణప్రాయంగా ప్రాణాలను అర్పించారు. మహవీర్‌సింగ్, యతీంద్రనాథ్ దాస్, భగవతీచరణ్ వోహ్రాలు కూడా అదే బాటలో నడిచారు. అందుకే వీరంతా సోషలిస్టు సమాజ స్థాపనకు కృషి చేస్తున్న వారందరికీ మార్గదర్శకులయ్యారు. స్వాతంత్ర్యోద్యమ పోరులో వీరు చూపిన తెగువ, పోరాట పటిమ, వీరి జీవన విధానం, వారి పోరాట వ్యూహాలు, ఎదుర్కొన్న కష్టాలు తదితర అంశాలను **జాతీయ విప్లవ వీరుల మహోజ్వల సంస్మృతులు** అనే పుస్తకంలో చూడవచ్చు. ఈ విప్లవ యోధుల సహ ఉద్యమకారుడు శివవర్మ తన ప్రత్యక్ష అనుభవాలను ఈ పుస్తకంలో పేర్కొన్నాడు. ఈ పుస్తకంలో ఏడుగురు నాయకుల జీవిత చరిత్రలను గురించి రాశారు. సోషలిజం సమాజ స్థాపనకు పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ ఆ మహనీయుల ఆలోచనా సరళి స్ఫూర్తిదాయకం.

**వ్యక్తిగత పేరు ప్రఖ్యాతులు కంటే కిందస్థాయిలో పార్టీ పనే గొప్పది**

ఈ పుస్తకంలో భగత్‌సింగ్ జీవిత చరిత్ర మొదటి పాఠ్యాంశంగా ప్రచురించారు. సోషలిస్టుకార్యకర్తకు వ్యక్తిగత పేరు ప్రఖ్యాతులు కంటే పార్టీ పనే గొప్పదని భగత్ సింగ్ చెప్తాడు. ఆ మాట అప్పటి సందర్భానికి అనుగుణంగా శివవర్మను సుతారంగా మందలించే నేపథ్యంలో చెప్పినదే అయినప్పటికీ సిపిఎం కార్యకర్తలమైన మనకూ ఎల్లవేలలా వర్తిస్తుంది. కీర్తికాంత (పేరు ప్రఖ్యాతులు) కంటే ప్రజల్లో పని చేసి బలంగా పార్టీ పునాదులు నిర్మించడం సర్వదా మనకు అనుసరణీయమని చెప్పిన సందర్భాన్ని, తీరును శివవర్మ పేర్కొన్నాడు.

'కాకోరీ' దోపిడి కేసులో నేరస్తుడైన పండిత రామ్‌ప్రసాద్ బిస్మిల్‌ను జైలు నుంచి తప్పించే పనిలో భాగంగా రంజిత్ (భగత్‌సింగ్ మారు పేరు) కాన్పూరులోని నా గదికి వచ్చాడు. నా గదిలో నాతో పాటు నా స్నేహితుడు జయదేవ్ ఉంటాడు. మొదటి నుంచీ జయదేవ్ నాకంటే దృఢకాయుడు, కొట్లాటకు అతను ముందుండేవాడు జయదేవ్‌లోని ఈ గుణగణాలను చూచే బిస్మిల్‌ను విడిపించే 'యాక్షన్'[2]కు భగత్‌సింగ్ జయదేవ్‌ని తీసుకెళ్ళాలని నిర్ణయించాడు. ఒకరోజు మధ్యాహ్నం భగత్‌సింగ్ తన నిర్ణయాన్ని నాకు తెలిపినపుడు, నా దుర్బలమైన శరీరంపై నాకు మహాకోపమొచ్చింది. నన్ను పార్టీ పనికి యోగ్యమైనవాడుగా భావింపలేదనే విషయం నాకు తీవ్రమనస్తాపం కలిగించింది. దీనివల్ల కొంతసేపు కూర్చుని వుండి, నిద్రవస్తోందనే నెపంతో నేను ఒకవైపుగా పడుకున్నాను. నేను నిద్రపోవడంలేదని భగత్‌సింగ్‌కు తెలుసు. అతను కొంతసేపు ప్రక్కనున్న పుస్తకం తిరగేసిన తర్వాత నాభుజాన్ని కుదుపుతూ మెల్లగా "శివా!" అని నన్ను పిలిచాడు.

"ఏమిటి?" నేను అతనివైపు ఒత్తిగిలి అడిగాను.

"ఒక విషయం అడగనా?"

"అడుగు."

"ఒక వ్యక్తి పేరు గొప్పదా, పార్టీ పని గొప్పదా?"

"పార్టీ పనే గొప్పది." నేను జవాబిచ్చాను.

"పార్టీ పని అవిచ్ఛిన్నంగా సాగుతుండాలి. మనం గైకొనే 'యాక్షన్స్' విజయవంతమవుతుండాలి. మన సందేశం దేశ ప్రజలకు ఆటంకం లేకుండా అందుతుండాలి.

"వజ్రాలు భవనం అందాన్ని పెంపొందించవచ్చు. చూపరులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తవచ్చు. అయితే అవి భవనానికి పునాది కాలేవు. భవనాన్ని దీర్ఘకాలం వరకు నిలిపి వుంచలేవు. శతాబ్దాల తరబడి తమ బలమైన భుజస్కందాల మీద దానిని నిలిపి వుంచలేవు. ఇంతవరకూ మన ఉద్యమం వజ్రాలను సమీకరించిందే తప్ప పునాది రాళ్ళను సేకరించనే లేదు. అందువల్లే మనం ఇన్ని త్యాగాలు చేసినప్పటికీ భవనం రూపురేఖలు కూడా దిద్దుకోలేక పోయాం. నేడు మనకు పునాదిరాళ్ళే కావాలి."

**డిప్యూటీ సూపరింటిండెంట్ హత్య**

1928 అక్టోబర్ 30వ తేదీనాడు సైమన్ కమిషన్ లాహోర్ వచ్చింది. ఓ పెద్ద ప్రజా సమూహం నల్లజెండాలతో కమిషన్‌కు 'స్వాగతం' పలికింది. పోలీసులు ప్రజల ఊరేగింపుపై లాఠీలతో విరుచుకుపడ్డారు. డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ సాండర్స్ జాతీయ నాయకుడైన లాలా లజపతిరాయ్‌ను చావబాదాడు. ఆ దెబ్బలతో తీసుకుంటూ ఆయన 1928 నవంబర్ 19న చనిపోయాడు. దీంతో దేశమంతా క్రోధావేశాలు వ్యాపించాయి. ఒక నెల తరువాత భగత్‌సింగ్, రాజగురు లాహోరు పోలీసు కేంద్ర కార్యాలయం నుంచి వెలుపలికి వస్తున్న డిఎస్పీ సాండర్స్‌ను కాల్చి చంపారు. హత్య తర్వాత అనేక రోజుల దాకా భగత్‌సింగ్ మనసు వ్యాకులతతో నిండిపోయింది. అతడు విప్లవకారుడైనప్పటికీ రక్తపిపాసికాదు.

**పార్లమెంటుపై బాంబు దాడి**

భారత కార్మికోద్యమాన్ని తీవ్ర ఇబ్బందుల పాల్జేసే రెండు పారిశ్రామిక బిల్లులను తీసుకొచ్చేందుకు ఆంగ్లప్రభుత్వం ప్రయత్నించింది. భారత వైస్రాయి ఒక ప్రకటన చేస్తూ– పార్లమెంటు ఆ రెండు బిల్లులను ఆమోదించక

“భగత్‌సింగ్, బటుకేశ్వరదత్ ఇద్దరూ భవనంలో విసిరి వేసిన కరపత్రాలలోని మొదటి పంక్తి ఇది: “చెవిటివారికి వినిపించడానికి పెద్ద శబ్దమే అవసరమవుతుంది.” అయితే ప్రభుత్వం చెవిటివానివలె నటిస్తోంది. పార్లమెంట్‌లో దానికి మెజారిటీ వుంది. పారిశ్రామిక వివాదాల బిల్లును సభ ఆమోదించింది. అయినప్పటికీ ప్రజాభద్రతా బిల్లును సభలో ప్రవేశపెట్టే ధైర్యం దానికి లేకపోయింది.”

పోయినట్లయితే, తన విశేషాధికారాన్ని ఉపయోగించి ఆర్డినెన్స్‌లు జారీచేసి, వాటి నమలుపరుస్తానని ప్రకటించాడు. వార్తా పత్రికల్లో వైస్రాయి ప్రకటన రాగానే భగత్‌సింగ్ పార్టీ కేంద్ర కమిటీని సమావేశపరచి, ఎన్నికైన భారత ప్రతినిధులే ఆ దౌర్జన్యపూరితమైన బిల్లులను చట్టాలుగా చేశారని ప్రపంచానికి తెలియజెప్పడానికే వాటిని పార్లమెంటులో ప్రవేశపెడుతున్నారని వివరించి చెప్పాడు. “ఆ బిల్లులకు వ్యతిరేకంగా దేశమంతటా వినిపిస్తున్న నిరసన ధ్వనులు ప్రభుత్వానికి వినబడేట్లు చేయాలి” అని పేర్కొన్నాడు.

పార్లమెంటులో పారిశ్రామిక వివాద బిల్లుపై ఓటింగ్ జరిగిన తర్వాత, ఫలితం ప్రకటించడానికి ముందు ప్రేక్షకుల గ్యాలరీ నుంచి ప్రభుత్వపక్షంపైన బాంబు వేసి భారతీయుల అసంతృప్తిని వ్యక్తపరచడమే బాంబు వేయడానికున్న ఉద్దేశ్యం. ఎవరి ప్రాణాలనూ హరించాలనే అభిప్రాయం కాదు.

సభాధ్యక్షుడు విఠల్‌భాయ్ పటేల్ ఓటింగ్ ఫలితం ప్రకటించబోతారనగా ప్రభుత్వపక్షపు వెనుక బెంచీ నుంచి ఒక పెద్ద శబ్దం వినబడింది. భవనమంతా పొగనిండిపోయింది. అందరూ నలువైపులకు పరుగులుతీశారు. పొగ కొంత తగ్గిన తర్వాత చూస్తే కొద్దిసేపటికి మునుపు సభ్యులతోను, ప్రేక్షకులతోను కిటకిటలాడిన పార్లమెంట్ భవనం నిర్మానుష్యంగా వుంది. భవనంలో ముగ్గురు వ్యక్తులు మాత్రమే మిగిలారు “కార్మికవర్గం వర్ధిల్లాలి!” “సామ్రాజ్యవాదం నశించాలి!” “విప్లవం వర్ధిల్లాలి!” అనే నినాదాలతోపాటు వారు భవనంలో కరపత్రాలు వెదజల్లుతున్నారు. వారు అనుకుంటే సులభంగా సభా భవనం నుండి బయటపడి వుండేవారు. అయితే వారు పారిపోలేదు. కొంతసేపటికి పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నాడు. పార్లమెంట్ భవనం మరోసారి నినాదాలతో మారుమ్రోగింది.

భగత్‌సింగ్, బటుకేశ్వరదత్ ఇద్దరూ భవనంలో విసిరి వేసిన కరపత్రాలలోని మొదటి పంక్తి ఇది: “చెవిటివారికి వినిపించడానికి పెద్ద శబ్దమే అవసరమవుతుంది.” అయితే ప్రభుత్వం చెవిటివానివలె నటిస్తోంది. పార్లమెంట్‌లో దానికి మెజారిటీ వుంది. పారిశ్రామిక వివాదాల బిల్లును సభ ఆమోదించింది. అయినప్పటికీ ప్రజాభద్రతా బిల్లును సభలో ప్రవేశపెట్టే ధైర్యం దానికి లేకపోయింది. ఆ బిల్లు ఆర్డినెన్సు రూపంలో దేశంపై రుద్దారు. భగత్‌సింగ్ వెదజల్లిన కరపత్రాలలో ఫ్రెంచి విప్లవాన్ని



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్

పేర్కొని, విప్లవ పార్టీ కార్యకలాపాలను సమర్థించటం జరిగింది. ప్రజాప్రతినిధులు తమ తమ ఓటర్ల వద్దకు తిరిగి వెళ్ళి, వారిని విప్లవానికి సన్నద్ధులుగా చేయాలని ఆ కరపత్రాలలో కోరటం జరిగింది.

భగత్‌సింగ్ సామ్రాజ్యవాదానికీ, దోపిడీకీ మాత్రమేగాక, భగవంతునికీ, మతానికీ కూడా వ్యతిరేకే! అతడెప్పుడూ తనను నాస్తికుడిగానే అభివర్ణించుకునేవాడు. జైలు జీవితంలో అతడు చదివిన గ్రంథాలు అతని భావాలను మరింత దృఢపరచాయి.

### ధైర్యానికి మారుపేరు ‘ఆజాద్’

చంద్రశేఖర్ ఆజాద్ భయమన్న పదానికి అర్థం తెలియని వీరుడు. 1922వ సంవత్సరంలో విప్లవ పార్టీలో చేరిన ఈ కుర్రాడు చిన్నప్పటి నుంచి ఎంతటి ధైర్యసాహసాలు కలిగిన వాడో తెలుసుకునేందుకు ఈ చిన్న ఉదాహరణ చాలు. 1921లో సహాయ నిరాకరణాందోళనలో పికెటింగ్ చేసిన నేరానికై ఆయన మీద కేసు నడిచింది. కోర్టువారు బాలుడైన సత్యాగ్రహిని ఇలా అడిగారు:

“నీ పేరేమిటి?”

“ఆజాద్”! (స్వాతంత్ర్యం)

“తండ్రిపేరు?”

“స్వేచ్ఛ!”

“ఇల్లు?”

“చెరసాల!”

ఈ జవాబులతో మండిపడిన మేజిస్ట్రేట్ ఆయనకు పదిహేను కొరడాల దెబ్బల శిక్ష విధించాడు. శిక్షను అమలుపరిచేటప్పుడు ఆజాద్ ఒక్కొక్క కొరడాదెబ్బకూ, “మహాత్మా గాంధీకి జై!” అని నినదించాడు. బాలుడైన చంద్రశేఖర్ ముందు ముందు తన ‘ఆజాద్’ (స్వాతంత్ర్యం) పేరునే సార్థకం చేసుకున్నాడు. బ్రిటీష్‌వారికి పట్టుపడిపోయినప్పుడు తన రివాల్వర్‌తో కాల్చుకొని చనిపోయారు తప్ప బ్రిటీష్‌వారు తన శరీరానికి తాకడానికి అవకాశం ఇవ్వలేదు. ఒక్కరోజు కూడా జైలును తన ఇల్లుగా చేసుకోలేదు. ఆజాద్ ధైర్యోత్సాహాలు కలిగిన యువకుడైనందువల్లే అన్ని ‘యాక్షన్స్’కూ ఆయనను పార్టీ పంపింది. పండిత రాంప్రసాద్ ‘బిస్మిల్’ నేతృత్వంలో అనేక దోపిడీ కార్యక్రమాల్లో ఆయన సముచితపాత్ర వహించాడు.

1925లో ‘కాకోరీ’ సంఘటన జరిగింది. ‘కాకోరీ’వద్ద రైలుబండిని ఆపి ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. అష్ఫాకుల్లాఖాన్, శచీంద్రనాథ్

**❝ విప్లవ జీవితంలో రాజగురు భగత్‌సింగ్‌నే తన ప్రధాన పోటీదారుగా భావించేవాడు. వారిద్దరి మధ్య పోటీ, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఎవరు ముందు మృత్యువును వరించడం అనే విషయం మీదే వుండేది. ఈ పోటీలో భగత్‌సింగ్ ఎక్కడ తన్ను ఓడించేసి ముందుగా అమరుడై పోతాడోనని రాజగురుకు ఎప్పుడూ ఆందోళనగా వుండేది.❞**

బక్షి, రాజేంద్రలాహి, రాంప్రసాద్ బిస్మిల్, కేశవ్ చక్రవర్తి, మురారీలాల్, ముకుందీలాల్, చంద్రశేఖర్ ఆజాద్, బన్యారీలాల్, మన్మథనాథ్‌గుప్త ఇందులో ఉన్నారు. ఆజాద్, కుందన్‌లాల్ తప్ప మిగతా అందరూ ఒక్కొక్కరుగా ఖైదు అయ్యారు. ఆజాద్ మాత్రం తన పేరును (స్వాతంత్ర్యం) సార్థకం చేసుకోదలిచాడు. "నేను బ్రతికుండగా ఎవరూ నా శరీరాన్ని తాకలేరు!" అని అనేక సార్లు ఆయన చెప్పాడు. జరిగింది కూడా అదే. తననో లేక తానున్న స్థలాన్నో ఎరిగిన కామ్రేడ్ ఎవరైనా అరెస్టు అయిన వెంటనే మకాంను మార్చివేయడం ఆజాద్ అలవాటు. అవసరం వస్తే ఊళ్ళనే మార్చేసేవాడు. ఇందువల్లనే పోలీసులు ఆజాద్‌ను సంవత్సరాల తరబడి పట్టుకోలేకపోయారు.

**షూటింగ్‌లో గురి తప్పని ఆజాద్**

లాహోర్‌లో సాండర్స్‌ను హత్య చేసిన తర్వాత భగత్‌సింగ్, రాజగురు తప్పించుకు పారిపోతున్నారు. అప్పుడు పోలీసు హవల్దారు చనన్‌సింగ్ వారిద్దరినీ అడ్డగించడానికి ప్రయత్నించాడు. అప్పుడు గురి తప్పని ఆజాద్ రివాల్వరే అతణ్ణి నేలకూల్చింది. ముగ్గురు వ్యక్తులు అంత దగ్గరగా, వేగంగా పరిగెడుతున్నప్పుడు గురి తప్పితే మన కామ్రేడే ఒకరు చనిపోవడం కూడా తటస్థించవచ్చు. అటువంటి క్లిష్టసమయంలో కూడా గురి తప్పకుండా శత్రువునే కాల్చి చంపడం ఆజాద్ ఒక్కరికే చేతనవును. కార్యరంగంలో ఒక్కొక్క పనిని ఆత్మ విశ్వాసంతోను, దృఢనిశ్చయంతోను నెరవేర్చడం ఆజాద్‌లోని ప్రత్యేకత!

**మృదు స్వభావి**

ఆజాద్‌లోని పెద్ద బలహీనత కన్నీరు కార్చడమే! ఎవరైనా ఏడుస్తూంటే ఆయన తన కన్నీటిని ఆపుకోలేకపోయేవాడు. తాను కాల్చి చంపిన పోలీస్ అధికారి చనన్ సింగ్ భార్యను తలచుకొని ఎంతగానో దు:ఖిస్తాడు. ఏదైనా యాక్షన్ రూపొందిస్తే తన మిత్రులకు ఏదైనా జరగరానిది జరుగుతుందేమోనని ఆందోళన పడుతుంటాడు. ఎవరినైనా యాక్షన్‌కు పంపే ముందు ఒకటి రెండు సార్లు తగిన జాగ్రత్తలు తీసుకొని పంపిస్తాడు.

**అమ్మ గుర్తొచ్చినపుడు**

'తల్లిగారి జ్ఞాపకం నన్ను అధికంగా వేధించే సమయాల్లో నేను భూమ్మీదే మోకరిల్లి, భూదేవినే శిరస్సుతో తాకి, 'అమ్మా! నిన్ను మరచిపోయానని ఎన్నడూ అనుకోకు. అయితే నేనేమి చేయగలనమ్మా? నేను నీ వద్దకు రాలేని పరిస్థితిలో వున్నాను. నన్ను క్షమించు తల్లీ!' అని ప్రార్థిస్తాను. కన్నీరు కార్చి నా మనసును ఓదార్చుకుంటాను.'అని చెబుతారు.

**రాజగురు**

ఢిల్లీలో మేము శిక్షించవలసిన వ్యక్తి అన్వేషణకు వెళ్ళివస్తున్నాము. మావద్ద వున్నది ఒక రివాల్వరే. రాజగురును అక్కడే వదలి మరో పిస్తోలు తేవడానికి లాహోరు వెళ్ళాను. లాహోరు నుంచి మూడవ రోజు నేను ఢిల్లీకి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి ఏడున్నర గంటలయింది. రాత్రిలో నలువైపులా పోలీసుల మోటార్లు సైకిళ్ళూ పరుగెడుతున్నాయి. పరిస్థితి విషమించిందని గ్రహించి నేను పాతకోటును చుట్టుకుని నగరానికి వచ్చేశాను. రాజగురు ఆ రాత్రి బసకుతిరిగి రాలేదు. ఫలానా చోటున ఫలానా వ్యక్తిని ఎవరో చంపేశారని మరునాడు ఉదయం పత్రికల్లో చదివాను. మేము ఆ వ్యక్తిని శిక్షించాలనుకున్న చోటే ఆ హత్య జరిగింది. అయితే హతుని పేరు వేరుగా వుంది. అవకాశం లభించిందనుకుని రాజగురు ఆ వ్యక్తికి బదులుగా వేరెవరినో పొరపాటుగా చంపేశాడని నేను అనుకున్నాను. పిస్తోలుతో కాల్చిన వ్యక్తి పట్టుబడలేదని కూడా నేను వార్తాపత్రికలలో చదివాను. ఢిల్లీలో ఇక వుండడం క్షేమం కాదనుకుని నేను ఆగ్రా మార్గంలో కాన్పూరుకు బయలుదేరాను. నేనక్కడికి చేరుకున్న రెండవ రోజున రాజగురు కూడా క్షేమంగా వచ్చిచేరాడు.

ఆ రాత్రి మేమిద్దరం ప్రక్కప్రక్కనే పడుకున్నాము. రాజగురు మెల్లగా జరిగి నావద్దకొచ్చాడు. "ప్రభాత్! నా తొందరపాటుకు నేను పార్టీ ఎదుట శిక్షార్హుణ్ణి" అని మెల్లగా అన్నాడు. అతణ్ణి నేను నా వేపుకు లాగకున్నాను. ఇన్ని ఇబ్బందులను సాహసంతో అధిగమించి తిరిగి వచ్చిన రాజగురు, చిన్న పిల్లాడిలా నా హృదయానికి హత్తుకుని వెక్కివెక్కి ఏడ్చాడు. "నేను పార్టీకి అనర్హునిగా నిరూపించుకున్నాను" అని అన్నాడతడు.రాజగురు తొందరపడ్డాడే కానీ, నేరం చేయలేదు. చీకటి రాత్రుల్లో ఇటువంటి పొరపాటు జరగడం సహజం. అదీగాక 'కాకోరీ' సంఘటన తర్వాత మా తరంలో సాహసానికీ, ధైర్యానికీ ప్రతీకగా నిలచినవాడు అతడే! పార్టీ రాజగురు విలువను గుర్తించింది. అతను విడదీయరాని మా కుటుంబ సభ్యుడైపోయాడు.

విప్లవ జీవితంలో రాజగురు భగత్‌సింగ్‌నే తన ప్రధాన పోటీదారుగా భావించేవాడు. వారిద్దరి మధ్య పోటీ, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఎవరు ముందు మృత్యువును వరించడం అనే విషయం మీదే వుండేది. ఈ పోటీలో భగత్‌సింగ్ ఎక్కడ తన్ను ఓడించేసి ముందుగా అమరుడైపోతాడోనని రాజగురుకు ఎప్పుడూ ఆందోళనగా వుండేది. ప్రతి 'యాక్షన్' సమయంలోను మొదటిసారిగా కాల్పులు జరిపే అవకాశం తనకే ఇవ్వాలని అతను పార్టీని కోరుతుండేవాడు. ఢిల్లీ పార్లమెంట్ భవనంపై బాంబుల దాడి జరపడానికి భగత్‌సింగ్‌తో పాటు దత్తుకు బదులుగా తననే పంపాలని రాజగురు ఎంతో మొండికేశాడు. ఈ 'యాక్షన్'కు కూడా భగత్‌సింగ్‌తో పాటు తనే వెళ్ళాలని అతని తీవ్రమైన కోరిక. అతను భగత్‌సింగ్‌నూ, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులనూ ఒప్పించలేకపోయినప్పుడు నేరుగా ఆజాద్‌తో చెప్పుకోవడానికి ఝాన్సీ వచ్చాడు. ఆజాద్ కూడా అతని అభ్యర్థనను త్రోసిపుచ్చడంతో రాజగురు అలిగి పూనాకు వెళ్ళిపోయాడు. ఆయన ఎంత వీరుడు, ధైర్య శాలి అయినా ఆయన నోరు జారే గుణం వల్లే పోలీసులకు పట్టుబడిపోయాడు.

**అరెస్టయిన విషమ ఘడియ**

దీర్ఘకాలం చెరసాలలో నిరాహారదీక్ష చేసి మరణించిన విప్లవ వీరుడు యతీంద్రనాథ్ దాస్ అంతిమ యాత్రను సెప్టెంబరు 19న పూనాలోని సినిమా థియేటర్‌లలో డాక్యుమెంటరీగా ప్రదర్శిస్తున్నారు. రాజగురు సావర్‌గావ్‌కర్‌తో పాటు మ్యాట్నీ షోకు వెళ్ళి దాన్ని చూసి సాయంత్రం ఆరు గంటలకు తిరిగి వచ్చాడు. తరువాత అన్నగారి ఇంటిలో భోంచేసి రావడానికి వెళ్ళా

డు. అక్కడినుంచి రాత్రి ఎనిమిది గంటలకు గదికి తిరిగివచ్చాడు. అప్పుడే అతన్ని కలుసుకోవడానికి కేస్‌కర్, కరందీకర్‌లు వచ్చారు. కేస్‌కర్ ప్రతి సాయంత్రం రాజగురు కదలికలను గురించీ, అతనితో తాను మాట్లాడిన విషయాల గురించీ క్రమం తప్పకుండా సిమ్లా సిఐడి కవతాల్‌కర్, పోలీసు అధికారి లుగ్గదేలకు తెలుపుతుండేవాడు. రాజగురు ఆయనను నమ్మి తమ వద్ద ఉన్న రివాల్వర్లు, తాము చేస్తున్న కార్యకలాపాలు ఆయన వద్ద చెప్పేశాడు. ఆరోజు రాత్రి పోలీసులు మోహరించి రాజగురుని అరెస్టు చేశారు.

రాజగురు రహస్య సంస్థ నియమాలను బాహాటంగా ఉల్లంఘించాడు. తన అతివాగుడుకు తానే బలైపోయాడు. అతను అతి శీఘ్రంగా పూనాలో పార్టీ శాఖను నెలకొల్పాలని వువ్విళ్ళూరాడు. ఆ ప్రయత్నంలో తనతో పరిచయమయిన వారందరికీ సాండర్స్ హత్య గురించి చెబుతూ వచ్చాడు. చివరకు ఒక సిఐడి ఏజెంటు వలలో చిక్కుకుని పోలీసుల చేతికి చిక్కాడు.

డబ్బు, పదవి, ప్రతిష్ట కోసం ప్రజలు పోటీపడటం మన చూస్తున్నాము. కాని 'ఎవరు మొదట మృత్యువును వరించడం' అన్న విషయంలో నిజాయితీపరులైన విప్లవకారులే పోటీపడగలరు. భగత్‌సింగ్ తన్ను అధిగమించరాదు. తనకంటే ముందు తుపాకీ గుండ్లకు బలి కారాదు అనేదే రాజగురు చిరకాల వాంఛ. అతని ఈ వాంఛను పరిస్థితులు నెరవేర్చాయి.

**సుఖదేవ్**

పార్టీలో 'విలేజర్' అనే పేరుతో ఒక వ్యక్తి వున్నాడని విన్నాను. ఒకరోజు భగత్‌సింగ్ పంపిన ఉత్తరం తీసుకొని 'విలేజరు' ముందు నోటీసేమీ లేకుండా కాన్పూరు డి.ఎ.వి. కాలేజీలోని నా గదిలో ప్రత్యక్షం కాగానే, 'విలేజర్' గురించి రూపొందించుకున్న ఊహాచిత్రం తప్పని తెలిసిపోయింది. ఆయన పేరుకు తగ్గట్టేమహా మొండిమనిషి. పట్టిన పట్టు విడిచేవాడు కాదు. బలిష్టమైన కండరాలతో దృఢంగా వుంటాడు.

**ఎంత మొండివాడంటే..**

చెరసాలలో మొదటి నిరాహారదీక్షా సమయంలో జైలు అధికార్లూ, డాక్టర్లూ అతణ్ణి క్రింద పడద్రోసి అతని ముక్కు ద్వారా పొట్టలో రబ్బరు గొట్టం వదలి పాలు త్రాగించడం అవమానంగా భావించాడు. నాలుగైదు రోజులు వరుసగా డాక్టర్ల చేతిలో పరాజయం చవిచూచిన తర్వాత అతను చాలా ఖిన్నుడయ్యాడు. అతను పొట్టలోనుంచి పాలను వెలికితీయడానికై గొంతుకలో వేళ్ళుజొనిపి వాంతి చేసుకోవడానికి

"చెరసాలలో మొదటి నిరాహారదీక్షా సమయంలో జైలు అధికార్లూ, డాక్టర్లూ అతణ్ణి క్రింద పడద్రోసి అతని ముక్కు ద్వారా పొట్టలో రబ్బరు గొట్టం వదలి పాలు త్రాగించడం అవమానంగా భావించాడు. నాలుగైదు రోజులు వరుసగా డాక్టర్ల చేతిలో పరాజయం చవిచూచిన తర్వాత అతను చాలా ఖిన్నుడయ్యాడు. అతను పొట్టలోనుంచి పాలను వెలికితీయడానికై గొంతుకలో వేళ్ళుజొనిపి వాంతి చేసుకోవడానికి ప్రయత్నించాడు."


చంద్రశేఖర్ ఆజాద్


భగవతీ చరణ్ వోహ్రా

ప్రయత్నించాడు. ఇది ఒకటి రెండు రోజులు విజయవంతంగా జరిగింది. కానీ, తర్వాత అతని గొంతుక ఈ కసరత్తుకు అలవాటు పడిపోయింది. ఈగను పట్టి మింగేస్తే వాంతి అయిపోతుందని సుఖదేవ్ విన్నాడు. డాక్టర్లు పాలు తాగించి అటు వెళ్ళగానే అతను ఒక ఈగను పట్టి మింగేశాడు. అయితే ఫలితమేమీ కానరాలేదు. ఇటువంటి ప్రయోగాలు చేస్తూనే పదిరోజులు గడిచిపోయాయి. చివరకు డాక్టర్లను ఓడించడానికై అతను పాదంవద్ద వున్న నరాన్ని కోసి, రాత్రుల్లో మెల్లమెల్లగా శరీరంలోనుంచి రక్తాన్ని తీసివేయాలని నిశ్చయించుకున్నాడు. షేవింగ్ చేసుకునే బ్లేడును తీసుకుని సిద్ధమయ్యాడు కూడా! అయితే ఉరిశిక్షకు భయపడి సుఖదేవ్ ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని అనుకుంటారేమోనని అతను జంకాడు. ఈ భావం రాగానే బ్లేడును పారవేశాడు.

భగత్‌సింగ్ అంటే సుఖదేవ్‌కు వల్లమాలిన అభిమానం. ఎంతగా అభిమానించేవాడో అంత సూటిగా విమర్శించేవాడు. పార్లమెంటులో బాంబు వేయడానికి 'నువ్వే సరైనవాడివి' ఎలాగైనా కేంద్ర కమిటీని ఒప్పించి వెళ్లాలని భగత్‌సింగ్‌ను కోరతాడు. ఈ ప్రతిపాదనను కేంద్ర కమిటీ తోసిపుచ్చుతుంది. ఈ నిర్ణయాన్ని తెలుసుకొన్న సుఖదేవ్ కొద్ది రోజుల తరువాత 'నీవు పిరికివాడివి. చావంటే భయం నీకు. అందుకే నీవు బాంబు దాడికి వెళ్తానని కేంద్ర కమిటీని ఒప్పించలేదు. ఇతరుల ప్రాణాల కంటే నీ ప్రాణాలకు విలువిస్తావ్' అంటూ భగత్‌సింగ్‌ను దూషిస్తాడు. దాంతో కోపోద్రిక్తుడైన భగత్‌సింగ్ మరోసారి సమావేశం ఏర్పాటు చేసి తానే బాంబు వేస్తానని తన నిర్ణయాన్ని గట్టిగా చెబుతారు. దీంతో కేంద్ర కమిటీ కాదనలేక ఆయన్ను పంపిస్తుంది.

**గాంధీకి సుఖదేవ్ లేఖ**

సుఖదేవ్‌కు విప్లవకారుల లక్ష్యసిద్ధిపట్ల ప్రగాఢమైన విశ్వాసముండేది. తన్ను ఉరి తీయడానికి ముందు అతను గాంధీజీకి రాసిన ఉత్తరమే ఇందుకు సాక్ష్యం: "ఈ దేశంలో సోషలిస్టు ప్రజాతంత్ర వ్యవస్థను నెలకొల్పడమే విప్లవకారుల ధ్యేయం! ఈ ధ్యేయంలో 'సవరణ'కు ఏ మాత్రం అవకాశంలేదు... విప్లవకారులు సమేతుకమైనవారు కారనీ, విధ్వంసకర కార్యకలాపాలలోనే వారికి ఆనందం లభిస్తుందనీ మీరు కూడా భావిస్తున్నారేమో! వాస్తవం దీనికి పూర్తిగా విరుద్ధంగా వుందని మీకు చెప్పగోరుతున్నాం. వారు ఏ పని చేయాలన్నా మొదట నలువైపులా వున్న పరిస్థితులను పరిశీలిస్తారు. ఎప్పుడూ వారు తమ బాధ్యతలను గుర్తుంచుకుంటారు. ప్రస్తుత పరిస్థితులలో వారు విధ్వంసకర అంశాలకే అత్యధిక ప్రాధాన్యత నివ్వవలసి వచ్చినప్పటికీ, విప్లవ వ్యవస్థలో నిర్మాణాత్మక అంశాన్నే ముఖ్యంగా భావిస్తారు. "... మన ప్రజలు విప్లవకారుల నాయకత్వంలో, వారి పతాకం క్రింద సోషలిస్టు ప్రజాతంత్రమనే ఉన్నతాదర్శంవైపు ముందుకుసాగేరోజు ఎంతో దూరంలో లేదు." "లాహోరు కుట్రకేసులో ఉరిశిక్షపడ్డ ముగ్గురు నిందితులు సందర్భవశాన దేశం మొత్తంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. అయితే విప్లవ పార్టీకి వారే సర్వస్వం

**"పెళ్లి చేయాలని తాము ఎంతో ఆసక్తిగా ఉన్నా మని త్వరగా ఊరు రావాలని తండ్రి దగ్గర నుంచి ఉత్తరం వస్తుంది. దానికి సమాధానంగా తాను విప్లవపార్టీకి జీవితాన్ని అంకితం చేయదలిచానని, పెళ్లి ఊసు మానుకోవాలని సమాధానం చెబుతాడు. దీనికి తండ్రిని అంగీకరింపజేస్తాడు. తండ్రికూడా దేశ స్వాతంత్ర్యం కోసం తమ కుమారుడు అంకితమవడం కంటే కావాల్సిందేముందని భావించి అంగీకరించిన తీరు పాఠకులను ఆకట్టుకుంటుంది."**

కాదు. వాస్తవంలో వారికి విధించిన శిక్షలను మార్చడం కంటే, వారిని ఉరి తీయడంవల్లనే దేశానికి మరింత మేలు చేకూరుతుంది."

**మహావీర్‌సింగ్**

ఆ రోజుల్లో కాన్పూరులోని డి.ఏ.వి. కాలేజి విప్లవకారుల కార్యకలాపాలకు కేంద్రంగా వుండేది. 'కాకోరి' కేసు నిందితులను జైలు నుంచి తప్పించే సందర్భంలో భగత్‌సింగ్, సుఖదేవ్ పంజాబు నుంచి ఉత్తరప్రదేశ్ వచ్చినప్పుడల్లా డి.ఎ.వి. కాలేజి హాస్టల్లో వుండి, అందుకు కావలసిన ప్రణాళికను సిద్ధం చేసేవారు. ఆ కాలేజీ విద్యార్థులతోనే విప్లవకారుల పార్టీ శాఖ ఒకటి రూపొందింది. కువర్ మహావీర్‌సింగ్ ఆ విద్యార్థుల్లో ఒకరు. బాల్యం నుంచే మహావీర్ సింగ్‌కు తిరుగుబాటు మనస్తత్వం వుండేది.

పెళ్లి చేయాలని తాము ఎంతో ఆసక్తిగా ఉన్నామని త్వరగా ఊరు రావాలని తండ్రి దగ్గర నుంచి ఉత్తరం వస్తుంది. దానికి సమాధానంగా తాను విప్లవపార్టీకి జీవితాన్ని అంకితం చేయదలిచానని, పెళ్లి ఊసు మానుకో వాలని సమాధానం చెబుతాడు. దీనికి తండ్రిని అంగీకరింపజేస్తాడు. తండ్రికూడా దేశ స్వాతంత్ర్యం కోసం తమ కుమారుడు అంకితమవడం కంటే కావాల్సిందేముందని భావించి అంగీకరించిన తీరు పాఠకులను ఆకట్టుకుంటుంది. అనంతర కాలంలో ఆయన ఆరోగ్యం దెబ్బ తింది. పార్టీలో పూర్తికాలం కొనసాగుతానని చెప్పిన మాటకు కట్టుబడి ఇంటికి వెళ్లలేక అవసాన దశలో అనేక ఆకలి బాధలు, వసతి సమస్యలు ఎదుర్కొంటాడు.

బ్యాంకును కొల్లగొట్టే కార్యక్రమం వాయిదా వేసి, లాలాజీని లాఠీలతో చావబాదిన పోలీసు అధికారిని చంపాలని నిశ్చయించబడింది. దానిని అమలుచేయడంలో భగత్‌సింగ్, ఆజాద్, రాజగురులతోపాటు మహావీర్‌సింగ్ పాత్రకూడా ఎక్కువగానే వుంది.

1929వ సంవత్సరంలో ఢిల్లీ పార్లమెంట్ భవనంపై భగత్‌సింగ్, బటుకేశ్వర దత్తులు బాంబుదాడి చేసిన తర్వాత మమ్మల్ని ఖైదు చేయడం ప్రారంభించారు. మా కామ్రేడ్స్‌లో చాలామందిని అరెస్టుచేసి లాహోరుకు పంపారు. మహావీర్‌సింగ్‌ను కూడా ఖైదు చేశారు. కాస్‌గంజ్‌లోని బుక్‌సెల్లర్ హీరాలాల్ గృహం నుంచి బహుశా 1929 జూన్‌లో ఆయన్ను అరెస్టు చేశారు.

మా కేసు ప్రారంభమైన తర్వాత మూడు, నాలుగు రోజుల కొకసారి పోలీసులతోనో, జైలు సిబ్బందితోనో మాకు కొట్లాటలు జరుగుతుండేవి. ఆ సమయాల్లో వారు మాలో దృఢకాయులను ఏరుకుని, వారిని చావగొట్టి తమ కోపాన్నంతా తీర్చుకునేవారు. అందువల్ల ప్రతి కొట్లాటలోను భగత్‌సింగ్, కిశోరీలాల్, మహావీర్‌సింగ్, జయదేవ్‌కపూర్, గయాప్రసాద్ మొదలైనవారు మేము తినవలసిన దెబ్బలను కూడా తినవలసి వచ్చేది. జైలు సిబ్బందీ మహావీర్‌సింగ్‌ను ఎక్కువగా బాదేవారు.

1933 జనవరి మాసంలో ఆయన్ను ఇతర కొంతమంది కామ్రేడ్స్‌తోపాటు బళ్ళారి నుంచి అండమాన్ ద్వీపానికి (దీపాంతరవాస శిక్ష) పంపివేశారు. ఆ కాలంలో అండమాన్ సెల్యులర్ జైల్లోని పరిస్థితి మహా దారుణంగా వుండేది. మనిషిని అక్కడ జంతువులాగా చూసేవారు. అందువల్ల తమను గౌరవప్రదంగా చూడాలనీ, మంచి భోజన వసతి, చదువుకోడానికి, వ్రాసుకోవడానికీ సౌకర్యాలు, రాత్రిళ్ళు దీపాల ఏర్పాటు మొదలైన కోర్కెలను ముందుంచి రాజకీయ ఖైదీలందరూ 1933 జులై 12వ నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభించారు. దీనికిముందు ఇంతమంది ఇన్ని రోజులు ఎక్కడా నిరాహారదీక్షలో పాల్గొని వుండలేదు.

నిరాహారదీక్ష ప్రారంభమైన ఆరవ రోజునుంచే దీక్షాపరులకు జైలు అధికారులు బలవంతంగా పాలు తాగించడం ప్రారంభించారు. అరడజను మంది అర్ధగంటసేపు కుస్తీ పట్టిన తర్వాత, మహావీర్‌సింగ్‌ను క్రిందకు పడదోసి ఆయన ముక్కు ద్వారా రబ్బరుగొట్టాన్ని లోపలకు పంపాడు. అయితే, గొట్టం ఆయన కడుపులోకి పోక, శ్వాసకోశాల్లోకి దూరిపోయింది. డాక్టర్ తన తొందరలో దాన్నికూడా గమనించలేదు. తన డ్యూటీ ముగించాలనే ఆత్రుతతో డాక్టర్ మహావీర్‌సింగ్ శ్వాసకోశాల్లో ఒక శేరుపాలు నింపివేసి, ఆయన చేపలా గిలగిల్లాడుతుండగానే, ఆయన్నక్కడే వదిలేసి, మరో ఖైదీకి పాలు తాగించడానికి వెళ్ళిపోయాడు. ఇది 1933 మే 17న జరిగింది.

దగ్గర్లోని కొట్లల్లో బంధీలైన ఇతర కామ్రేడ్స్ వరండాలో గిలగిలా కొట్టుకుంటున్న మహావీర్‌సింగ్‌ను చూడగలరేగానీ ఆయనవద్దకు రాలేక ఒక్కపెట్టున గోలచేశారు. డాక్టర్ తిరిగి వచ్చి చూసేలోగా మహావీర్‌సింగ్ ఈ లోకాన్ని వదలి వెళ్ళిపోయారు. యావజ్జీవితం పోరాటమే ఊపిరిగా బ్రతికిన ఆ మా కామ్రేడ్ శాశ్వతంగా మమ్మల్ని వదలి వెళ్ళిపోయారు.

**యతీంద్రనాథ్ దాస్, భగవతీ చరణ్ వోహ్రా**

పై నాయకుల తరహాలోనే యతీంద్రనాథ్ దాస్, భగవతీ చరణ్ వోహ్రాలు నిరుపమాన త్యాగాలు చేశారు. దేశ స్వాతంత్ర్యం, సోషలిస్టు రాజ్య స్థాపన కోసం అనేక పోరాటాలు సల్పి చివరకు బ్రిటీషువారి ఆగడాలకు గురయ్యారు. వీరి త్యాగాలు చిరస్మరణీయం.

యంతీంద్ర దాస్ గుప్తా 'కాకోరీ' రైలు దోపిడీ సంఘటనలో నిందితుడు. మిగిలిన విప్లవకారులతోపాటు యతీంద్రనాథ్ దాస్ కూడా 1926 నవంబరు 7న ఖైదయ్యారు. కానీ విచారణలో ఆయనను గుర్తించనందున దాస్‌పై కేసు నడపడం ప్రభుత్వానికి దుస్సాధ్యమైంది. అందువల్ల వారు ఆయన్ను 'బెంగాల్ ఆర్డినెన్స్' క్రింద బెంగాల్‌లోనే జైల్లో వుంచారు. భగత్‌సింగ్ కలకత్తా వెళ్ళడానికి కొన్ని రోజుల ముందే ఆయన విడుదలయ్యారు. యతీంద్రనాథ్ దాస్ బాంబులు తయారు చేయడంలో నిపుణుడు. ఆగ్రాకు వచ్చి, కొంత మంది కామ్రేడ్స్‌కు బాంబుల తయారీలో శిక్షణ ఇచ్చి బాంబు తాయారీని నేర్పించాడు. భగవతీచరణ్ వోహ్రాకు విప్లవ తత్వవేత్తనీ, సంఘ నిర్మాణ దక్షుడనీ, మంచివక్త అనీ, ప్రచారసమర్థుడనీ మంచి పేరుంది. ఆదర్శాలపట్ల ఆయన ప్రగాఢ శ్రద్ధ, సుఖదు:ఖాలను లెక్కచేయక తన కర్తవ్య నిర్వహణలో ముందుకే వెళుతుంటే ఆయన ధైర్య సాహసాలు, ఉత్తమ వ్యక్తిత్వం ఇవన్నీ ప్రజల ప్రశంసలకు పాత్రమైనాయి. కల్లాకపటంలేని ఆయన ప్రవర్తన అందరినీ తనవైపు ఆకర్షించుకొనేది. ❋

# లెనిన్ బాటలో ముందుకు

పాతూరి వెంకటేశ్వరరావు

**10.** 04.1870న జన్మించిన సమ సమాజ ఆవిష్కర్త లెనిన్ 149వ జయంతిని జరుపుకుంటున్నాం. మానవ మహోపకారుల జయంతి, వర్ధంతులను జరుపుకోవటం మానవాళికి శ్రేయోదాయం. ఏడాది కొకసారైనా వారి మాన వోత్తమ గుణగణాలను మననం చేసుకుంటూ, ఆ దిశగా మనల్ని మనం తీర్చిదిద్దుకునేందుకు అదొక సదవకాశం గదా!

"ప్రాణులన్నింటి కష్టనష్టాలను సుఖ సంతోషాలను తనవిగా భావించు వాడు శ్రేష్టుడు" అంటున్నది భగవద్గీత! అట్టి ఉత్తమ శ్రేణికి చెందిన వారే మార్క్స్, లెనిన్ వంటి మహనీయులు. మానవాళిని వాళ్ళు అమితంగా ప్రేమించారు. అందుకనే అత్యధికులు, కష్టాల కడలిలో మునిగి తేలుతుంటే, కొద్దిమంది మాత్రం నవ్వుల నదిలో పువ్వుల పడవలో విహ రిస్తుండటం, అసహజం, అన్యాయం అనిపించి, పరిష్కారంగా సార్వజనీన, సుఖదాయక సమసమాజం కోసం అన్వేషణ ప్రారంభించారు.

ఆ క్రమంలోనేహెగెల్వంటి హేమాహేమీల తత్వశాస్త్రాలన్నింటినీ ఏళ్లతరబడి మదించి, కారల్మార్క్స్ గతితార్కిక సూత్రాలను ఆవిష్కరిం చాడు. – అలాగే ఒక దిశగా మార్క్సిజాన్నీ – మరోవైపు జారు పాలనలోని రష్యన్ల కడగండ్ల తీవ్రతనూ నిశితంగా పరిశీలిస్తున్నాడు లెనిన్. మార్క్సిజం సూచిస్తున్న విప్లవదశ కోసం, అంటే, ప్రజలందరి సుఖసంతోషార్థం పోరాడి, అట్టి రాజ్యాంగాన్ని రూపొందించుకునే సదవకాశం కోసం తపిస్తున్నాడు లెనిన్: ఆ తపనతోనే కమ్యూనిస్టుపార్టీని నిర్మించటం, పత్రికల ద్వారా కార్యకర్తలను చైతన్యవంతం చేయటం, అయోమయ స్థితిలో "ఏం చేయాలి?" 'రాజ్యం– విప్లవం' వంటి గ్రంథరచనల ద్వారా కర్తవ్య నిర్దేశం చేయటం, తమ ఉద్యమానికి ప్రమాద మనుకున్నవారికి దూరంగా, మిత్రులనుకున్న వారికి చేరువగా ఉంటూ సమ సమాజ నిర్మాణ లక్ష్యంతో సాగిపోతున్నాడు లెనిన్!

1897–1901 సంవత్సరాలలో కరువు కాటకాలు సంభవించడం కౌలురేట్లు పెరిగిపోవ టం– తిండి దొరక్కదేశ ప్రజలు మలమలమాడు తుంటే అధికలాభాల అత్యాశతో దేశం నుండి ధాన్యం ఎగుమతి కావటం – జారుప్రభుత్వం పాల్గొన్న యుద్ధంలో ఓడిపోవడం– నిరుద్యోగుల సంఖ్య కోటికి పెరగడం ఇట్టి అవకతవకల కారణంగా 1905 నాటికి రష్యాలో కొద్దిమంది భారీ ధనికులు తప్ప తక్కిన అన్ని వర్గాల వారూ ఏదో ఒక అసంతృప్తితో రగిలిపోతూ ఉన్నారు. ఆ పరిస్థితులన్నింటినీ గతితార్కిక సూత్రాలతో బేరీజు వేసుకున్న లెనిన్ 14-1-1905న 'విపర్యాద్' అను పత్రికా ముఖ్యంగా "రష్యాలో విప్లవం రాబోతున్నది. కామ్రేడ్స్ ఇక నుండి మనం వేసే ప్రతి అడుగూ, జారు నిరంకుశత్వా నికి వ్యతిరేకంగా, తమ విముక్తి కోసం శ్రామి కులు చేయబోయే మహాయుద్ధానికి చేరువగా తీసుకెళ్తుందన్న స్పృహతో పనిచేద్దాంగాక" అంటూ 12 సంవత్సరాల ముందుగానే విప్లవ రాకడను గూర్చి జోస్యం చెప్పాడు లెనిన్! మానవాళిపట్ల ఆయనకు గల ప్రగాఢ ప్రేమ, వారికెలాగైనా సుఖసంతోషాల నందజేయాలన్న తపన, అవే లెనిన్ చేత అంతటి సునిశిత పరిశీలన చేయించాయన్నది వాస్తవం!

లెనిన్ విశిష్టత: మేధావులంతా మార్క్సి జాన్ని, విప్లవాన్ని చక్కగా నిర్వచిస్తూ సోదాహ రణంగా విశదీకరిస్తుంటే, లెనిన్ మాత్రం నిర్వచనాల కతీతంగా వాటిని ఆచరణాత్మకంగా ఆలోచిస్తూ, వాటి సత్తాను ప్రజల అనుభవంలోకి తెచ్చి వీలైనంత త్వరగా వాటి ఫలాలను ప్రజలకందించేందుకు తపించాడు. ఆ తపనే, మార్క్సిజాన్ని ఆచరణాత్మక శక్తిగా 20వ శతాబ్దంలోకి నడిపించిన లక్ష్య సాధకునిగా సమసమాజ ఆవిష్కర్తగా చరితార్థునిగా లెనిన్ను నిలిపింది!

లెనిన్ దృష్టిలో విప్లవమంటే?: " కొద్ది మందికి అర్థదాయకంగా, అనేకమందికి అనర్థదాయకంగా ఉన్న ఈ ప్రపంచాన్ని, సార్వజనీన సుఖదాయకంగా మార్చుకోవచ్చు అన్న ఊహతో ప్రజలు సార్వజనీనంగా సమా యత్తం కావటమే. న్యాయమైన ఈ భావాన్నే కీలకమైన ఆయుధంగా మలుచుకుని 1) బూర్జువాల నుండి అధికారాన్ని హస్తగతం చేసుకోవటంలోను 2) కఠోరశ్రమతో కూడిన సోషలిస్టు సామాజిక పునర్నిర్మాణంలోనూ ప్రజలను భాగస్వాములను చేయగలిగాడు లెనిన్. అదీ ఆయన కార్యదక్షతా రహస్యం!

లెనిన్ ప్రాప్త కాలజ్ఞత (సమయస్ఫూర్తి) : గతితార్కిక లేక చారిత్రక అనివార్యతరీత్యా విప్లవం వచ్చి తీరుతుంది. అలా దానంతటది వచ్చేదాకా, ఆ శుభతరుణంకోసం వేచియుండి అప్పుడు విప్లవ సాధనకుప్రమించడం సాధారణ పద్ధతి! అసాధారణ పరిస్థితులలో ముందుగానే వచ్చిన అవకాశాన్ని గుర్తించి, దాన్ని అంది పుచ్చుకుని త్వరితంగా విప్లవాన్ని సాధించు కోవడం అసాధారణ పద్ధతి లేక ప్రాప్తకాలజ్ఞతా పద్ధతి!

ఉపాయోపేతమైన, అట్టి ప్రాప్తకాలజ్ఞతా పద్ధతిని అనుసరిద్దామంటూ 1917 సంవత్స రం ఏప్రిల్ నెలలో, లెనిన్ బోల్షెవిక్ పార్టీ ముందుంచిన, సహేతుక విప్లవ సాధనా సిద్ధాం తమే 'ఏప్రిల్థీసిస్'గా చరిత్రకెక్కింది. దాన్ని ఏప్రిల్8న 13:2 ఓట్ల తేడాతో ఓడించింది బోల్షెవిక్ పార్టీ పొలిట్బ్యూరో. అది పిచ్చివాని ప్రేలాపనగా వ్యాఖ్యానించారు కొందరు. 'హమ్మో అప్పుడే శ్రామిక విప్లవమా? లెనిన్కు పిచ్చిగాని పట్టలేదుగదా" అంటూ లెనిన్ భార్య సైతం వాపోయింది.

ఐనా జావగారి పోలేదు ధీరోదాత్త లెనిన్. పార్టీ నాయకులను, మేధావులనూ, వాళ్ల పాటికి వాళ్లనొదిలేశాడు. సాధారణ పార్టీ కార్యకర్తలను సమావేశపరిచి, తాను గుర్తించిన విప్లవ సాధనా అవకాశాన్ని గూర్చి, సహేతుకంగా, ఆత్మవిశ్వాస భరితంగా వివరించాడు. రష్యాలో నెలకొన్న అసాధారణ పరిస్థితుల కారణంగా ముందుగానే విప్లవ దశ వచ్చేసింది. ఈ అవకాశాన్ని అంది పుచ్చుకుని తక్షణం సమసమాజాన్ని నెలకొల్పు

> **“ పరిపూర్ణ ఆత్మవిశ్వాసంతో 1917 ఆక్టోబరులో విప్లవానికి పిలుపిచ్చాడు లెనిన్. ఆ పిలుపు నందుకున్న కార్మికవర్గం కెరెన్స్కీ ప్రభుత్వాన్ని కూలదోసి పాలనాధికారాన్ని హస్త గతం చేసుకున్నది. అలా విజయవంతమైన అక్టోబరు విప్లవం చారిత్రాత్మకమై నాటికి నేటికి విప్లవ స్ఫూర్తి వెదజల్లుతున్నది. లెనిన్ విప్లవ సూర్యునిలాచరిత్ర పుటాకాశంలో భాసిస్తున్నాడు.”**

కోవటం పిచ్చోతుందా? సమయస్ఫూర్తి ఔతుందా? అని లెనిన్ ప్రశ్నించగానే కార్యకర్తలకు జ్ఞానోదయమయ్యింది.

సమసమాజం కోసం తపిస్తున్న వారందరికీ, దాన్ని సాధించి పెట్టే తండ్రిలా ఆగుపించాడు లెనిన్. అంతే తక్షణం నడుం బిగించారు. లెనిన్ బాటలో లెనిన్ భావజాలాన్ని సహేతుకంగా ప్రబోధిస్తూ, ప్రజామద్దతుకు, పార్టీ బలోపేతానికి పూనుకున్నారు. సదరు కార్యకర్తలు. 1917 ఏప్రిల్ నాటికి కేవలం 24 వేలుగా వున్న పార్టీ సభ్యత్వం జులై నాటికి 2 లక్షల 20 వేలకు పెరిగి వటవృక్షంలా విస్తరించింది. అలా కొద్ది నెలలోనే పూర్తిగా పార్టీ మద్దతును, పార్టీకి ప్రజా మద్ధతును సమీకరించుకోవటంలో విజయుడయ్యాడు లెనిన్!

పరిపూర్ణ ఆత్మవిశ్వాసంతో 1917 ఆక్టోబరులో విప్లవానికి పిలుపిచ్చాడు లెనిన్. ఆ పిలుపు నందుకున్న కార్మికవర్గం కెరెన్స్కీ ప్రభుత్వాన్ని కూలదోసి పాలనాధికారాన్ని హస్త గతం చేసుకున్నది. అలా విజయవంతమైన అక్టోబరు విప్లవం చారిత్రాత్మకమై నాటికి నేటికి విప్లవ స్ఫూర్తి వెదజల్లుతున్నది. లెనిన్ విప్లవ సూర్యునిలాచరిత్ర పుటాకాశంలో భాసిస్తున్నాడు.

నాటి రష్యాలోని నాగరిక బూర్జువా వర్గం నుండి మిక్కిలి వెనకబాటు తనం గల కార్మిక వర్గం అధికారం తీసుకున్నా, ఆ స్థితిలో కార్మిక శ్రేయోరాజ్యాన్ని, సమసమాజ నిర్మాణాన్ని రూపొందించటం ఆషామాషీ వ్యవహారం కాదని లెనిన్‌కు తెలుసు. అందుకే విప్లవం దెబ్బమీద దెబ్బవేయాలని పిలుపునిచ్చాడు. నాడు రష్యన్లకు తక్షణ ఆవశ్యకాలైన 1) శాంతి నెలకొల్పటం 2) భూములను, బ్యాంకులను జాతీయం చేయటం 3) సార్వజనీన విద్య, వైద్యం 4) ఉండటానికి ఇల్లు 5) తినటానికి తిండి 6) చేయటానికి పని, 7) ఉత్పత్తుల పంపిణీ ఇవన్నీ విప్లవకర కార్మికవర్గం నాయకత్వంలో జరగాలని పిలుపునిచ్చాడు. అలా విప్లవం ద్వారా రాజ్యాధికారాన్ని కైవసం చేసుకున్న కార్మికవర్గం చేత అదే విప్లవ స్ఫూర్తితో కఠోర శ్రమతో కూడిన, సామాజిక పునర్మిర్మాణ కర్తవ్యాన్ని కూడ విజయవంతంగా నెరవేర్చగలిగాడు లెనిన్! విప్లవం దెబ్బ మీద దెబ్బ వేయటమంటే అదే!

మానవీయ లెనిన్ చేత 1917 అక్టోబరులో ఆవిష్కరింపబడినట్టి సమసమాజం కోసం, విశ్వమంతటా విస్తరిస్తున్న కమ్యూనిజానికి 1990 వ దశకంలో ఎదురు దెబ్బలు తగిలాయి. ఇట్టి స్థితిలో లెనినిజం ఇస్తున్న భరోసా ఏమంటే? – కమ్యూనిజానికి ఇంతటితో నూకలు చెల్లాయిని జావగారిపోవాల్సిన పనిలేదు. ఎందుకంటే? శ్రామిక విముక్తికీ, సమసమాజ ఆవిష్కరణకు కమ్యూనిస్టు పోరాటమే జగదేక ఆయుధం. కావున కమ్యూనిజానికి మరణమన్నది లేదుగాక లేదు. ఐతే కమ్యూనిజాన్ని సజీవంగా, సార్వజనీనంగా నిలుపుకోవాలంటే, అదొక నిరంతర అన్వేషణా ప్రక్రియ అన్న వాస్తవాన్ని సదా గుర్తుంచుకొని కమ్యూనిస్టులు మసలు కోవాలి!

ఉదాహరణకు గుండె కిడ్నీ వంటి కీలక అవయవాలు నిరంతరం పనిచేస్తుంటేనే ప్రాణి మనగలుగుతుందన్నది ఎంత వాస్తవమో, కమ్యూనిస్టులు నిరంతర అన్వేషణా కార్యక్రమంలో అప్రమత్తులై ఉంటేనే, సమసమాజం సజీవంగా మనగల్గుతుందన్నది అంతే వాస్తవం!

గుండెకు వాల్వు దెబ్బతిన్నా, కొలెస్ట్రాలు అడ్డుపడినా దానిపని ఐపోయినట్లు కాదుగదా, వాల్వు మార్చో, బైపాస్ సర్జరీ చేసో తిరిగి పనిచేయిస్తున్నాం గదా? అలాగే 1990 వ దశకంలో కమ్యూనిజం గుండెకు ఏర్పడిన పెను ఆటంకాన్ని తొలగించుకుని తిరిగి మనం ముందుకు సాగాలంతేసుమా!

అందుకు లెనిన్ చెప్పినట్లు తిరిగి మొదలెత్తుకుందాంగాక! ప్రస్తుత అయోమయ స్థితిలో ఏం చేయాలి? 'రాజ్యము – విప్లవం' మొదలగు గ్రంథాలతో సహా లెనినిజాన్ని సరళీకరించి, అంటే సూర్యకాంతిని తనలో నింపుకొని చంద్రుడు మన కందిస్తున్న వెన్నెలలాగన్నమాట, కార్యకర్తలకు విస్తృతంగా అందించాలి! లెనినిజంలోని కీలక నిర్దేశమేమంటే? – ఈ పెట్టుబడిదారీ సామ్రాజ్యంలో ప్రపంచ వ్యాప్తంగా పిలకలుతొడిగి విజృంభిస్తున్న ఉగ్రవాదం– తీవ్రవాదం– మతోన్మాదం, వర్ణ, జాతి, కుల, స్త్రీ, వివక్ష– మద్యం, మాదక ద్రవ్యాలు, మాఫియా, ప్రాంతీయ కల్లోలాలు– అవినీతి, కల్తీ, క్లబ్బులు, పబ్బులు, జూదం, వ్యభిచారం, హత్యలు, యుద్ధాలు– ధనంతో అధికారం అధికారంతో ధనం కుట్రలు, కుతంత్రాలు ఇదీ, అదీ అననేల విశ్వంలో చెలరేగుతున్న సమస్త సామాజిక రుగ్మతలన్నింటికీ కుదరు పెట్టుబడిదారీ వ్యవస్థే. కావున దాన్ని కూకటివేళ్లతో పెకలించి, ఆస్తిహక్కును రద్దుచేసే దాక ఈ రుగ్మతలు తేనెటీగల బారి నుండి మానవాళిని కాపాడలేం గాక కాపాడాలేం. అందుకు రాజీలేని కమ్యూనిస్టు పోరాటానికి మించిన ఆయుధం లేదంటున్నది లెనినిజం.

ఈ స్థితిలో లెనిన్ సందేశాన్నందుకుని, 'గతంగత: ఇక ముందు ఏ పార్టీతోనూ అంటగొక్కండా స్వీయవ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ ప్రజా పునాది సుధృడపరుచుకుంటూ, లెనిన్ చెప్పినట్లు 'మళ్లీ మొదలెత్తుకోవాలి' అని సిపిఐఎం తీసుకున్న నిర్ణయం సర్వత్రా అభినందించబడుతున్నది. అదే నిర్ణయంతో ఆసేతు హిమాచల పర్యంతం వటవృక్షంలా విస్తరించటానికి కమ్యూనిజానికెంతో సమయం పట్టదని రాజకీయ మేధావులు చర్చించుకుంటున్నారు. ఆ శుభ తరుణం కోసం సార్వజనీనంగా ఎదురుచూస్తున్నది భారతదేశం!

ఇక లెనిన్‌కు గల 1) మానవాళిపట్ల ప్రగాఢప్రేమ 2) సునిశిత సామాజిక పరిశీలిన 3) సంక్షోభ సమయాల్లో దీరోదాత్తత 4) ప్రాప్త కాలజ్ఞత 5) దీర్ఘదర్శిలను అందిపుచ్చుకోవడం ద్వారా, మన మాయనకు ప్రియమైన జన్మదిన కానుకను సమర్పించుకుందాం. ఓ ప్రియతమ మానవీయ,మహనీయ వ్లదిమిర్ ఇల్యిచ్ ఉల్యానోవ్! లెనిన్! సమస్త మానవుల, సమసమాజ నిర్మాణ కృషీవలురందందరి తరపునా నీకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు! నీవంటి మానవ మహోపకారిని ప్రపంచానికందించిన మీ అమ్మానాన్నలకు సర్వదా కృతజ్ఞతలు!! ❃

ఆర్థికరంగం

# ద్రవ్య పెట్టుబడిని ప్రతిఘటించాలి

**ప్రభాత్ పట్నాయక్**



రచయిత
ప్రముఖ ఆర్థికవేత్త

అక్టోబర్ విప్లవం చరిత్రలో సైద్ధాంతికంగా ఊహించి ప్రణాళికా బద్ధంగా ఆచరణలో పెట్టిన మొట్ట మొదటి విప్లవం. ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌లలోని మిగిలిన బూర్జువా విప్లవాలలాగా ఫిబ్రవరి విప్లవం యాధృచ్ఛికంగా జరిగింది. కానీ అక్టోబర్ విప్లవం ఆలా కాదు. అదే సమయంలో కొంతమంది అపనిందలు మోపేవారు ఆక్షేపించినట్టు కొద్దిమంది తిరుగుబాటుదారులు అధికారాన్ని హస్తగతం చేసుకుని సోషలిజాన్ని పాదుగొల్పడం కూడా కాదు. 'విప్లవం అద్భుతంగా ఉంటుంది. మనం కూడా ఆస్వాదిద్దాం' అనేటువంటిది కాదు. అది పరిస్థితులను అంచనా వేసి సిద్ధాంతాన్ని అన్వయించి నడిపినది. జార్జి లూకాస్ మాటల్లో చెప్పాలంటే ఇది "ఆచరణాత్మకమయిన సిద్ధాంత రూపకల్పన". విప్లవానికి మూలమయిన ఈ సిద్ధాంతమే అపారమయిన శక్తిని జనింపచేసింది, ప్రపంచాన్ని మార్పులతో ఎంతగా ముంచెత్తిందంటే పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడే ప్రశ్నార్థకమైంది. కానీ ఆ భయం తాత్కాలికమవడానికి కారణం పరిస్థితులు మారడం, ఈ మారిన పరిస్థితులను మొదటి సిద్ధాంత అవగాహన ఊహించలేక పోవడం. కార్మిక, కర్షక ఐక్యత ఈ సైద్ధాంతిక అవగాహన దశలవారీగా జరిగింది. ఇందులో రెండుదశలు అత్యంత ప్రధానమయినవి. మొదటిది, వి ఐ లెనిన్ చెప్పినట్టు 1782లో లాగా ఇప్పటి బూర్జువా వర్గం ఫ్రెంచ్ విప్లవ కాలంలోని బూర్జువా వర్గం లాగా భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా ఎదురుతిరగదు. రెండు, మారిన పరిస్థితులలో బూర్జువా వర్గం భూస్వాముల ఆస్తులపై దాడికి సిద్ధపడదు. ఆలా దాడిచేయడం వలన తన ఆస్తులపై కూడా దాడులు జరిగే అవకాశాలుంటాయి. కాబట్టి అటువంటి దాడులకు పూనుకోదు. అది భూస్వామ్య వర్గంతో లాలూచి పడుతుంది. అందువలన బూర్జువా వర్గం చేయాల్సిన పనిని, అంటే రైతాంగాన్ని భూస్వాముల బారి నుండి విముక్తి చేయాల్సిన పనిని కార్మిక వర్గం చేయాలి. రైతాంగం ఎంత చిన్న మొత్తంలో ఉన్నప్పటికీ, ఎంత ఆలస్యంగా ఉద్యమాలలోకి వచ్చినప్పటికీ రైతాంగాన్ని కార్మికవర్గమే పోరాటంలోకి తీసుకుని రావాలి.

ఈ పరిస్థితిలో కార్మికవర్గం నాయకత్వంలో కార్మిక కర్షక మైత్రి అవసరం అవుతుంది. భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా బూర్జువా వర్గం నడపాల్సిన విప్లవాన్ని కార్మిక వర్గం కార్మిక, కర్షక మైత్రితో నడిపినందువలన వారి మధ్య ఏర్పడ్డ మైత్రి అంతటితో ఆగదు. పెట్టుబడిదారి వర్గం విముక్తి కావడానికి సహాయపడి, కొత్తగా విముక్తి పొందిన వర్గంలో కొత్తగా దోపిడీకి గురవుతున్న రైతాంగాన్ని విముక్తి చేయడానికే కార్మికవర్గం పరిమితమవదు. విప్లవాన్ని కొనసాగించే ప్రయత్నంలో బూర్జువా వర్గాన్ని విముక్తి చేసిన కార్మిక వర్గం విప్లవాన్ని మరింత ముందుకు, అంటే సోషలిజం వైపుకు తీసుకుని వెళ్లే ప్రయత్నం చేస్తుంది. ఆ నేపథ్యంలోనే కార్మిక, కర్షక మైత్రి రకరకాలుగా మార్పు చెందుతుంది. ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీ రెండు ఎత్తుగడలు అనే రచనలో లెనిన్ "కార్మిక వర్గం ప్రజాతంత్ర విప్లవాన్ని తుదికంటా తీసుకుని వెళ్ళాలి. ఆ సందర్భంలో కార్మిక వర్గం కర్షకులతో చెలిమి చేసి నియంతృత్వాన్ని బలంప్రయోగంతో ఎదుర్కోవాలి. పెటి బూర్జువా రైతాంగ ఊగిసలాటలను తటస్థీకరించాలి. సోషలిస్టు విప్లవంలో ప్రజాబాహుళ్యంలోని అర్ధ కార్మిక వర్గ మూలాలున్న కార్మికవర్గంతో చెలిమి చేసి, బూర్జువా వర్గ ప్రతిఘటనను బల ప్రయోగంతో ఎదుర్కొని, రైతాంగ పెట్టీ బూర్జువా ఊగిసలాటలను తటస్థీకరించి సోషలిస్ట్ విప్లవ కర్తవ్యాన్ని కార్మిక వర్గం నిర్వహించాలి." కార్మికవర్గ నేతృత్వంలో కార్మికులు కర్షకులతో మైత్రి నెరపి, కొంత కాలానికి మొత్తం వర్గ పొందికను మార్చి, ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదం చేసి, ఆ తరువాత సోషలిస్టు విప్లవం వైపు అడుగులు వేయడం అన్నది సిద్ధాంత అవగాహనలోనే ఒక పెద్దమార్పు. ఇది మార్క్సిస్టు సిద్ధాంతం మౌలికంగా ముందుకు వెళ్లడాన్ని సూచిస్తున్నది.మొదటగా కార్మికులు నాయకత్వం వహించే విప్లవ శక్తిలో రైతాంగాన్ని భాగస్వాములను చేయడం, వారి పట్ల ఇదివరకు ఉన్న అవగాహనలో మార్పును సూచిస్తున్నది. ఫ్రెంచి విప్లవకాలంలో బూర్జువావర్గం రైతాంగాన్ని తమవైపు ఉంచుకోవడం వలన ఆ విప్లవ సమయంలోనే కాక, ఆ తరువాత పారిస్ కమ్యూన్ సమయంలో కూడా లాభపడ్డారు. ఇప్పుడు మారిన పరిస్థితులలో రైతాంగం కార్మికవర్గం వైపు చేరింది. రెండు, అంతవరకూ యూరపుకే పరిమితమైన మార్క్సిస్టు సిద్ధాంతం ఇప్పుడు ప్రపంచం మొత్తానికి, అక్కడ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత తక్కువగా అభివృద్ధి చెందివున్నాసరే, వర్తించే వీలు ఏర్పడింది. మూడు, దశల వారీగా ఇప్పుడు ప్రపంచంలోని అన్ని దేశాలు సోషలిజం వైపు పయనం అవ్వాల్సిందే. సోషలిజం ఇప్పుడిక కేవలం అభివఅద్ధి చెందినపెట్టుబడిదారీదేశాలకు సంబంధించినది మాత్రమే కాదు, అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా సోషలిజాన్ని తమ అజెండాలో పెట్టుకోగలవు ఇప్పుడిక సోషలిజం సాధించడానికి మార్క్స్ చెప్పినట్టు ప్రతిదేశం చారిత్రికంగా ప్రతి మెట్టు ఎక్కవలసిన పనిలేదు. అభివృద్ధి చెందిన దేశాలు నేరుగా సోషలిజం వైపు ప్రయాణం చేయ గలిగి ఉండవచ్చు అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న పెట్టుబడి దారీ దేశాలు రకరకాల చారిత్రిక దశలు దాటి గమ్యం చేరుకోవడానికి మరింత కాలం పట్టవచ్చు. కానీ ప్రతి దేశ విప్లవ పోరాటానికి చివరి మజిలీ సోషలిజం అయే అవకాశం ఏర్పడింది.


> “మొట్ట మొదట దేశాలన్నీ ఒకే విధమైన పరిస్థితులలో ఉన్నాయని, ఆయా దేశ ప్రజలు స్వేచ్ఛ కోసం రకరకాల దారులను వెతుక్కుంటున్నారని అర్థం చేసుకుంటే అప్పుడు వారి ప్రయాణాలన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని అర్థం అవుతుంది. సామ్రాజ్యవాద గొలుసులో బలహీనమైన లింకును తెగగొట్టే అవకాశం ఏర్పడుతుంది”

### సామ్రాజ్యవాదం

రెండో ముఖ్యమయిన అంశం. కార్ల్ మార్క్స్ చెప్పినట్టు పెట్టుబడి దారీ విధానం అభివృద్ధి చెందడంతోనే ద్రవ్య, పారిశ్రామిక పెట్టుబడులు కొంతమంది చేతులలో కేంద్రీకృతమై గుత్తాధిపత్యానికి దారి  తీస్తుంది.

కొద్దిమంది మాత్రమే ద్రవ్య పెట్టుబడికి పారిశ్రామిక పెట్టుబడికి అధిపతులుగా ఉంటారు. వీరు రాజ్యంలోని వ్యక్తులతో ‘వ్యక్తిగతంగా కుమ్మక్కయి’ విధానాలను తమ అధీనంలో ఉంచుకుంటుంటారు. తమకనువుగా మలుచుకుంటారు. వాటి రూపాన్నికూడా మార్చుకుంటారు. ఇది పెట్టుబడిదారీ విధానం యొక్కఅతి ముఖ్యమైన కొత్తదశ. ఈ దశలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు తమ దేశాలలోని గుత్తాధిపతులు ‘ఆర్థిక రాజ్యాల’ హస్తగతం చేసుకోవడానికి ఒకరితో ఒకరు పోటీ పడుతుంటారు. నిజానికి ఇప్పటికే ప్రపంచం వారి మధ్య పంచుకోబడింది. అందువలననే ఈ పోటీలో గెలిచేందుకు యుద్ధాలు అవసరం అవుతున్నాయి. ఈ యుద్ధాలలో ఒకటి మొదటి ప్రపంచ యుద్ధం. ఇందులో కార్మికులు ఒకరిని ఒకరు చంపుకోవలసిన దుస్థితి ఏర్పడింది. కొంతమంది ధనిక పెట్టుబడిదారుల కోసం దోపిడీకి గురవుతున్న సామాన్య ప్రజానీకం, అర్ధ వలస దేశ ప్రజలు బలి అవవలసిన పరిస్థితి దాపురించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఏదశకు చేరిందంటే తమ మధ్య విభజించబడిన మార్కెట్లను పునర్విభజించుకోడం వారివారి బలాబలాలను సూచిస్తుంది. అందువలన యుద్ధాలు తప్పనిసరి అవుతున్నాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ దశ యొక్క అవగాహనకు రావడానికి లెనిన్ జె ఏ హాబ్సబౌన్‌ను అనుసరించి ‘సామ్రాజ్యవాదం’ అని అన్నారు. దీనికి అనేక పర్యవసానాలు ఉన్నాయి. మొదటిది, మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం ఏ ఉత్పత్తి విధానం అయినా చారిత్రకంగా పూర్తిగా



కారల్ మార్క్స్

పనికి రాకుండా పోతేగానీ మార్చబడదు. కానీ ఈ ‘పనికి రాకుండా పోవడం’ అన్నది సంకుచితంగా, కేవలం ఆర్థిక అంశానికి పరిమితమైంది. ముంచెత్తుతున్న ఆర్థిక సంక్షోభానికి పరిమితమయింది. ఎడ్వర్డ్ బర్న్‌స్టీన్ మార్క్సిజం ‘సంస్కరించ’ బడాలని కోరుకున్నాడు. పెట్టుబడి దారీ వ్యవస్థలోనే అది విప్లవాత్మకంగా  కూలిపోయేందుకు అవసరమయిన సంస్కరణల అజెండా ఇప్పుడున్నవాటి స్థానంలో ఉండాలన్నారు. అప్పుడిక నిరంతర సంక్షోభాలు ఉండవు ‘వ్యవస్థ కూలిపోవడాలు’ ఉండవు అన్నారు. రోజా లగ్జంబర్గ్ పెట్టుబడి పోగుపడుతుందన్న సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసి ఒక విప్లవ దృక్పథాన్ని నొక్కి చెప్పారు. అయితే లెనిన్ వాదన మొత్తం వాదనలనే సమూలంగా మార్చి వేసింది. పెట్టుబడిదారీ విధానమే చరిత్రాత్మకంగా పాతబడిపోయింది. లేదా మరణశయ్యపైనుంది. ఎందుకంటే దాని సామ్రాజ్యవాద దశ మానవజాతిని అంతంచేసే యుద్ధాలను క్రమం తప్పకుండా  చేస్తున్నది. అది అభివృద్ధి చెందిన దేశాలలోని కార్మికులకు ఇతర దేశాలలోని తమ తోటి కార్మికులపై తుపాకీలను ఎక్కుపెట్టడమా లేదా తమ దేశంలోని దోపిడీదారులపై ఆ తుపాకులను ఎక్కుపెట్టడమా అని ఎంపిక చేసుకునే అవకాశాన్ని మాత్రమే ఇచ్చింది. ‘సోషలిజం కావాలా ఆటవికత కావాలా?’ అనేదే వారి ముందున్న ప్రశ్న (రోజా లగ్జంబర్గ్ మాటల్లో). రెండు, ఒక్క అభివృద్ధి చెందిన దేశ కార్మికులే కాదు. ‘అణగారిన దేశాల’ కార్మికులు కూడా ఈ దోపిడీ నుంచి మినహాయించ బడలేదు. వారూ  యుద్ధాలకు సమిధలవుతూనే ఉన్నారు. యుద్ధాల కారణంగా వారి జీవితాలు నాశనమవుతున్నాయి. యుద్ధాల వలన వారి చైతన్యం, శిక్షణ, సైనిక శిక్షణతో సహా ఎన్నో రెట్లు పెరిగాయి. వారుకూడా పెట్టుబడికి వ్యతిరేకంగా ఎదురుతిరగడం ప్రారంభించారు. వారిముందున్నది కూడా తోటి కార్మికులపై ఆయుధాలు ఎక్కుపెట్టడమా, వ్యవస్థపై ఎక్కు పెట్టడమా అన్న ఎంపికే. ఆటవికతా, స్వేచ్ఛా అన్నదే ఆ ప్రశ్న. మూడవది, ఈ వ్యవస్థ సాధారణంగా చెప్పుకోవాలంటే చరిత్రత్మాకంగానే పనికి రానిదయిపోయింది. అంతేకాదు ప్రపంచ విప్లవం తప్పనిసరి అయిన ఒక చారిత్రక అజెండాగా ముందుకు వచ్చింది. అంటే సామ్రాజ్యవాదం, దాని వలన వచ్చే యుద్ధాలు మానవులను  ఆటవికత గాని సోషలిజం గాని  ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితిని కల్పించాయి.


మొట్ట మొదట దేశాలన్నీ ఒకే విధమైన పరిస్థితులలో ఉన్నాయని, ఆయా దేశ ప్రజలు స్వేచ్ఛ కోసం రకరకాల దారులను వెతుక్కుంటున్నారని అర్థం చేసుకుంటే అప్పుడు వారి ప్రయాణాలన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని అర్థం అవుతుంది. సామ్రాజ్యవాద గొలుసులో బలహీనమయిన లింకును తెగగొట్టే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా సామ్రాజ్యవాదాన్ని కూల్చివేయగలుగుతాం. ఆ రకంగా ఈ గొలుసును ఉన్న పరిస్థితులలో ఎటూ తెగగొట్టక తప్పదు. ఈ అవగాహన పర్యవసానం ఏమిటంటే ఒక అంతర్జాతీయ సంస్థ, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్, అప్పటికి ప్రపంచం ఎన్నడూ చూడనటువంటిది, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, చైనా, ఇండియా మెక్సికో, ఈజిప్ట్, వియత్నాంలతో కలిసి ఏర్పడింది.

### పరిస్థితులను అర్థం చేసుకోవడం

అక్టోబర్ విప్లవం భావించినట్టుగానే, పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక అంచుకు చేరుకున్నదని ఇక అదే స్థితిలో మనలేదని కమ్యూనిస్టులే కాక ఎంతోమంది కమ్యూనిస్టు వ్యతిరేకులు కూడా ఆనాడు భావించారు. అంటే ఆనాటి పరిస్థితుల అంచనా సరైనదే. జాన్ మేనార్డ్ కీన్స్ 1933లో ఇలా వ్రాశారు, ‘యుద్ధం తరువాత క్షీణిస్తున్న అంతర్జాతీయత, పెరుగుతున్న

వైయక్తిక పెట్టుబడిదారీ వ్యవస్థలో మనమున్నాం. ఇది విజయం కాదు. ఇది తెలివయినది కాదు. అందమయినది కాదు. న్యాయమయినది కాదు ధర్మమయినది కూడా కాదు – దీనివలన కార్య సాధన కూడా జరగదు. క్లుప్తంగా చెప్పాలంటే ఇదంటే మనకు ఇష్టం లేదు. మనం దానిని అసహ్యించుకోవడం మొదలు పెట్టాము. అయితే దాని స్థానంలో ఎది ఉండాలన్నప్పుడు మనకు వేరే మార్గం కనిపించడం లేదు. కీన్స్ కూడా ఆనాడు పెట్టుబడిదారీ విధానాన్ని అసహ్యించుకున్నాడు.

❝యుద్ధం ముగిసిన వెంటనే కమ్యూనిస్టుల పాలన ముందడుగు వేసింది. పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గం దృఢంగా ముందుకొచ్చింది. విన్స్టన్ చర్చిల్ లేబర్ పార్టీ చేతిలో ఓడిపోయాడు. ఫ్రెంచ్, ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీలు కూడా బలం పుంజుకున్నాయి. వలస, అర్థవలస దేశాలలోని ప్రజలు ఆందోళనలు ప్రారంభించారు. అంతర్జాతీయ పెట్టుబడి బలహీనపడింది. యుద్ధంతో దానిశక్తి హరించిపోయింది.❞



1782లో జరిగిన ఫ్రెంచ్ విప్లవం

అంతకు ముందు కీన్స్ రాసిన 'ది ఎకనామిక్ కాన్సిక్వెన్సెస్ అఫ్ పీస్' అనే పుస్తకంలో పెట్టుబడిదారీ వ్యవస్థ విచ్ఛిన్నమవడం కళ్ళకు కట్టినట్టు వివరించాడు. దీనిని లెనిన్ 1920లో జరిగిన రెండవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సదస్సులో ఉటంకిస్తూ ప్రపంచ విప్లవానికి సమయం ఆసన్నమయిందని అన్నారు. అందువలన అక్టోబర్ విప్లవం ఆనాటి పరిస్థితుల మొదటి ఫలితమని లెనిన్, బోల్షివిక్ పార్టీ భావించారు. ఎంతోమంది ఆ భావనతో ఏకీభవించారు కూడా. ఈ పరిస్థితులు మొదటి ప్రపంచ యుద్ధం నుండి రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే వరకు, వలస వాదం అంతం మొదలయే వరకు కొనసాగింది. వీటికి కొన్ని లక్షణాలు ఉన్నాయి. అందులో ముఖ్యమయినది సామ్రాజ్యదేశాల మధ్యవైరం. 'మంచికే' అనే వ్యాసంలో రష్యా ప్రతీఘాత విప్లవానికి మద్దతుగా ఇతర సామ్రాజ్యవాద దేశాలు యుద్ధంలో దిగకపోవడానికి దక్షిణ, ఉత్తర సామ్రాజ్యవాద దేశాల మధ్య ఉన్న వైరుధ్యాలు కారణం అని లెనిన్ చెప్పారు. వీటి వలెనే తమకు కొంత ఊపిరి తీసుకునే సమయం దొరకవచ్చని ఆశించారు. యుద్ధం ముగిసిన వెంటనే కమ్యూనిస్టుల పాలన ముందడుగు వేసింది. పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గం దృఢంగా ముందుకొచ్చింది. విన్స్టన్ చర్చిల్ లేబర్ పార్టీ చేతిలో ఓడిపోయాడు. ఫ్రెంచ్, ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీలు కూడా బలం పుంజుకున్నాయి. వలస, అర్ధవలస దేశాలలోని ప్రజలు ఆందోళనలు ప్రారంభించారు. అంతర్జాతీయ పెట్టుబడి బలహీనపడింది. యుద్ధంతో దానిశక్తి హరించిపోయింది. ఎన్నో రాయితీలు ఇవ్వవలసిన పరిస్థితిలోకి నెట్టబడింది. అందులో ప్రధానమయినవి మూడు. వలసలను వదులుకోవడం, ద్రవ్య పెట్టుబడి ఎన్నడూ ఇష్టపడని, యుద్ధానికి ముందు తీవ్రంగా వ్యతిరేకించిన విధానాలైన ప్రభుత్వాలు ఉద్యోగాలను పెంచటం, తద్వారా గిరాకీ పెంచే చర్యలు తీసుకునేందుకు అంగీకరించవలసి రావడం, సార్వత్రిక ఓటు హక్కు ద్వారా ప్రజలు ప్రజాతంత్రయుతంగా తమకు నచ్చిన ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు ప్రజాతంత్ర సంస్థలను ఏర్పాటు చేయటం (ఫ్రాన్స్‌లో కేవలం 1945లో ఇది ఏర్పడింది).

ఈ రాయితీలు పెట్టుబడిదారీ విధానం 'మారిందని' భ్రమలు కల్పించాయి. పాత పెట్టుబడిదారీ విధానం స్థానంలో కొత్త సంక్షేమ పెట్టుబడిదారీ విధానం వచ్చిందని నమ్మించింది. అమెరికాలో పెట్టుబడిదారీ శక్తులు అక్కడి ఉద్యోగితను పైస్థాయిలో నిలిపేందుకు ప్రభుత్వాలు చేసే ఖర్చులలో సైనిక వ్యయాలు పెత్తఎత్తున పెంచేందుకు జోక్యం చేసుకుంటున్నా, స్వాతంత్ర్యాలు ప్రకటించినప్పటికీ తాము ఇదివరకు పాలించిన వలస దేశాలలో జోక్యాన్ని వదులుకోవడం ఇష్టపడక వాటి వనరులపై సామ్రాజ్యవాదులు పెత్తనం కొనసాగిస్తున్నా ఈ నమ్మకం ఏర్పడింది. పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికులు, మూడో ప్రపంచదేశాల ప్రజలు వాస్తవానికి ఒకమేరకు లాభపడటం ఇందుకు కారణం. అయితే యుద్ధం తరువాత లెనిన్ ఉహించినట్టు సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరం ఉండవలసింది పోయి ఒక సూపర్ పవర్ అవిర్భవించింది. అందువలన కమ్యూనిస్టు ఉద్యమం మౌలిక ప్రాతిపదిక అయిన పెట్టుబడిదారీ వ్యవస్థలో సామ్రాజ్యవాద దశ, దేని ఆధారంగా ప్రపంచ విప్లవం తప్పనిసరిగా వస్తుందని అంచనా వేసామో ఆపరిస్థితే మారిపోయింది. క్యూబాలోను, వియత్నాం లోను ఈ కాలంలోనే విప్లవాలు వచ్చిన మాట వాస్తవమే. అయితే వాటిని అంతకు ముందు కాలం ఫలితాలుగానే చూడాలి.

మార్క్స్ అంతగా ప్రాధాన్యత ఇవ్వని పెట్టు బడి కేంద్రీకరణ అంతర్జాతీయ కార్పొరేషన్స్ అవిర్భావానికే కాదు. ద్రవ్య పెట్టుబడి పెద్ద ఎత్తున గుట్టలు గుట్టలుగా పోగుపడడానికి దారితీసింది. ఈ గుట్టలకు మూలాలనేకం ఉన్నాయి. బ్రెటన్ వుడ్స్ కాలంలో అమెరికా డాలర్ బంగారానికి సమానంగా గుర్తింపు పొందడం, 35 డాలర్లు ఒక ఔన్స్ బంగారానికి సమానం అవడంతో అమెరికా కరెంట్ అకౌంట్ లోటు వలన, ఒపెక్ దేశాల పెట్రోలు ధరలు పెరగ డంతో పెట్రోడాలర్లు చేరడం, యుద్ధం తరువాత ఆర్థికాభివృద్ధి కొనసాగడంతో పొదుపు పెరిగి ఆర్థికవ్యవస్థలో నిల్వలు చేరడం, ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వీటితో గిరాకీ పెంచడం వగైరా. ఈ కొత్త

> **“లెనిన్, కౌట్ స్కీలకు జాతీయ ద్రవ్యపెట్టు బడిని గురించిన ఒకే అవగాహన ఉంది. ద్రవ్య పెట్టుబడి దేశంపై ఆధారపడి, దేశం, రాజ్యం సహాయంతో కేంద్ర స్థానం తీసు కున్నప్పుడు పరిస్థితి వేరుగా ఉంటుంది. ఇప్పుడా పరిస్థితి లేదు. ద్రవ్య పెట్టుబడి అంత ర్జాతీయంగా ఉన్నది. లెనిన్, కౌట్ స్కీ ఊహించిన దానికి ఇది భిన్నమైన పరిస్థితి.”**

పరిస్థితులలో ద్రవ్య పెట్టుబడి ఏ అదుపూ లేకుండా ప్రపంచమంతా సంచరించేందుకు స్వేచ్ఛను కోరుకుంది. ఆ ప్రయత్నంలో అది సఫలమయి 'ప్రపంచీకరణ' అనే కొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ప్రపంచ యుద్ధానికి ముందున్న వ్యవస్థలో కన్నా ఇప్పుడు వస్తువులు, సేవలు, ద్రవ్య పెట్టుబడులు జాతి సరిహద్దులు దాటి ప్రపంచమంతా సంచరించదానికి వీలయింది.

### ప్రపంచీకరణ

ప్రపంచీకరణకాలంలో సామ్రాజ్యవాదుల మధ్యనున్న వైరుధ్యాలు మొద్దుబారాయి. అందుకు కారణం ఏదో ఒక దేశ అధిపత్యానికి ఒదిగి ఉండడం కాదు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రపంచీకరణ చెందింది. ప్రపంచాన్ని విభజించి తన పరపతిని ప్రపంచంలోని ఒక భాగంలోని శక్తులకు మాత్రమే పరిమితం చేసి తన చలనాన్ని నిలవరించాలని భావించలేదు.

ఈ రకమైన సామ్రాజ్యవాద దేశాల మధ్యవైరం మొద్దు బారడాన్ని ఎంతోమంది గుర్తించినప్పటికీ, సామ్రాజ్య దేశాల మధ్య నిరంతర వైరుధ్యాలు ఉంటాయన్న లెనిన్ సిద్ధాంతానికి భిన్నంగా, కార్ల్ కౌట్ స్కీ అల్ట్రా ఇంపీరియలిజం ఏర్పడుతుందని ఉహించడాన్ని వ్యతిరేకించడంగా అర్థం చేసుకున్నారు. కానీ ఇది తప్పుడు అవగాహన. లెనిన్, కౌట్ స్కీలకు జాతీయ ద్రవ్య పెట్టుబడిని గురించిన ఒకే అవగాహన ఉంది. ద్రవ్య పెట్టుబడి దేశంపై ఆధారపడి, దేశం, రాజ్యం సహాయంతో కేంద్ర స్థానం తీసుకున్నప్పుడు పరిస్థితి వేరుగా ఉంటుంది. ఇప్పుడాపరిస్థితి లేదు. ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయంగా ఉన్నది. లెనిన్, కౌట్ స్కీ ఊహించిన దానికి ఇది భిన్న మయిన పరిస్థితి. ఈ రోజు సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు మొద్దుబారడానికి కారణం కౌట్ స్కీ చెప్పినట్టు వారందరు కలిసి ప్రపంచాన్ని దోచుకోవాలను కోవడం కాదు. ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిగా అవిర్భవించడం కారణం.

ఈవాస్తవం 'భిన్న ధ్రువ' చర్చలలో కూడా కనుమరుగయింది. మళ్ళీ గనక భిన్నధ్రువ ప్రపంచం ఏర్పడితే సామ్రాజ్యవాదుల మధ్య వైరాలు ఏర్పడవచ్చుఅని అనడం కాదు. అయితే ఇక్కడ గమనించ వలసిన విషయం ఏమిటంటే కేవలం రాజకీయ కారణాలే కాదు, ఆర్థిక అంశాలు కూడా ఇందులో ఇమిడి ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కీలకమైన ఆర్థికాంశం.

జాతి రాజ్యాలప్రపంచంలో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఉందన్నది ఒక వాస్తవం. ఇది కీన్స్ 1933లో ప్రతిపాదించిన, ద్రవ్యం దేశాల ఆధీనంలోనే ఉండాలన్న దానికి విరుద్ధం. ఇది ఈ నాటి ప్రపంచీకరణ యొక్క ఒక ప్రధానమైన రూపం. దీనర్థం జాతి రాజ్యం ప్రపంచ పెట్టుబడి ఆదేశాలకు తల ఒగ్గవలసిందే, లేకపోతే ద్రవ్య పెట్టుబడి ఒక్కుమ్మడిగా మరో చోటికి తరలి పోతోంది సంక్షోభానికి తెరలేస్తుంది. అలా కాకుండా ఉండాలంటే ప్రజలు ఏప్రభుత్వాలను ఎన్నుకున్నా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి అనుకూలమైన ఆర్థిక విధానాలను అనుసరించ వలసిందే. అంతేకాకుండా అంతర్జాతీయ ద్రవ్య సుడిగుండంలో చిక్కుకొని ఉండడం వలన మరికొన్ని ఆర్థిక పర్యవసానాలను ఎదుర్కోవలసి ఉంటుంది. మొదటిది, ఇది రాజ్య స్వభావాన్ని మార్చివేస్తుంది. తన వర్గ స్వభావం ఏదయినా, ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను ఏ మేర కయినా కాపాడాలనుకున్నా అదిప్పుడు సాధ్య పడదు. అదిప్పుడు కేవలం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలను మాత్రమే కాపాడ వలసి ఉంటుంది. ఎందుకంటే దాని దృష్టిలో జాతి ప్రయోజనాలంటే పెట్టుబడి ప్రయోజనాలే. (మోడీ క్రెడిట్ రేటింగ్ దేశం గర్వించదగ్గ అంశం గా మారుతుంది). దీని ఫలితం ముఖ్యంగా మూడో ప్రపంచ దేశాలలో, చిన్న చిన్న ఉత్పత్తిదారులకు, చిన్న రైతుల వ్యవసాయానికి ప్రభుత్వ మద్దత్తు ఉపసంహరించబడుతుంది. పెద్ద పెద్ద పెట్టుబడిదారులు, కార్పొరేట్లు చిన్న ఉత్పత్తిదారుల స్థానాన్ని ఆక్రమించుకోవడం జరుగుతుంది.


మూడో ప్రపంచ దేశాలలో రైతుల మద్దతుతో వలసవాద వ్యతిరేక పోరాటాలు జరిగాయి. వలస విధానం అంతం అవడంతో తమకు బడా పెట్టుబడి దారుల నుండి, ప్రపంచ ధరల ఉగిసలాటల నుండి రక్షణ దొరుకు తుందని రైతులు ఆశించారు. స్వాతంత్రం వచ్చిన తరువాత ప్రభుత్వాలు కూడా తర తమ స్థాయిలలో చిన్న కమతాలను, చిన్న ఉత్పత్తి దారులను ప్రోత్సహించాయి. ఆ లాభాలు ఈ వర్గంలోని ధనిక వర్గానికే ఎక్కువగా చేకూరిన మాట వాస్తవమే అయినా మొత్తంగా చూసి నప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి దోహద పడింది. విదేశాల నుండి వచ్చిన బడా పెట్టుబడిదారుల నుండి ఈ వర్గాన్ని కాపాడింది. కానీ నయా ఉదారవాద విధానాలు ప్రభుత్వం ఇచ్చే ఈ మద్దత్తు, రక్షణ లేకుండా చేస్తాయి. ఎక్కువ తరగతులను పెద్ద సంక్షోభంలోకి నెట్టే స్తాయి. తమ ఉత్పత్తులపై ఆధారపడిన చిన్న ఉత్పత్తిదారులు, కార్మికులు మరింత పేదరికం లోనన్నా మగ్గాలి, లేదా పట్టణాలకు వలసలు పోయి లేని, దొరకని ఉద్యోగాల కోసం వేటాడాలి, లేదా ఆత్మహత్యలకన్నా పాల్పడాల్సివస్తుంది.

రెండవది, నిరుద్యోగ కార్మిక సైన్యం అపారంగా పెరగడం. స్థూల జాతీయోత్పత్తి పెరుగు తున్నా పెరుగుతున్న నిరుద్యోగులను ఇముడ్చు కోలేకపోతున్నది. అంతేకాదు ఉన్న పనులు పోయిన వారికి కొత్తగా పనులు దొరకడం మరింత కష్టసాధ్యం అవుతున్నది. అందువలన కార్మికుల సమర్థత పెరుగుతున్నాగాని కార్మికుల నిజవేతనాలు, సంఘటిత రంగంలో కూడా పెద్దగా పెరగడం లేదు. ఇందువలన మూడో ప్రపంచదేశాలతో అదనపు విలువ భాగం పెరుగుతుంటుంది. ఇప్పటికే ఈ దేశాలలో నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నది. అందువలన ఆదాయాలలో అసమానతలు పెరుగు తున్నాయి. అయితే ఇది కేవలం మూడో ప్రపంచ దేశాలలోనే ఉన్న విషయం కాదు. అభివృద్ధి చెందిన దేశాలలో, చెందని దేశాలలో కూడా పెట్టుబడి సంచరిస్తుంటుంది. కాబట్టి అభివఅద్ధి చెందిన దేశాలలోని కార్మికులు కూడా అభివృద్ధి చెందని దేశాలలోని కార్మికుల నుండి పోటీని ఎదుర్కొంటున్నారు. అంటే అభివఅద్ధి చెందిన దేశాలలోని కార్మికులకు

"ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటే అది ద్రవ్య లోటుతో గాని, పొదుపు చేయగల వారు, అధిక ఆదాయాలు గలవారు అయిన పెట్టుబడిదారుల పొదుపులపై వేసే అదనపు పన్నులతో - పెట్టుబడిదారుల లాభాలపైనో, వాటాల అమ్మకాలపైనో పన్నులు వేయాలి. కానీ ప్రపంచీకరణ ఉచ్చులో బిగుసుకున్న ఏ దేశం ద్రవ్యలోటుకు వెళ్ళలేదు."


లెనిన్


ఎడ్వర్డ్ బెర్న్‌స్టీన్


జాన్ మేనార్డ్‌కీన్

కూడా ఉత్పాదకత పెరిగినంతగా జీతాలు పెరగడం లేదు. అభివృద్ధి చెందని దేశాలలోని పెరగని వేతనాల వలన, అభివృద్ధి చెందిన కార్మికులకు జరిగే నష్టం ఇది. అంటే సూక్ష్మంగా చెప్పాలంటే మొత్తానికి ప్రపంచ ఉత్పత్తిలో అదనపు విలువ భాగం పెరుగుతుందన్నమాట.

మూడు, వేతన ఆదాయాలు గల వారిలో వారి వేతనాలలో ఖర్చు చేసే నిష్పత్తి అదనపు విలువలో నిష్పత్తి కన్నా అధికంగా ఉంటుంది. 1950, 1960లలో బరన్ అండ్ స్వీస్స్ చెప్పినట్టే అమెరికా ఆర్థిక వ్యవస్థ గురించి పెరుగుతున్న అదనపు విలువ ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తిని పెంచుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది.

నాలుగు, జాతి రాజ్యాలు జోక్యం చేసుకుని అదనపు ఉత్పత్తిని అరికట్టే చర్యలు తీసుకోవడం ప్రపంచీకరణ నేపథ్యంలో సాధ్యపడదు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటే అది ద్రవ్యలోటుతో గాని, పొదుపు చేయగల వారు, అధిక ఆదాయాలు గలవారు అయిన పెట్టుబడిదారుల పొదుపులపై వేసే అదనపు పన్నులతో – పెట్టుబడిదారుల లాభాలపైనో, వాటాల అమ్మకాలపైనో పన్నులు వేయాలి. కానీ ప్రపంచీకరణ ఉచ్చులో బిగుసుకున్న ఏ దేశం ద్రవ్యలోటుకు వెళ్ళలేదు. (ద్రవ్యలోటు స్థూల జాతీయ ఉత్పత్తిలో 3 శాతం కంటే మించకూడదు) పెట్టుబడిదారులపై పన్నులు వేయలేదు. ఆలా పన్నులు వేస్తే పెట్టుబడులు వెళ్ళిపోతాయన్న భయం వెంటాడుతుంటుంది. అమెరికాకు ద్రవ్యలోటు బెంగలేదు. ఆ దేశంలో ద్రవ్య బాధ్యత చట్టంలేదు. పెట్టుబడులు ఎగిరిపోతాయన్న భయం కూడాలేదు. ఎందుకంటే ఇప్పటికీ దాని కరెన్సీ బంగారంతో సమానమే. అయినా అది కూడా ద్రవ్యలోటు చూపలేదు. కారణం ప్రపంచీకరణ ఆధిపత్యమే. అమెరికా కార్పొరేట్లు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలలోని తక్కువ వేతనాల వలన లాభాలను పెంచుకునేందుకు వీలుగా పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. ద్రవ్య ఉద్దీపనలతో ఉద్యోగావకాశాలు పెంచితే అమెరికా దిగుమతులు పెంచుకోవలసి రావచ్చు. ఫలితంగా అమెరికా ఇతరదేశాల చెల్లింపులు ఎక్కువ చేయవలసి రావచ్చు. అందువలన అదనపు ఉత్పత్తి అప్పుడప్పుడు వ్యవస్థాగత సంక్షోభాలను సృష్టిస్తుంటుంది. వాటి ఆస్తుల ధరలు 'బుడగలు' రూపంలో కనిపిస్తుంటాయి. ఆ బుడగలు పేలుతుంటాయి. అందువలన ప్రపంచీకరణ అంటేనే అసమానతలు, వేతనాల స్థిరీకరణ, చిన్న పెట్టుబడిదారుల పతనం మూడో ప్రపంచ దేశాల జనాభాలో అత్యధికులు పేదరికంలో మగ్గడం. అప్పుడప్పుడు వ్యవస్థాగత సంక్షోభం నివారించేందుకు 'బుడగలు' పేలడం. ఆ పేలుళ్లతో కార్మికవర్గం మరింత సంక్షోభంలోనికి నెట్టబడుతుంది. మరింత నిరుద్యోగంలో కూరుకుపోతుంటుంది. పొదుపు చర్యలు సంక్షోభాన్ని మరింత పెంచడమే కాదు, సంక్షేమ పథ కాలకు, సామాజిక వేతనాలకు కోతలు పెడుతుంది.

రెండో ప్రపంచ యుద్ధం తరువాతి కాలంలో సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు మొద్దుబారడం తోబాటు తప్పనిసరిగా పెట్టుబడిదారీ విధానం ఇచ్చితీరవలసి వచ్చిన కొన్ని రాయితీల వలన 'పెట్టుబడిదారీ విధానం మారిందని' భ్రమలు కల్పిస్తుంది. కానీ ప్రపంచీకరణ విధానం వలన సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు మొద్దుబారినప్పటికీ పెట్టుబడిదారీ వ్యవస్థ 'మానవత్వ ముసుగును' మాత్రం అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలలో కూడా తొలగిపోవటం జరుగుతున్నది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెరుగుతున్న కొలది సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యం మొద్దు బర్చబడినప్పటికీ, పెట్టుబడిదారీ విధానం యొక్క సహజ నైజమయిన తీవ్రమయిన దోపిడీ మరింత ముందుకొచ్చింది. కీన్స్ మాటల్లో చెప్పాలంటే "ఇది నీతివంతమయినది కాదు", "ఇది ధర్మబద్ధమైనది కాదు', 'ఇది మనకు అనుకూలమయినది కాదు", కేవలం "ద్వేషించ దగ్గదే".

**ఈ పరిస్థితి మారాలంటే ..**

ప్రస్తుతం శ్రామికులు అనుభవిస్తున్న కడగండ్లు తొలగిపోవాలంటే రాజ్యం జోక్యం తప్పనిసరి. ప్రభుత్వం ప్రజల కడగండ్లకు స్పందించగలగాలి. అంతేకాదు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తన అజెండాను అమలు పరచకుండా ఆపే స్వతంత్రతను కలిగి ఉండాలి. కష్టజీవులకు లాభాలను సమకూర్చే విధానాలను రూపొందించగలగాలి. ఈ ఆలోచనలతో ఏకీభవించే జాతి రాజ్యాలు అన్నీ కలిసి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, కార్మికుల వ్యతిరేక విధానాల ఎజెండాను అమలు పరచకుండా అడ్డుకోవాలి. లేదా ఒంటరిగా నయినా, కొన్ని దేశాలు కలిసి అయినా ప్రపంచ ద్రవ్య పెట్టుబడి కబంధ హస్తాల నుండి బయటపడి, పెట్టుబడి స్వేచ్ఛకు బంధనాలు వేయగలగాలి. పెట్టుబడిని అదుపులో పెట్టగలగాలి. ఇది ఆయా దేశాలకు స్వతంత్ర ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించుకునే అవకాశం ఇస్తుంది. నన్ను ఇంకొంచం వివరించనీయండి. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో నిరుద్యోగాన్ని తగ్గించడానికి సరాసరి గిరాకీస్థాయిని

> **"కార్మిక, కర్షక ఐక్యత మాత్రమే సరిపోదు. లెనిన్ విశ్లేషించి చెప్పినట్టు ఈఉద్యమాన్ని ప్రజాతంత్ర విప్లవం సాధించేవరకు కొనసాగించవలసి ఉంటుంది. ఎందుకంటే సోషలిజం సాధించడంలో ఇదొక మజిలీ. అలాగే ప్రపంచీ కరణ నుండి విడివడితేనే దాని విషపూరితమయిన విధానా లను వెనక్కుకొట్ట గలం. సోషలిజంవైపుకు కొనసాగే మార్పు లో కార్మిక, కర్షక మైత్రి ఒక భాగంగా ఉంటుంది."**

పెంచవలసి ఉన్నది. అలాకాకుండా ఈనాడు ట్రంప్ అనుసరిస్తున్నట్టు కేవలం రక్షణ విధానాలను అవలంభించడం వలన అందరికి నష్టం కలుగుతుంది. దాని వలన నిరుద్యోగం ఎగుమతి అవుతుంది. ఫలితంగా ఇతర దేశాలు కూడా ప్రతిస్పందిస్తాయి. పెట్టుబడిదారుల 'నమ్మకం' మరింతగా దెబ్బతింటుంది. ఫలితంగా మరింత నిరుద్యోగం పెరుగుతుంది. సంక్షోభం పెరుగుతుంది. ద్రవ్య విధానాలు ప్రపంచం మొత్తంలో గిరాకీని పెంచలేని పరిస్థితులలో ఆర్థిక విధానాలు సమస్యను పరిష్కరించగలవు. ఇందుకు రెండు మార్గాలున్నాయి. ఒకటి. బడా జాతిరాజ్యాలు సంఘటితంగా, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఇష్టాలకు వ్యతిరేకంగా ఆర్థిక ఉద్దీపనలు అమలుపరచడం. అయితే ఆలా అమలు జరపాలంటే ఆయా దేశాలలోని కార్మికుల నుండి వత్తిడి ఉండాలి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రెండో పద్దతి, దేశాలు వేటికవే సరాసరి గిరాకీని పెంచుకోవడానికి ప్రపంచీకరణ నుండి బయటపడి, పెట్టుబడుల ప్రవాహాలపై నియంత్రణలను పెట్టి, ప్రభుత్వాలు వారి వారి ఆర్థిక వ్యవస్థలలో ఆర్థిక లోటు ద్వారా గాని, కార్పొ రేట్లపై పన్నుల ద్వారా గాని పెద్ద ఎత్తున ఖర్చులను పెంచుకుని, ప్రపంచ పెట్టుబడి బంధనాల నుండి బయట పడాలి. ఒక దేశంలో కార్మిక, కర్షక ఐక్యత సాధ్యపడే అవకాశాలు ఎక్కువ కాబట్టి, ఆ వత్తిడితో ప్రపంచీకరణ నుండి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

అయితే కార్మిక, కర్షక ఐక్యత మాత్రమే సరిపోదు. లెనిన్ విశ్లేషించి చెప్పినట్టు ఈఉద్యమాన్ని ప్రజాతంత్ర విప్లవం సాధించేవరకు కొనసాగించవలసి ఉంటుంది. ఎందుకంటే సోషలిజం సాధించడంలో ఇదొక మజిలీ. అలాగే ప్రపంచీకరణ నుండి విడివడితేనే దాని విషపూరితమయిన విధానాలను వెనక్కు కొట్ట గలం. సోషలిజం వైపుకు కొనసాగే మార్పులో కార్మిక, కర్షక మైత్రి ఒక భాగంగా ఉంటుంది.

ఈ పరిస్థితులను మార్చడం ఈ వ్యవస్థను మార్చడంలో భాగమే. ఒకవేళ కార్మిక కర్షక మైత్రిలోని విప్లవశక్తులు ఈ అవసరాన్ని గుర్తించక పోయినా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దారుల ప్రస్తుత విధానాలను వ్యతిరేకించడం కూడా వారికీ వ్యవస్థను మార్చవలసిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.

ఆనాటికీ ఈ నాటికీ పరిస్థితులలో మార్పు ఉన్నా అక్టోబర్ విప్లవం వచ్చిన కారణాలలోని ఔచిత్యం నేటికీ వర్తిస్తుంది. ఆనాటి రైతులు భూస్వాముల నుండి విముక్తిని కోరుకుంటే నేటి రైతులు నయా ఉదారవాద విధానాలు తమపై రుద్దుతున్న అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి యొక్క ప్రపంచీకరణ నుండి విముక్తిని కోరుకుంటున్నారు. ఇప్పుడు ప్రజాతంత్ర విప్లవం ప్రపంచీకరణ నుండి తెగతెంపులు చేసుకోవలసి ఉంది. అప్పుడే జాతిరాజ్యం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నుండి స్వాతంత్ర్యాన్ని పొందగలదు. ఇది కార్మిక, కర్షక మైత్రి యొక్క రాజకీయ జోక్యానికి అవసరం. ప్రపంచీకరణ కార్మిక కర్షక మైత్రిని సాధ్యం చేసింది. తప్పనిసరి కూడా చేసింది. ప్రపంచాన్ని ఒక స్థాయికి తీసుకు వచ్చింది. ఇప్పుడిక కార్మిక, కర్షక మైత్రికి కట్టుబడి ఉండాలి లేదా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసంనానాటికీ ఫాసిజంవైపుకు మొగ్గుతుండడం వలన ఏర్పడ్డ సంక్షోభంలో మునిగిపోవాలి.

అయితే ఇక్కడొక సంధ్య ఉంది. ఒకవైపు పెట్టుబడిదారీ విధానం కేవలం 'ద్వేషించదగ్గదే' అయినప్పటికీ సామ్రాజ్యవాద దేశాలు తమ మధ్య నున్న వైరుధ్యాలు మొద్దు బారడం ద్వారా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అధిపత్యం నుంచి తప్పించుకోవడం, లెనిన్ కాలం నాటికంటే మరింత కష్టం అయింది. బడా పెట్టుబడిదారి శక్తుల మధ్య అనైక్యత లేకపోవడం వలన ఈనాటి పరిస్థితులు మార్చడం కష్టసాధ్యం చేస్తున్నాయి. ఇంకో రకంగా చెప్పుకోవాలంటే ప్రపంచ సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు మొద్దు బారడం వలన వారెంతగా దోపిడీ చేస్తున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితులలో ఆ దోపిడీ నుండి బయట పడడం కష్ట సాధ్యంగా ఉన్నది.

ఈ కష్టాన్ని ఎదుర్కోడానికి ఉన్న మార్గం బలమయిన కార్మిక, కర్షక ఐక్యత. అదెంత నెమ్మదిగా జరిగినా ఇదే ప్రస్తుత పరిస్థితులలో సోషలిజం వైపు మార్పుకు సాధ్యపడే మార్గం. అక్టోబర్ విప్లవం సాధించిన సోవియట్ యూనియన్ ఆలా నిలవలేక పోవడానికి కూడా కారణం కార్మిక, కర్షక ఐక్యతను కాపాడుకోలేక పోవడమే. అక్కడ బలవంతంగా జరిగిన సామూహిక వ్యవసాయం యొక్క పర్యవసానాలు నేటికీ బలంగా ఉన్నాయి. ఈ బలహీనతను అధిగమించాలి. దురదృష్టవశాత్తు వామ పక్షాలలో అత్యధిక భాగం ప్రపంచీకరణ ఆధిపత్యం నుంచి వేరుపడడానికి అనాలోచితంగానే సిద్ధపడడం లేదు. నయా ఉదారవాద విధానాల పెత్తనాన్ని అంగీకరిస్తున్నారు. కానీ ఈనాటి పరిస్థితుల నుండి బయట పడాలంటే నయాఉదారవాద విధానాల నుండి తెగతెంపులు చేసుకోదానికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలి.

**అనువాదం : కె. ఉషారాణి**


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్ధిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# భారత్ - రష్యా ఇంధన సహకారం

**సంజయ్‌కుమార్ ప్రధాన్**

రష్యన్ హైడ్రో కార్బన్ మార్కెట్‌లో, భారతదేశం తన శక్తిని ఎంతగా విస్తరించ గలదో, తన స్థానాన్ని ఎలా ప్రతిఫలించగలదో, విశ్లేషించడమే ఈ వ్యాసం యొక్క లక్ష్యం. ఉక్రెయిన్ సంక్షోభంలో న్యూఢిల్లీ యొక్క నిర్దిష్ట, సమతుల్య వ్యవహారశైలిని, యునైటెడ్ స్టేట్స్ అందించిన పరిమిత వనరులు, ఇండియా చైనా యొక్క అణుమార్కెట్ వ్యాపారాన్ని పరిశీలించడం మొదలగు అంశాలను వీక్షిద్దాం! రష్యా నుండీ హైడ్రోకార్బన్ వనరులను దిగుమతి చేసుకునే అవసరానికి మూలం, భారతదేశ అణుశక్తి అవసరాలు, భూగర్భ వనరుల రాజకీయాలలో పలుకుబడి రష్యాలోనూ, పశ్చిమ దేశాలలో తరచూ ఎగుడు దిగుడులకు లోనవుతున్న ఆయిల్ ధరలు, పడిపోతున్న రూబుల్ విలువ మొదలగు అంశాలన్నీ భారత్–రష్యా సంబంధాలను, హైడ్రోకార్బన్ విభాగంలో సహకారాన్ని ఖచ్చితంగా ప్రభావితం చేస్తాయి.

ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ సారథ్యంలో రష్యాకు, తమదేశ ఆర్థిక ప్రగతికి, దీర్ఘకాలిక ప్రణాళికలు రచించడంలో, వ్యూహాలు పన్నడం అంతర్జాతీయంగా ఆర్థిక వనరులు, ముఖ్యంగా ఆసియా ఖండంలో జరుగుతున్న మార్పులు ప్రధాన కారణం. భూగర్భ వనరుల రాజకీయాల లోని పలుకుబడి, ఆసియా, ఆసియా పసిఫిక్ ప్రాంతాలలో ఆర్థిక ఆధిపత్యాన్ని హైడ్రోకార్బన్ వనరులపై ప్రధాన సరఫరాదారుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునే క్రమంలో ఆసియా ప్రాంతంలోని లోటుపాట్లను సునిశితంగా గమనిస్తూనే ఉంది. రష్యాలోని అణుశక్తి ఇంధన వనరులను తవ్వడంలో వినియోగంలో, ఆసియా ప్రాంతాల పెట్టుబడి కీలకపాత్ర వహిస్తుంది. అందువలనే వ్యూహాత్మకంగా "ఆసియా కేంద్రం""గా వ్యవహరిస్తుంది. తమ వ్యాపార విస్తరణలో భాగంగా ఆసియా దేశాలలో బహుముఖగా విస్తరిస్తూ, రష్యన్ ఆయిల్, గ్యాస్ కంపెనీలు "గాజ్‌ప్రోమ్" "రోజ్‌నెఫ్ట్" తూర్పు రష్యాలో బలోపేతం అయ్యాయి. ఈ వ్యూహం లో భాగంగానే ప్రస్తుతం రోజుకు ఒక మిలియన్ బ్యారెల్స్ ఇంధనాన్ని వెలికితీస్తున్న కంపెనీలు 2020 వ సంవత్సరం నాటికి, రోజు 1.6 మిలియన్ టన్నులతో సంవత్సరానికి 80 మిలియన్ టన్నులతో తూర్పు సైబీరియా, పసిఫిక్ సముద్రం ఆయిల్‌పైప్ లైనుల ద్వారా త్రవ్వకాలు సాగించాలని నిర్దేశించుకున్నాయి. ప్రస్తుతం ఆసియా ఖండానికి ఎగుమతి అవుతున్న ఆయిల్/చమురు 12 శాతం నుండి 23 శాతానికి , సహజవాయువు / గ్యాస్ 6 శాతం నుండి31.5 శాతానికి 2035 నాటికి ఎదిగి, ఆసియా మార్కెట్‌లో 27 శాతం వృద్ధిరేటుని సాధించాలని, అగ్రగామిగా వెలుగొందాలని దీని వెనుకవున్న ప్రధాన లక్ష్యం.

"ఆసియాకేంద్రం" వ్యూహంలో ఆసియాకు సంబంధించిన ఎంతోమంది వాటాదారులు, ఆశావహులున్నారు. రష్యాకు సంబంధించినంత వరకూ ప్రధాన ఎగుమంతి కేంద్రంగా, తమ లక్ష్యాన్ని చైనాకు గురిపెట్టింది. దీనికి నిదర్శనం రెండు దేశాల మధ్య సుదీర్ఘంగా, సుమారు దశాబ్దకాలం నడిచిన బేరసారాలు, 'గజ్‌ప్రామ్'8 కంపెనీకి, చైనా నేషనల్ పెట్రోలియమ్ కార్పొరేషన్‌కి మధ్య కుదిరిన 30 సంవత్సరాల వ్యాపార ఒప్పందం. అందువలనే "వాంకోర్ ఫీల్డ్‌లోని 10 శాతాన్ని రష్యా, ఒక బిలియన్ విలువకు సిఎన్‌పిసి చైనా నేషనల్ పెట్రోలియమ్ కార్పొరేషన్‌కి కట్టబెట్టడమే సాక్ష్యం. తూర్పు సైబీరియా నుండే పసిఫిక్ తీరానికి (అంగర్‌స్క్ నుండి డాకింగ్ వరకూ) వైపులైను నిర్మాణం సందర్భంగా జపాన్ సైతం కొన్ని ఆకర్షణీయమైన ప్రతిపాదనలు పంపింది. అవి ఏమనగా 5 బిలియన్ డాలర్ల పైపులైను నిర్మాణ నిమిత్తం, రెండు బిలియన్ డాలర్లు ఆయిల్ ఫీల్డ్ అభివృద్ధి నిమిత్తం. ఇదిలా ఉండగా, 2014వ సంవత్సరంలో, రష్యన్ పార్లమెంట్, ఉత్తరకొరియా తమకు చెల్లించవలసిన బాకీలలో 90 శాతాన్ని రద్దుచేసింది. ప్రతిఫలంగా "పైమాన్ గ్యాంగ్స్" ఒప్పందం ప్రకారం, ఉత్తరకొరియా నుండి దక్షిణ కొరియా మీదుగా "షాకాలిన్" పైపు నిర్మాణం జరగాలని నిర్ణయించింది. అదే సమయంలో, పశ్చిమ "కమ్‌చత్కా షెల్ప్"లో జరుగుతున్న త్రవ్వకాలలో 40 శాతం వాటాను కొరియా నేషనల్ ఆయిల్ కార్పొరేషన్‌కి ఇవ్వాలన్న నిర్ణయంతో, "రోజ్‌నెఫ్ట్" దక్షిణకొరియాతో కలిసి పనిచేయాలన్న, నిర్ణయం జరగడం, అమలులోకి రావడం జరిగింది. ఇరాన్‌పైనున్న ఆంక్షలు క్రమంగా తొలుగుతున్న సమయంలో, అదను చూసుకున్న రష్యా, క్రమంగా బిలియన్ డాలర్ల ధనాన్ని ఇరాన్‌లో ఖర్చుచేసి ఇంధన వనరులను సేకరించడానికి మౌలిక వసతులు ఏర్పాటు చేసింది. అంతేగాక 2015 సంవత్సరంలో సింగపూర్ ప్రభుత్వ స్వంత కంపెనీ 'పెవిలియన్ గ్యాస్"తో, చమురు ఉత్పత్తి పెంచే దిశగా పది సంవత్సరాల పాటు సహజ వాయు నిక్షేపాలను సరఫరా చేసేవిధంగా ఒప్పందం కుదుర్చుకుంది. రోజ్‌నెఫ్ట్ ప్రధాన అధికారి "ఇగోర్ సెచిన్" జపాన్, భారతదేశం, దక్షిణ కొరియా, ఫిలిప్పైన్స్, వియత్నాం దేశాలు సందర్శించి, సంప్రదింపులు జరిగి, ఒప్పందాలు కుదుర్చుకుని, 2014 సంవత్సరాంతానికి పైన పేర్కొన్న ప్రాంతాలలో, తమ హైడ్రోకార్బన్ వ్యాపారానికి ఎదురు లేకుండా చేసుకున్నారు.

ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న అనేకానేక పరిణామాలు ఉదాహరణకు ఉక్రెయిన్ సంక్షోభం, రష్యాకు వ్యతిరేకంగా నిలుపుదల చేసిన ఆర్థిక కేటాయింపులు, యూరోప్ లోనూ, చైనాలోనూ తిరుగుముఖం పట్టిన ఆర్థికవ్యవస్థ, పశ్చిమ దేశాలతో, రష్యా దౌత్య సంబంధాలతో అస్థవ్యస్థత. టర్కీలోని గ్యాస్ పైప్ లైన్ నిర్మాణం వెనకపట్టు పట్టడం, మొదలగు అంశాలన్నీ, ఆసియాదేశాలకు, మరీ ముఖ్యంగా భారత్‌లాంటి దేశాలు, తమ పెట్టుబడులను, వ్యాపారాన్ని పెంచుకోవడానికి రష్యాలో అవకాశాలను కలగజేస్తున్నాయి. అందువలనే, మాస్కో, తమ సామర్థ్యాన్ని ఉత్పత్తిని ఆసియా యూరోప్‌కి బయట, యునైటెడ్ స్టేట్స్‌లో, ఆసియా మార్కెట్‌లో పెంచుకుంటూ ఉత్పత్తి రంగాన్ని నికరంగా ఉంచుకునే ప్రయత్నం చేస్తుంది. 2017వ సంవత్సరం మే 10న

> **“భారతదేశ హైడ్రోకార్బన్ వ్యాపారంలో రష్యాపాత్ర గణనీయంగా పెరుగుతుంది. మన దేశీయ మార్కెట్‌లో 2012 నాటికి, రష్యా పెట్టుబడులు 176 మిలియన్ డాలర్లు... ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జిసి) విదేశ్ లిమిటెడ్ (ఒవిఎల్) రష్యాలో 8 వేల బిలియన్ డాలర్ల పైనే పెట్టుబడులు పెట్టింది. రష్యాలోని షాకాలిన్-1,3లో విదేశ్ లిమిటెడ్ 20 శాతం వాటాలతో పెట్టుబడి పెట్టిన విలువ 2.5 బిలియన్ డాలర్లు.”**

భారతదేశాన్ని సందర్శించి, ప్రధానమంత్రిని కలిసిన, రష్యా ఉపప్రధానమంత్రి “దిమిత్రి రోగోజిన్” చర్చలో, రెండు దేశాలు కూడా, ప్రస్తుతం నడుస్తున్న ప్రాజెక్టుల విషయంలో ఎంత సీరియస్‌గా ఉన్నాయో అర్థమవుతుంది.

భారతదేశాన్ని సందర్శించి, ప్రధానమంత్రిని కలిసిన, రష్యా ఉపప్రధానమంత్రి “దిమిత్రి రోగోజిన్” చర్చలో, రెండు దేశాలు కూడా, ప్రస్తుతం నడుస్తున్న ప్రాజెక్టుల విషయంలో ఎంత సీరియస్‌గా ఉన్నాయో అర్థమవుతుంది.

రష్యా యొక్క “ఆసియా కేంద్రం” వ్యూహంతో పాటుగా, ఈవ్యాసం మరొక విషయాన్ని సైతం విశ్లేషిస్తుంది. అదే రష్యన్ హైడ్రోకార్బన్ మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి భారతదేశం పడుతున్న తపన, వాస్తవాలను కూడా చర్చిస్తుంది. ఈ విభాగాలలో పైపులైనుల నిర్మాణం, వనరులతో వ్యాపారం, ఉక్రెయిన్ సంక్షోభం, విషయంలో తటస్థంగా ఉన్న న్యూఢిల్లీ వ్యవహార శైలి, ఎగుడుదిగుడుగా ఉన్న క్రూడాయిల్ ధరలు భారత్, రష్యాల మధ్యనున్న హైడ్రోకార్బన్ వ్యాపారం పట్ల అమెరికా వైఖరి భారత్, చైనాల మధ్యనున్న మాత్రికలతో రష్యన్ అణుశక్తి మార్కెట్ మొదలగు విషయాలను కూడా కూలంకషంగా పరిశీలిస్తుంది.

**ఇండియా, హైడ్రోకార్బన్ మ్యాప్‌లో రష్యా:**

హైడ్రోకార్బన్ విభాగంలో, భారత్, రష్యా ద్వైపాక్షిక సంబంధాలు ఆశాజనకంగా గోచరిస్తున్నాయి. భారతదేశంలో విస్తరిస్తున్న పారిశ్రామీకీకరణ దేశీయంగా ఉన్న చమురు / ఇంధన అవసరాలు, చమురు నిక్షేపాలను కనుగొనడానికి చేస్తున్న కృషి వేగంగా మారుతున్న భూగర్భవనరుల రాజకీయాలు, సరసమైన ధరకు, నిరంతరాయంగా, నిత్యం అవసరమవుతున్న ఇంధనం, ఇంధన అవసరాల నిమిత్తం భారతదేశాన్ని రష్యావైపుకు మళ్లిస్తుంది. అంతేగాక గత దశాబ్దం కన్నా నేడు భారతదేశ ఇంధన అవసరాలు పెరిగాయి. దేశీయంగా ఉత్పత్తులు 2000వ సంవత్సరం నుండీ నికరంగా మిగిలిపోయాయి. 2010 నాటికి సహజ వాయువుల ఉత్పత్తి తగ్గిపోయింది. “ఇంటర్నేషనల ఎనర్జీ ఏజన్సీ” వారి గణాంకాల ప్రకారం ప్రస్తుతం భారతదేశం దిగుమతి చేసుకుంటున్న 70 శాతం సహజవనరులు, ఇంధనం 2025 నాటికి 90 శాతం అవుతాయి.

బిపి స్టాటిస్టికల్ రివ్యూ ఆఫ్ వరల్డ్ ఎనర్జీ 2016 అంచనాల ప్రకారం, 2015 సంవత్సరాంతానికి రష్యా 102.4 బిలియన్ బ్యారెల్స్ ఇంధన నిక్షేపాలను కలిగి ఉంది. ఇది అంతర్జాతీయ ఇంధన నిక్షేపాలలో 6 శాతం కాగా ప్రపంచంలోని మొత్తం నిల్వలు కలిగి ఉన్న దేశాలలో 7వ స్థానంలో ఉంది. ఉత్పత్తి రంగంలో సౌదీ అరేబియా, అమెరికా 13 శాతంతో ఉన్నత స్థానాలలో ఉండగా, రష్యా మూడోస్థానంలో ఉంది. అంతేగాక ఇరాన్ 18.2 శాతం నిల్వలలో ప్రపంచంలో ప్రధమ స్థానంలో ఉండగా, 17.3 శాతం అనగా 32.3 ట్రిలియన్ క్యూబిక్ మీటర్లలో ద్వితీయ స్థానంలోనూ, ఉత్పత్తి విభాగంలో యునైటెడ్ స్టేట్స్ 22 శాతం మొదటి స్థానాన్ని ఆక్రమించగా, 573.3 బిలియన్ క్యూబిక్ టన్నులు అనగా 16.1 శాతం ద్వితీయ స్థానంలో ఉంది. అంతేగాక 2015 సంవత్సరంలో రష్యా ఆయిల్, గ్యాస్ నిల్వలు 10.73 ఎమ్‌బిడికి పెరిగాయి.


అయిల్ అన్వేషణలో రష్యా

భారతదేశ హైడ్రోకార్బన్ వ్యాపారంలో రష్యాపాత్ర గణనీయంగా పెరుగుతుంది. మన దేశీయ మార్కెట్‌లో 2012 నాటికి, రష్యా పెట్టుబడులు 176 మిలియన్ డాలర్లు... ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జిసి) విదేశ్ లిమిటెడ్ (ఒవిఎల్) రష్యాలో 8 వేల బిలియన్ డాలర్ల పైనే పెట్టుబడులు పెట్టింది. రష్యాలోని షాకాలిన్-1,3లో విదేశ్ లిమిటెడ్ 20 శాతం వాటాలతో పెట్టుబడి పెట్టిన విలువ 2.5 బిలియన్ డాలర్లు. తర్వాత, చాలాకాలం పాక్రాలిన్ ప్రాజెక్టులో భారీ పెట్టుబడుల కోసం ద్వారాలు తెరచి ఆహ్వానం పలుకుతూ ఎదురుచూస్తుంది. ఇదే సమయంలో భారతదేశం షాకాలిన్ ప్రాజెక్టులో పెట్టుబడులు పెట్టినట్లుగానే, రష్యాలోని అతిపెద్ద పబ్లిక్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ సిస్టెమీతా విదేశీ లిమిటెడ్ ఒప్పందాలు కుదుర్చుకుని, రష్యాలోని రిఫైనరీలు, బెఫ్‌నెఫ్ట్, రష్‌నెఫ్ట్‌లలో సైతం పెట్టుబడులు పెట్టింది. 2013వ సంవత్సరంలో రోజ్‌నెఫ్ట్ తన పరిధిలోని బారెంట్స్ సముద్రం, బ్లాక్ సముద్రంలోని 10 బ్లాక్‌లను, విదేశ్ లిమిటెడ్‌కి ఇవ్వడానికి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను విదేశ్ లిమిటెడ్ పరిశీలనలో ఉంచింది. ఎందువలనంటే, ఓల్‌హోస్ట్ సముద్రంలోని ఉత్తరభాగం మడ్‌గాన్ బ్లాక్2, 3లలో సైతం విదేశ్ లిమిటెడ్ కంపెనీ త్రవ్వకాలు కొనసాగిస్తుంది. యూరో బెచ్‌నోటోకోమ్‌స్మాయ్ ప్రాంతాలలోని త్రవ్వకాలపై 49శాతం వాటాల విషయంలో న్యూఢిల్లీ పన్ను మినహాయింపు కోసం ఎదురుచూస్తుంది. ప్రపంచ వ్యాపార రంగంలో రూబుల్ విలువ పతనమవుతున్న తరుణంలో, రష్యాతో వ్యాపార సంబంధ బాంధవ్యాల విషయంలో భారతదేశం బేరసారాలు ఆడుతుంది.

ప్రపంచ ఇంధన నిలవలలో 5 వంతులు కలిగి ఉన్న రష్యాలోని యమల్ పెనిన్సులాలో 1. 5 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలన్న వ్యూహంలో భారతదేశం ఉంది. అంతేగాక

**“2014 వ సంవత్సరం డిసెంబర్‌లో న్యూఢిల్లీలో జరిగిన భారత - రష్యా 15వ వార్షిక సమ్మిట్‌లో రెండు దేశాలు నుండే విదేశ్ లిమిటెడ్, రోజ్‌నెఫ్ట్ చేసుకున్న “అవగాహనా ఒప్పందం, ఇరుదేశాల వైపు కొనసాగే సహాయ సహకారాలకు మరో ముందడుగు. ఆర్కిటిక్‌లో జరుపబోయే తవ్వకాలు భారతదేశానికి చాలా ముఖ్యం.”**

ఎమ్ఎల్ ఎల్ఎన్‌జిలో ఉన్న 9 శాతం వాటాలున్న జపాన్‌తో సైతం పోటీ చేస్తుంది మన దేశం. 2014లో రోజ్‌నెఫ్ట్ కూడా ఒక ప్రకటన చేసింది. దాని సారాంశం రష్యా తూర్పు తీర ప్రాంతంలో నూతనంగా నిర్మించాలన్న ఎల్ఎన్‌జి ప్లాంట్‌లో విదేశీ లిమిటెడ్ భాగస్వామ్యం కలుపుకోవాలన్న ఆలోచన. అంతేగాక అతిపెద్ద భారతీయ ఆయిల్ సంస్థ “ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్”లోనూ, “రిలయన్స్ ఆయిల్ కార్పొరేషన్”లోనూ, వ్యాపార సంబంధాలు నెరపుతూ రష్యా తూర్పు ప్రాంతంలోని సైబీరియా– పసిఫిక్ సముద్రాల తవ్వకాలలో పై రెండు సంస్థల భాగస్వామ్యాన్ని కలుపుకుంటున్నట్లు తెలిపింది.

అంతేగాక గుజరాత్‌లో “ఇండో రష్యన్ పెట్రోలియం” భాగస్వామ్యంతో 450 మిలియన్ డాలర్ల పెట్టుబడితో, సంవత్సరానికి లక్ష టన్నుల ఉత్పత్తులతో నూతన ప్రాజెక్టును ఆరంభించబోతున్నట్లు “గ్యాస్ బిజినెస్ కంపెనీ డైరెక్టర్ మైఖేల్ యెరోమోలోవిచ్” సైతం ప్రకటన వెలవరించారు. విదేశీ లిమిటెడ్ సైతం, రోజ్‌నెఫ్ట్ తమ పరిధిని విస్తృత పరుచుకునే క్రమంలో, పరిశోధన, నూతన చమురు బ్లాక్‌ల అన్వేషణ, రష్యాఖండంలోని హైడ్రోకార్బన్‌ల ఉత్పత్తి పెంపుదల మొదలగు అంశాలలో తమ సహాయ సహకారాలను వెలువరిస్తూ “మెమెరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్” లోనికి ప్రవేశించింది. 2015 వ సంవత్సరంలో రోజ్‌నెఫ్ట్‌లో రెండవ అతిపెద్ద చమురు క్షేత్రం వాంకోర్‌లో 8,390 కోట్ల డాలర్ల పెట్టుబడితో 15 శాతం వాటాను విదేశ్ లిమిటెడ్ స్వంతం చేసుకుంది. దీనికి ప్రతిఫలంగా రిజర్వాయర్స్ నుండి సంవత్సరానికి 3.3 మిలియన్ టన్నుల క్రూడ్ ఆయిల్‌ను విదేశ్ లిమిటెడ్‌కిచ్చే ఒప్పందం జరిగింది.

అంతేగాక 20 సంవత్సరాల దీర్ఘకాలిక వార్షిక ప్రణాళికలో భాగంగా, రష్యాలోని ‘గాజ్‌ఫ్రామ్ గ్రూప్”నకు, “గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (జిఎఐసి) కు 2014లో జరిగిన ఒప్పందం ప్రకారం సంవత్సరానికి 2.5 మిలియన్ టన్నుల గ్యాస్ అందించాలి.

రోజ్‌నెఫ్ట్‌కు ఎస్సార్ ఆయిల్ కంపెనీలో 49 శాతం వాటాలతో 3.2 బిలియన్ డాలర్లతో పది సంవత్సరాల పాటు ఆయిల్ సరఫరా కోసం రెండు కంపెనీల మధ్య ఒప్పందం జరిగింది. ఇది అతిపెద్ద రెండవ ఒప్పందం. మొదటిది వెనిజులా నుండి 3,00,000 బిపిడి ముడి చమురు 15 సంవత్సరాలు కొనుగోలు చేయాలని రిలయన్స్ చేసుకున్న ఒప్పందం. రాజకీయపరంగా పరిశీలించినట్లయితే, ఎస్సార్ కంపెనీ రష్యాలోని చమురు నిక్షేపాల కోసం, ప్రస్థుతం తన వ్యాపారం కొనసాగిస్తున్న ఇరాన్‌తో తెగతెంపులు చేసుకోవచ్చు.. కారణం గుజరాత్‌లోని వాదినర్ రిఫైనరీలో ప్రస్థుతం వాడుతున్న 4,00,000 బిపిడి అవసరాలను రష్యా తీర్చగలదు గనుక. ప్రస్థుతం ఎస్సార్ అవసరాలలో 1/4 వ శాతం ఇరాన్ తీరుస్తుంది.



రిలయన్స్ ఆయిల్ రిగ్

రష్యన్ వ్యాపారసంస్థ “లిటాస్కో” పానిపట్‌లో నున్న రిఫైనరీలో ఒక మిలియన్ బ్యారల్స్ క్రూడాయిల్‌ను శుభ్రం చేసి, రష్యన్ ఉరాల్స్ ఆయిల్ కార్గోకి అందిస్తుంది. అంతేగాక రోజ్‌నెఫ్ట్, గాజ్‌ఫ్రామ్ మనదేశానికి క్రూడాయిల్‌ని సరఫరా చేయడానికి తమ ఆసక్తిని ప్రదర్శించాయి.

2014 వ సంవత్సరం డిసెంబర్‌లో న్యూఢిల్లీలో జరిగిన భారత – రష్యా 15వ వార్షిక సమ్మిట్‌లో రెండు దేశాలు నుండే విదేశ్ లిమిటెడ్, రోజ్‌నెఫ్ట్ చేసుకున్న “అవగాహనా ఒప్పందం, ఇరుదేశాల వైపు కొనసాగే సహాయ సహకారాలకు మరో ముందడుగు. ఆర్కిటిక్‌లో జరుపబోయే తవ్వకాలు భారత దేశానికి చాలా ముఖ్యం. ఆర్థికంగా, రాజకీయంగా నిలద్రొక్కు కోవడానికి ఓ సదవకాశం. రష్యా ఆయిల్ కంపెనీలలో 4వ స్థానంలోనున్న గాజ్‌ప్రామ్‌నెఫ్ట్, ఆర్కిటిక్ ప్రాజెక్టులో భారత భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నాయి. అంతేగాక జరిగిన వార్షిక సమావేశంలో రెండు దేశాల ప్రధానులు నరేంద్రమోడి, వ్లాదిమిర్ పుతిన్, ఉభయదేశాల భాగస్వామ్యంలో చమురు / ఇంధనాల అన్వేషణ, పెట్రోకెమికల్ ప్లాంట్‌ల నిర్మాణం, ఇరుదేశాల మధ్య పైపులైన్ల నిర్మాణం, రవాణా, చమురు నిల్వల పెంపంకలోని సాధక బాధకా లు, హైడ్రోకార్బన్ రంగంలో సిబ్బందికి ఇవ్వా ల్సిన శిక్షణ గురించి సుస్పష్టంగా చర్చించారు. 2014 డిసెంబర్‌లో జరిగిన పుతిన్ పర్యటనలో భాగంగా “ద్రుజ్‌బా– దోస్తే” లపై జరిగిన సంతకాల వలన, రెండు దేశాల మధ్య హైడ్రోకార్బన్‌లకు సంబంధించిన పరస్పర సహకారం బలోపేతమయ్యింది. 2015 ఫిబ్రవరిలో బీజింగ్‌లో జరిగిన సమావేశంలో రష్యా, భారతదేశం, చైనా సహజవాయువు, చమురు రంగాలలోని నూతన శోధనలకు, పరస్పర సహకారానికి అంగీకారానికి వచ్చాయి. 2015 జూన్ 19వ తేదీన సెయింట్ పీటర్స్ బర్గ్‌లో జరిగిన సమావేశంలో, భారతదేశ రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ హైడ్రోకార్బన్ రంగంలో ఉభయదేశాలు విస్తృతంగా పెట్టవలసిన పెట్టుబడులను గూర్చి చర్చించారు.

2015 డిసెంబర్‌లో జరిగిన 16వ భారత రష్యా వార్షిక సమావేశంలో, రష్యాలో జరిపే హైడ్రోకార్బన్ త్రవ్వకాలలో పరస్పర సహకారం గురించి ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు.

**"ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజన్సీ అంచనాల ప్రకారం 2040 నాటికి ఇతర ఇంధన వనరుల వినియోగాన్ని సహజ వాయువు వినియోగం అధిగమిస్తుందని అంచనా. అంతర్జాతీయంగా మార్కెట్ రంగంలో వచ్చిన సరళీకరణ వలన, ఆసియా మార్కెట్‌లో పెద్దపెద్ద ప్రాజెక్టులను చేపట్ట డానికి రష్యా ముందడుగులో ఉంది."**



ఆయిల్‌ను అన్వేషిస్తున్న రష్యా నిపుణులు

తదనంతరం 2016 మార్చిలో రోజ్‌నెఫ్ట్ ప్రధానాధికారి "ఇగోర్ సెచిన్" భారతదేశానికి రెండోసారి పర్యటనకు వచ్చి, భారతీయ కంపెనీలు "ఆయిల్ ఇండియా లిమిటెడ్", "ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోరిసోర్స్ లిమిటెడ్‌లతో రోజ్‌నెఫ్ట్ అనుబంధ సంస్థలైన "తాస్‌మూర్ యాక్‌లో 29.9 శాతం వాటాలను, వాంకోర్‌నెఫ్ట్‌లో 23.9 శాతం వాటాలను భారతీయ కంపెనీలను అంద చేస్తూ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజన్సీ అంచనాల ప్రకారం 2040 నాటికి ఇతర ఇంధన వనరుల వినియోగాన్ని సహజ వాయువు వినియోగం. అధిగమిస్తుందని అంచనా. అంతర్జాతీయంగా మార్కెట్ రంగంలో వచ్చిన సరళీకరణ వలన, ఆసియా మార్కెట్‌లో పెద్దపెద్ద ప్రాజెక్టులను చేపట్టడానికి రష్యా ముందడుగులో ఉంది. రష్యా- చైనా భారత దేశాల మధ్య రష్యాలోని సైబీరియా ఫీల్డ్ నుండి, చైనా గ్జినాంగ్ ప్రొవిన్స్ మీదుగా జమ్మూ - కాశ్మీర్ వరకూ చేపట్టిన 2,600 కి.మీ పొడవైన పైపులైను అంతర్జాతీయంగా ఇంధన రంగంలో కీలకపాత్ర వహించబోతుంది. ప్రతిపాదించి చేపట్టిన ఈ లైను, ఏదైనా అవాంతరాల వలన ఆగిపోయినా, ప్రత్యామ్నాయంగా మరో మార్గాన్ని సైతం రష్యా చూపింది. అదే ఆఫ్ఘనిస్తాన్‌లోని మజర్- ఈ షరీఫ్ నుండి కొనసాగుతున్న టర్క్‌మెనిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్- భారత్ గ్యాస్ పైప్‌లైన్.

ఏది ఏమైనప్పటికీ, ఈ పైపులైనులకు వాటికనుబంధమైన రాజకీయ సమస్యలు, ప్రాంతీయమైన సవాళ్లు చాలా ఉన్నాయి.

రష్యా, చైనా, ఇండియా పైప్‌లైనులో భౌగోళికమైన అవరోధాల వలన, వాతావరణ అననుకూలతల వలన, రక్షణ సమస్యలున్నాయి. ఈ మార్గంలోని 35 శాతం కొండ ప్రాంతాలలో ఉంది. అరుదైన పక్షులకు జీవ జాలానికి ఆవాలమైన ఈ ప్రాంతాన్ని సంరక్షించాలని పర్యావరణ వేత్తలు గట్టిగా పట్టుబడుతున్నారు. చైనాలోని స్వయంప్రతిపత్తి ప్రాంతం. "గ్జిన్‌జాంగ్ వైగూర్" కూడా ఇదే ప్రాంతంలో ఉంది. అదేవిధంగా రష్యా టాపీ పైప్‌లైన్ కూడా మిలటరీ అధీనంలోనున్న ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ పరిధిలో ఉంది. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్‌లోనున్న వాటాదారులతో సంప్రదింపులు జరిగి, పైపులైను వలన ఒనగూడే లాభాలను స్పష్టపరిచి, ఇబ్బందులు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. ఇండియా - రష్యాల మధ్య గ్యాస్ ట్యాంకర్లు నౌకలద్వారా సరఫరా గురించి సైతం పుతిన్ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. మిగిలిన విషయాలపై కూడా సంప్రదింపులు జరపడం జరిగింది. అవి ఒమన్ మీదుగా ఇరాన్ నుండి ఇండియా అండర్ గ్రౌండ్ పైప్ లైన్, ఇండియా, ఇరాన్, అజర్‌బైజాన్, రష్యాను కలుపుతూ ఉత్తర దక్షిణం ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, ఆఫ్ఘనిస్థాన్ - ఇరాన్, ఇండియా ట్రేడ్ కారిడార్ వయా మధ్య ఆసియా, కాస్పియన్ అండర్ వాటర్ పైప్‌లైన్, రష్యా చైనా- ఇండియా, రష్యా, టాపీ పైప్‌లైన్. వీటన్నింటిని రాజకీయ, రక్షణ పరిధులున్నాయి.

ఇండియా, రష్యా, చైనాల మధ్య ఈ ఇంధన వ్యాపారానికి ఎన్నెన్నో అవకాశాలున్నాయి. తొలుతగా, ఆర్‌సిఐ పైప్‌లైన్ నిర్మాణం ముగిసినట్లయితే, అంతర్జాతీయంగా ఇంధన ధరలలో నిర్ణయాత్మకంగా శక్తిగా ఎదగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో బేరసారాలలో కీలకపాత్ర వహించడం, భారతదేశం, యురేషియన్ యూనియన్ ఆర్థిక శక్తిగా నిలవడం. మూడవది భౌగోళికంగా, రాజకీయంగా, ఇంధన రంగంలో రక్షణ కలిగి ఉండడం. నాల్గవది, ఈ పైపులైను షాంఘై కో అపరేషన్ ఆర్గనైజేషన్ అంతర్జాతీయ సంఘటిత మార్గంలో ఓ అడుగు ముందుకు వేయడం.

ఐదవది - ఆసియా చమురు రక్షణ రంగంలో ఉత్ప్రేరకంగా ఈపైపులైను సహకరిస్తుంది.

ఆరవది: ఆయిల్ రంగంలో మధ్య ఆసియాతో భారతదేశాన్ని అనుసంధానం చేయడానికి దోహదపడుతుంది. ఖతార్ నుంచీ, అక్రమంగా చమురు పొందే నేర ప్రవృత్తికి గండి పడుతుంది. ఇంధనం కోసం ఖతార్‌పై అధికంగా ఆధారపడవలసిన అవసరం కూడా ఈ పైపులైను వలన తగ్గడం. ఏడవది ఈరంగంలో, భారతదేశానికి అత్యంత నమ్మకమైన వ్యాపార భాగస్వామిగా రష్యా వ్యవహరించడం లాభించే మరో అంశం. సహజ వాయువు,. చమురు వ్యాపార కొనుగోళ్ల లావాదేవీలలో రష్యాలోని "బ్లాక్"లను ఓపెన్ బిడ్డింగ్‌లలో గాక, మరో నామినేషన్ విధానం ద్వారా పొందడం మరో సానుకూల అంశం.

టిపిఐ రష్యా ప్రాజెక్టులో ప్రమేయం, 9వ అంశం, దీనివలన పనులలో వేగం పెరుగుతుంది. పై తొమ్మిది అంశాలను దృష్టిలో పెట్టుకుంటే, అంతిమంగా చెప్పగలిగేది ఏ విధంగా చూసినా అంతర్జాతీయంగా చమురు, ఇంధనం వ్యాపార లావాదేవీలలో భారత్ రష్యాతో సఖ్యతగా వ్యవహరిస్తుంది.

**అనువాదం: డాక్టర్ శమంతకమణి**

# వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం ప్రధానం

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**ప్రజాశక్తి పత్రికలో పనిచేస్తున్న పార్టీ సభ్యుల కోసం నిర్వహించిన రాజకీయ తరగతులలో సభ్యుల నుండి వచ్చిన ప్రశ్నలు**

**బిజెపి, కాంగ్రెస్ లేకుండా థర్డ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేద్దాం అని కెసిఆర్ అన్నాడు. దీనికి కొన్ని ప్రాంతీయ పార్టీలు మద్దతు ఇస్తున్నాయి. ఈ థర్డ్ ఫ్రంట్‌పై మన పార్టీ వైఖరి ఏమిటి?**

గత కొంత కాలం నుండి ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చర్చనీయాంశంగా ఉంది. గతంలో మమతా బెనర్జీ దీని గురించి ప్రస్తావన చేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు దానిని ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి మద్దతు కూడగడుతున్నారు. ఈ ఫెడరల్ ఫ్రంట్ కాంగ్రెస్‌కు, బిజెపికి భిన్నంగా ఏర్పడుతుందని చెపుతున్నారు.

మార్క్సిస్టు పార్టీ గతంలో థర్డ్ ఫ్రంట్, థర్డ్ ఆల్టర్నేటివ్ పేరుతో ఇటువంటి ప్రయత్నమే చేసింది. ఎన్నికల అనంతరం అటువంటి కూటములను ఏర్పాటు చేయటంలో కొంత జయప్రదమైంది. కానీ ఆ కూటముల పనితీరు, అనుభవం అంత ఆశాజనకంగా లేదని సమీక్షించుకుని పార్టీవైపు నుండి అటువంటి ప్రయత్నాలు చేయాల్సిన అవసరం లేదని భావించింది. అఖిలభారత స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను నిర్మించే ప్రయత్నాలకే ప్రాధాన్యతనివ్వాలని భావించింది.

అందువలన ఇప్పుడు జరుగుతున్న ఫెడరల్ ఫ్రంట్ వంటి ప్రయత్నాల్లో పార్టీ భాగస్వామి కాదల్చుకోలేదు. ఇతర పార్టీల చొరవతో అటువంటి ఫెడరల్ ఫ్రంట్ ఉనికిలోకి వస్తే, ఆ ఫ్రంట్ విధానాన్ని బట్టి, దానిపట్ల తన వైఖరిని, తన సంబంధాలు ఎలా ఉండాలి అనే అంశాన్ని మార్క్సిస్టు పార్టీ నిర్ణయించుకుంటుంది.

**త్రిపురలో కాంగ్రెస్‌తో ముందే అవగాహనకు వచ్చి ఉంటే అధికారంలోకి వచ్చే వాళ్లం కదా! కేవలం 0.3 శాతం ఓట్లతో సుమారు 40 సీట్లను కోల్పోవాల్సి వచ్చింది. రాష్ట్రాల వారీగా విడివిడిగా ముందే ఈ విధంగా ఒకలైన్‌లో ఉంటే బిజెపి బలం పుంజుకునే అవకాశముండదు కదా! లేని పక్షంలో రాబోయేకాలంలో ఇదే పరిస్థితి ఉంటుందేమో.**

**త్రిపుర ఎన్నికల ఫలితాలు, ఆ రాష్ట్రంలో మతోన్మాద మూకలు జరుపుతున్న దాడుల నేపథ్యంలో సాధారణ కార్యకర్తలు- పార్టీసభ్యులు ఆందోళన చెందుతున్నారు. దేశవ్యాప్తంగా ఫాసిస్టుశక్తులను నిలువరించాలంటే కాంగ్రెస్‌తో అవగాహన ఉండాలనే విధానం కరెక్టా? కాదా? వివరించగలరు.**

**మనపార్టీ ప్రభుత్వాలను భర్తరఫ్ చేస్తున్నపుడు, బాంబుదాడుల కాలంలోనూ మనం గెలిచాం. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకున్నా ఓడిపోతున్నాం. కారణాలను వివరించగలరు.**

త్రిపురలో ఈమధ్య జరిగిన శాసనసభ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయింది. 24 సం॥ల పాటు వరుసగా గెలుస్తూ వచ్చిన పార్టీ ఈసారి ఓడిపోవడం కొంత నిరాశ కలిగించటం సహజం. అయితే ఈ ఓటమికన్నా బిజెపి, దాని మిత్రులు అధికారానికి రావడం ప్రమాదకరమైన అంశం. అధికారానికి వచ్చిన వెంటనే పార్టీని చిన్నాభిన్నం చేసేందుకు బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు భౌతిక దాడులకు పాల్పడుతున్నాయి. ఆఫీసులపై దాడి చేయడం, కార్యకర్తలను హింసించడం, సానుభూతిపరుల, సభ్యుల ఆస్తులను ధ్వంసం చేయడం, ప్రజాపునాదిని బలహీనం చేయడం కోసం ప్రజలను భయభ్రాంతులను చేయడం జరుగుతున్నది. పార్టీని, ప్రజలను సమాయత్తం చేయడం ద్వారా త్రిపుర పార్టీ రాష్ట్ర కమిటీ, కార్యకర్తలు ప్రజా ఉద్యమాన్ని రక్షించుకునే పని చేస్తున్నారు.

గతంలో బెంగాల్, త్రిపుర, కేరళలో తీవ్ర నిర్బంధంలో ఉద్యమాన్ని రక్షించుకున్న అనుభవం మనకున్నది. ఇప్పుడు కూడా రక్షించుకోగలమనే ఆత్మవిశ్వాసంతో ముందుకు పోతున్నాము. తీవ్ర నిర్బంధం ఉన్నప్పుడైనా, శాంతియుత పరిస్థితుల్లోనైనా ప్రత్యర్థులను ఎదుర్కొని నిలబడటానికి ప్రజా మద్దతే కీలకం. ప్రస్తుతం సుదీర్ఘ కాలం పరిపాలన చేసినప్పటికీ, మామూలు వాతావరణంలో ఎన్నికలు జరిగినప్పటికీ, ఓడిపోవడానికి బాహ్య కారణాలతో పాటు అంతరంగిక కారణాలు కూడా ఉంటాయి. సుదీర్ఘ కాలం ప్రభుత్వం, పదవుల్లో ఉండడం కూడా పార్టీ, ప్రజా ఉద్యమాలు అప్రమత్తంగా లేకుండా ఉండేందుకు ఒక కారణం కావచ్చు.

త్రిపురలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ యంత్రాంగం అంతా మూకమ్మడిగా బోర్డు తిప్పేసి బిజెపిగా మారిపోవడం అన్నింటికన్నా ముఖ్యమైన కారణం. నామమాత్రంగా ఉన్న బిజెపి అకస్మాత్తుగా అధికారంలోకి వచ్చిందంటే కారణం ఇదే. మార్క్సిస్టు పార్టీని ఓడించాలని సుదీర్ఘ కాలం రకరకాలుగా ప్రయత్నించిన త్రిపుర కాంగ్రెస్ పార్టీ అనుయాయులు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆసరాతో దీనికి పూనుకున్నారు. లౌకికవాదం గురించి నిరంతరం జపం చేసే కాంగ్రెస్‌వారు చొక్కా మార్చినంతం సులువుగా బిజెపి అవతారం ఎత్తడానికి వారిలో నరనరానా జీర్ణించుకున్న కమ్యూనిస్టు వ్యతిరేకత కారణమైంది. అటువంటి కాంగ్రెస్ పార్టీతో అవగాహన చేసుకుంటే బిజెపిని ఓడించగలము అనుకోవడం పొరపాటు. కాంగ్రెస్ పార్టీయే బిజెపి అవతారం ఎత్తిన తర్వాత, కాంగ్రెస్‌తో అవగాహన అనేదానికి అర్థం లేని పరిస్థితి. అయినా అటువంటి ప్రయత్నం చేస్తే మన శ్రేణులను గందరగోళంలో నెట్టడానికి తోడ్పడుతుందే తప్ప బిజెపిని ఓడించడానికి కాదు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలవడానికి కాంగ్రెస్‌వారు హోల్‌సేల్‌గా బోర్డు తిప్పేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ వనరులను, శక్తులను బిజెపి దుర్వినియోగం చేయడం, బూటకపు వాగ్దానాలు చేయడం, ఉగ్రవాద సంస్థలతో పొత్తులు పెట్టుకోవడం కూడా ముఖ్యమైన కారణాలు. ప్రత్యేక త్రిపుర రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్నవారిని సంతృప్తిపరచడానికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వడానికి సానుకూలంగా ఉన్నట్టు బిజెపి నాయకత్వం ఎన్నికల ముందు మోసపూరితంగా

వ్యవహరించింది. అలాగే నిరుద్యోగ యువకులకు అలివిగాని వాగ్దానాలను చేసింది. దేశవ్యాపితంగా తన శక్తినంతటినీ కూడగట్టి డబ్బును, కార్యకర్తలను, ప్రచార సామాగ్రిని సమీకరించి త్రిపురను ముంచెత్తింది. వీటన్నిటి మూలంగా గిరిజన ప్రజల్లో కొద్దిమందిని ప్రభావితం చేయగలిగింది. అందుకే 5 శాతం ఓట్లను వామపక్ష ఫ్రంట్ కోల్పోయింది.

పదవులు పోవడం, అధికారం పోవడం అనేది ముఖ్యమైన విషయమే అయినా, అదే సర్వస్వంగా కమ్యూనిస్టులు భావించకూడదు. 45 శాతం ఓటర్లు వామపక్షాలపై నమ్మకం ఉంచారన్నది ముఖ్యంగా గమనంలో ఉంచుకోవాలి. వారి విశ్వాసాన్ని ముందుకు తీసుకెళ్ళడం, తాత్కాలిక భ్రమలకు గురైన ప్రజలను, ముఖ్యంగా గిరిజన ప్రజలను తిరిగి సమీకరించడంపై దృష్టి పెట్టాలి. ఇప్పటికే బిజెపి చేసిన వాగ్దానాల డొల్లతనం బట్టబయలవుతున్నది. భ్రమలకు గురైన వివిధ తరగతుల ప్రజలు పశ్నించడం ప్రారంభిస్తున్నారు. వారిని సమీకరించాలి. అలాగే సంఘపరివార్ తమ మతోన్మాదాన్ని గిరిజన ప్రజలలోకి చొప్పించేందుకు, గిరిజనులు–బెంగాలీల మధ్య వైరాన్ని పెంచేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తాయి. ఈ ప్రయత్నాలను సమర్ధవంతంగా తిప్పికొట్టే కార్యక్రమాన్ని వామపక్షాలు చెయ్యాల్సి ఉంది. అటువంటి ప్రయత్నంలో మన పార్టీ, ప్రజా ఉద్యమాలు ఉన్నాయి. బిజెపి మతోన్మాద శక్తులను ఎదిరించి వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాన్ని తిరిగి బలోపేతం చేసుకోగలమన్న నమ్మకం పార్టీకి ఉంది.

22వ కాంగ్రెస్ విపులంగా చర్చించిన తర్వాత మన రాజకీయ విధానాన్ని రూపొందించింది. ముసాయిదా తీర్మానంపై దేశవ్యాపితంగా జరిగిన చర్చలను దృష్టిలో పెట్టుకుని ముసాయిదాలోని అస్పష్టతలను తొలగిస్తూ తగిన సవరణలను చేసింది. తాజాపర్చిన రాజకీయ అంశాలను పార్టీ మహాసభ సందర్భంగా బహిరంగంగా విడుదల చేసింది. ఈ రాజకీయ విధానంలో బిజెపి పట్ల, కాంగ్రెస్ పట్ల, ప్రాంతీయ పార్టీల పట్ల పార్టీ వైఖరిని, ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాన్ని స్పష్టం చేసింది. మహాసభకు ముందు పార్టీలోనూ, బయటా కాంగ్రెస్ పార్టీ పట్ల అనుసరించాల్సిన వైఖరి గురించి ప్రధానంగా చర్చ జరిగింది. ఆ చర్చను కూడా దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పట్ల మన వైఖరిని మహాసభ రూపొందించింది. పార్టీ అవగాహనను ఏప్రిల్ 20న పార్టీ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో స్పష్టంగా చూడవచ్చు.

**పార్టీ మహాసభ ముసాయిదా తీర్మానంలో రష్యాను సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాల పేరాలో చేర్చారు. రష్యాను సామ్రాజ్యవాద దేశంగా చూడాలా?**

22వ మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానంలో సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాల గురించి వివరంగా పేర్కొనబడింది. సామ్రాజ్యవాద దేశాల మధ్య ఉన్న వైరుధ్యాలు కొంత సద్దుమణిగినట్టు అనిపించినా, ఈ మధ్య కాలంలో వాటిమధ్య కొత్త ఘర్షణలు, వైరుధ్యాలు ముందుకొస్తున్నాయని తీర్మానం పేర్కొంది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత ఏర్పడిన దేశాలలో చాలావరకు పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణయింది. అందులో పెద్ద దేశమైన రష్యాలో సమిష్టి ఆస్తులన్నింటినీ కొల్లగొట్టి బడా పెట్టుబడిదారీ వర్గం ఏర్పడింది. అప్పటి నుండి రష్యా పెట్టుబడిదారీ దేశాలలో ఒక ముఖ్యమైన దేశంగా ఆవిర్భవించింది. 1917 అక్టోబర్ విప్లవానికి ముందు జారిస్టు రష్యా సామ్రాజ్యవాద దేశాలలో ఒకటిగా ఉన్నది. అయితే మిగిలిన సామ్రాజ్యవాద దేశాలకన్నా బలహీనమైన స్థాయిలో ఉండేది. ఇప్పుడు రష్యాలో సోషలిజం దెబ్బతిని పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ తర్వాత మళ్ళీ అటువంటి సామ్రాజ్యవాద దేశాలలో ఒక భాగంగా రష్యా మారే అవకాశం ఉంది. అయితే మిగిలిన సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాల స్థాయికి అది చేరుకోవడానికి కొంత సమయం పట్టొచ్చు.

**రాజకీయాలలో అనుభవం లేని, ఎన్‌డిఎ విజయానికి కారకుడయిన పవన్‌కళ్యాణ్ ప్రత్యేక హోదా అంశంపై నిర్వహించిన సమావేశాల్లో సుదీర్ఘ చరిత్రగల వామపక్షాలు (సిపిఎం, సిపిఐ) పాల్గనటం సమంజసమేనా, వివరించగలరు.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేక హోదా అంశంపై పెద్ద పోరాటం జరుగుతున్నది. ఈ అంశంపై ప్రజాభిప్రాయం ఎంత తీవ్రంగా ఉందంటే తెలుగుదేశం పార్టీ ఎన్‌డిఏ కూటమి నుండి బయటికి రావలసి వచ్చింది. ఆందోళనకు దిగాల్సి వచ్చింది. కేంద్ర బిజెపి ద్రోహానికి వ్యతిరేకంగా, తెలుగుదేశం పార్టీ వంచనకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం), వామపక్షాలు కలిసొచ్చే అన్ని శక్తులతో ఈ అంశంపై పనిచేస్తున్నాయి. పవన్‌కళ్యాణ్ ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కూడా ఈ అంశంపై ఉద్యమాల్లో కలిసివస్తున్నందున దాని సహకారాన్ని కూడా తీసుకుంటున్నాము. సమస్యపై పనిచేయడానికి వ్యక్తులు, చరిత్ర ముఖ్యం కాదు. వామపక్షాలకు సుదీర్ఘ చరిత్ర ఉన్నంతమాత్రాన ఒక సమస్య మంచిదైనప్పుడు, ఒక విధానం సరైనది అయినప్పుడు ఇతరులతో కలిసి పనిచేయడానికి సంకోచించకూడదు. పవన్‌కళ్యాణ్ జనసేన పార్టీ విషయంలో కూడా దాని విధానం సరైందా కాదా అనేదాన్ని బట్టి తప్ప, ఆ పార్టీ కొత్త పార్టీనా, పాత పార్టీనా అనేదాన్ని బట్టి నిర్ణయం తీసుకోము. తెలుగుదేశం, బిజెపిలకు వ్యతిరేకంగా, కాంగ్రెస్‌కు దూరంగా ఉంటానని జనసేన రాజకీయంగా స్పష్టం చేసింది. ఈ రాజకీయ వైఖరిని సీపీఐ(ఎం) ఆహ్వానించింది. త్వరలో తమ పార్టీ విధివిధానా లను కూడా బహిరంగపరుస్తానని ఆ పార్టీ ప్రకటించింది. ఆ విధానాలను ప్రకటించిన తర్వాత వాటి ప్రాతిపదికగానే జనసేన పార్టీపట్ల సీపీఐ(ఎం) తన వైఖరిని నిర్ణయించుకుంటుంది. ❃

## అభిప్రాయం

**గౌరవనీయులైన మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక సంపాదకులకు నమస్కరించి ఏప్రిల్ సంచికపై నా అభిప్రాయం ప్రచురించకోరుతున్నాను...**

ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు, విశ్వవిజ్ఞాని స్టీఫెన్ హాకింగ్ గురించి రాసిన నివాళి వ్యాసం అందరం చదవవలసినది. శరీరం సహకరించనంత అంగవైకల్యం వున్నప్పటికి 20వ శతాబ్దంలో భౌతిక శాస్త్రంలో రెండు మహత్తర ఆవిష్కరణలయిన క్వాంటం సిద్ధాంతాన్ని సాపేక్ష సిద్ధాంతాన్ని జోడించడంలో గొప్ప పాత్ర నిర్వహించారు. క్వాంటం సిద్ధాంతం అణువుల గురించి తెలియచేస్తున్నది. హాకింగ్ రాసిన 'ది గ్రాండ్ డిజైన్‌లో' విశ్వసృష్టికి సంబంధించిన సమాధానాలున్నాయి. ఆయన 'నాస్తికుడు'. దైవాన్ని నమ్మని 76 ఏండ్ల హాకింగ్ అందరికీ ఆదర్శప్రాయులు. ఆయన తల్లి కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు. హాకింగ్ మరణం విజ్ఞాన ప్రపంచానికి తీరనిలోటు. చాలా సమాచారం అందించిన రచయితకు ధన్యవాదాలు.

**– తుంపాల శ్రీరామమూర్తి**
గాజువాక విశాఖపట్నం
9440260280

# కామ్రేడ్ భిక్షావతి

(2వ పేజీ తరువాయి)

వస్తుండేది. అప్పుడే ఆయన విశాలాంధ్ర భవన నిర్మాణ పనుల్లో ఉన్నారు. విశ్రాంతి లేక.. పని ఒత్తిడి వల్ల.. గతంలో జైలులో లాఠీ దెబ్బలకు నొప్పులు వస్తుండేవి. డివిఎస్ విశాలాంధ్ర బుక్‌హౌస్ కూడా నిర్వహించేవారు. తర్వాత ప్రెస్ మేనేజర్‌గా పనిచేశారు. ఆయన ఆరోగ్యం మరింత క్షీణించ సాగింది. మందులు తీసుకుంటూనే విశాలాంధ్ర భవనం పూర్తి చేశారు. తన తండ్రి, తాత.. డబ్బు, ధాన్యం పంపుతుండేవారు. భిక్షావతి పిల్లల్ని చదివిస్తూ కుటుంబ బాధ్యత చూసేవారు. డివిఎస్ పార్టీ కార్యక్రమాల్లోనే ఉండేవారు. విశాలాంధ్రలో మితవాదులది పైచేయి కావడంతో అది వారి పరమైంది. ఆ సందర్భంగా ఆయన అందులో పనిచేయడం సాధ్యంకాక బయటకు వచ్చేశారు. వారు డివి ఎస్ పార్టీ సభ్యత్వాన్నీ తొలగించారు. ఆ సమ యంలో ఆస్తులమ్ముకొని వేరే ఊరు వెళ్లడానికి నిర్ణయించుకున్నారు. అప్పుడు సుందరయ్యగారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. జనశక్తికి డిక్లరేష న్ భిక్షావతి పేరుతో తీసుకోవాలని లేఖ రాశారు. డివిఎస్ పొలం అమ్మిన తాలూకా డబ్బు తెచ్చి భిక్షావతి పేరగాకుండా ఎబికె ప్రసాద్ పేర డిక్లరేషన్ తీసుకుని పత్రిక ప్రారంభించారు. దాని ప్రధాన నిర్వాహకుడుగా ఉన్నారు. దానికి.. ఆమె తన మెడలో ఉన్న రెండు వరసల గొలుసు (రెండు నవర్సులు), సూత్రాలతోసహా ఇచ్చేశారు.

దాదాపు వారి ఇల్లే జనశక్తి ఆఫీసు గా ఉండేది. పార్టీ కార్యక్రమాలు, పత్రిక వ్యవహారాల్లో డివిఎస్ ఎప్పుడూ బిజీగా ఉండేవారు. ఎక్కువ సమయం ఆఫీసులోనే గడిపేవారు. ఆయన చేసే కార్యక్రమాలను భిక్షావతి ప్రోత్సహించేవారు. ఆయనకు ఎలాంటి ఆటకం కలగకుండా కుటుంబాన్ని చూసుకునేవారు. భోజనానికి ఆయన ఆఫీసు నుంచి ఇంటికి వస్తే సమయం వృథా అవుతుందని ఆఫీసుకే పంపేవారు. కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే మహిళా ఉద్యమంలో చురుగ్గా పనిచేసేవారు.

1964లో కలకత్తాలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆవిర్భావ మహా సభకు డివిఎస్ జ్వరం, కాలునొప్పితో హాజరయ్యారు. సిపిఎం చైనాకు మద్దతిస్తోందని నెపం వేసి ప్రభుత్వం మహాసభ నుంచి తిరిగివచ్చిన కొద్దికాలానికే అతివాద నాయకులందరినీ అరెస్టు చేసింది. అప్పటికి డివిఎస్ జ్వరంతో ఉన్నారు. ఆయనను అరెస్టు చేసి జైలులో పెట్టారు. అక్కడ బాగా అస్వస్థతకు గురయ్యారు. ఉస్మానియాలో చూపిస్తే కాలుకు శస్త్ర చికిత్స చేయాలనీ, బోను టీబీ వచ్చిందనీ చెప్పారు. పెరోలుపై గుంటూరు తీసుకువచ్చి చిగురుపాటి నాగేశ్వరరావుగారి ఆసుపత్రిలో ఉంచి వైద్యం ప్రారంభించారు. 1965 అక్టోబరులో ఆయన స్పృహ కోల్పోయారు. అలా నెలరోజులపాటున్నారు. తర్వాత కొంత కోలుకున్నారు. ఏడు నెలలపాటు ఆయన తోపాటు భిక్షావతి ఆసుపత్రిలోనే ఉన్నారు. ఆ ఏడాది డిసెంబరు 31 రాత్రి డివిఎస్ రక్త వాంతి చేసుకున్నారు. బేసిన్ పట్టిన ఆమె వంక చూసి అలాగే పడుకున్నారు. రక్తం ఎక్కిస్తుంటే ఆయన డాక్టర్‌తో.. 'జనవరి ఫస్ట్ నా బర్త్‌డే, అది నా డెత్ డే కాకుండా చూడండి' అన్న మాటలు ఆమె గుండెలను పిండేశాయి. ఆమె దు:ఖిస్తుంటే 'నీకు చేతనైంది నీవు చేశావు. బాధ పడొద్దు. నేనెలా పార్టీకి పనిచేశానో.. నీవూ అలాగే చేయి' అన్నారు. ప్రతి ఆదివారం పిల్లలు ఆయనను చూడటానికి వస్తే బాధను అణచి పెట్టుకొని సంతోషంగా మాట్లాడేవారు. ఎందుకలా అని ఆమె అడిగితే పిల్లలు బాధపడ తారనే వారు. జనవరి రెండు నుంచి ఆయన స్పృహలో లేరు. 1966 జనవరి 8న ఆయన కన్ను మూశారు. డివిఎస్ చనిపోయిన రెండో రోజు విజయవాడలో మీటింగుకు కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్‌గారొచ్చారు. భిక్షావతిని పరామర్శించడానికి వారి ఇంటికి వెళ్లారు. అప్పుడు ఆయనతో తన శక్తి మేరకు డివిఎస్ మిగిల్చిన కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తానని తన చేతి గాజులు తీసి ఆయన ద్వారా పార్టీకి ఇచ్చారు భిక్షావతి.

'పుస్తెను సైతం జనశక్తికి కానుకగా సమర్పించిన భిక్షావతి వంటి సాధ్వీలలామనీ.. ముక్కుపచ్చలారని పిల్లలనూ.. అనేకానేక ఆప్త మిత్రులనూ.. జనశక్తినీ వదిలేసి.. అడ్రస్సు దొరకని ఏ ప్రదేశానికి అదృశ్యమయ్యావయ్యా కామ్రేడ్ డివిఎస్.. పిడుగుపాటులాంటి వార్తను వినిపించి, మా గుండెల్లో భూ కంపాలు పుట్టించావు కదయ్యా..' అంటూ ప్రముఖ కవి, అభ్యుదయ రచయిత సివి డివిఎస్‌కు నివాళిగా దీర్ఘ కవిత రాశారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, లోక్‌సభలో సిపిఎం పక్ష నాయకుడు అయిన ఎకె గోపాలన్ కేరళలోని వియ్యూరు జైలు నుంచి భిక్షావతికి సంతాప లేఖ రాశారు. ఆపరేషన్ కోసం సోవియట్ యూనియన్ (మాస్కో) వెళ్లిన పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్యగారు డివిఎస్ మరణవార్త విని భిక్షావతిగారికి లేఖ రాశారు. మోటూరు హనుమంతరావు, మానికొండ సూర్యావతిలు కూడా చంచల్ గూడ జైలు నుంచి భిక్షావతికి సంతాప లేఖ రాశారు. సికిందరాబాద్ జైలులోని కమ్యూనిస్టు డిటెన్యూలందరూ భిక్షావతికి లేఖ రాసి ఓదార్చారు.

సిపిఎంలో 1968లో నక్సలైట్ వాదన ఊపందుకున్న సందర్భంలో పాలకొల్లులో జరిగిన ప్లీనంలో పార్టీలైన్‌కు అనుకూలంగా ఓటేసిన ఏకైక మహిళ భిక్షావతి. 1970లో కిలో బియ్యం రూపాయికే అమ్మించే ఉద్యమం సందర్భంగా ప్రభుత్వ గోదాముల వద్ద ధర్నాలు చేయడం, బైఠాయించడం వంటి ఆందోళనల్లో మహిళలతో కలిసి పాల్గొనేవారు. అరెస్టులు చేయడం సాయంత్రానికి విడుదల చేయడం నిత్యకృత్యంగా ఉండేది. చెవుటూరు కాల్వ తవ్వకంలో మహిళా సంఘం తరపున కీలకపాత్ర పోషించారు. కృష్ణాజిల్లా కమిటీ మహిళా సంఘం అధ్యక్షురాలిగా, పార్టీ కమిటీలో సభ్యురాలిగా 1976 నుంచి ఉన్నారు. తర్వాత ఉద్యమం విస్తరించడంతో విజయవాడ పట్టణ కమిటీగా మార్చారు. అందులోనూ మహిళా సంఘం కార్యదర్శిగా, పార్టీ కమిటీ సభ్యురాలిగా ఉన్నారు. సారా వ్యతిరేక ఉద్యమంతోపాటు మహిళల అభ్యున్నతికి నిరక్షరాస్యతే ప్రధాన అడ్డంకిగా భావించి, మహిళా సంఘం తరపున తరగతులు నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారు. మహిళలకు ఆస్తిహక్కు కావాలని ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వరకూ మహిళలంతా ప్రదర్శనగా వెళ్లి, వినతిపత్రం అందించారు. ఆ తర్వాత ఆ బిల్లు చట్ట రూపం దాల్చింది. మహిళాసంఘం రాష్ట్ర కమిటీలో 9వ మహాసభ వరకూ కొనసాగారు. ఆలిండియా నాల్గవ మహాసభ మినహా అన్ని మహాసభలకు ఆమె హాజరయ్యారు. పార్టీ అత్యధిక మహాసభ లకు కూడా ఆమె హాజరయ్యారు. విశాలాంధ్ర ప్రారంభం, పున:ప్రారంభం, జనశక్తి, ప్రజాశక్తి.. ఇలా వామపక్ష ఉద్యమాలకు సంబంధించిన పత్రికల అభివృద్ధిలో ఆమె కృషి ఏదో ఒక రూపంలో ఉంది. ప్రజాశక్తికి ఆర్థిక సాయం కూడా అందించేవారు.

భిక్షావతి.. తన భర్త నిర్దేశించిన కర్తవ్యాన్ని, నాటి నుంచి ఒంట్లో శక్తి సన్నగిల్లే వరకూ అనేక కష్టనష్టాలను భరించి అవిశ్రాంతంగా కొనసాగించారు ఆమె బిడ్డలు నారాయణ ప్రసాద్ చాలాకాలం ప్రజాశక్తిలో పనిచేశారు. మరో కుమారుడు భానుప్రసాద్ నేటికీ ప్రజాశక్తిలో పనిచేస్తూనే ఉన్నారు. వారి కుమార్తె శారద కళాశాలలో చదివే రోజుల నుంచీ ఎస్ ఎఫ్ఐలో పనిచేస్తూ.. విశాఖలో పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా, శ్రామిక మహిళా నేతగా పనిచేశారు. కొద్ది సంవత్సరాల కిందట విశాఖ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఎప్పటికైనా కష్టజీవుల రాజ్యం – సమ సమాజం తప్పకుండా వచ్చి తీరుతాయని భిక్షావతి కన్నుమూసేవరకూ విశ్వసించారు. ఆ ఆదర్శ మహిళ ఈ ఏడాది మార్చి30న కన్నుమూశారు. ❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-05-2018 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-




## ఎస్సీ, ఎస్టీ(అత్యాచార నిరోధక) చట్టాన్ని నీరుగార్చొద్దు

# దళితులపై హింస ఆపండి

## సిపిఐ(ఎం) 22వ మహాసభల తీర్మానం

**మార్చి**20న సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వు ఎస్సీ, ఎస్టీ(అత్యాచార నిరోధక)చట్టంలోని నిబంధనలను నిలువునా నీరుగార్చేదిగా ఉంది. సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రజా సేవకులను, ప్రైవేట్ వ్యక్తులను ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఏకపక్షంగా, తక్షణ/ అరెస్టు కాకుండా వారి రక్షణకు హామీ ఇచ్చేవిగానున్నాయి. దేశంలో అత్యంత అణచివేతకు గురవుతున్న వర్గాలపై అంతకంతకూ దాడులు పెరిగిపోతున్న తరుణంలో సుప్రీం ఇచ్చిన ఈ ఉత్తర్వులు అనేక దుష్పరిణామాలకు దారితీస్తాయి. దళితుల పట్ల విరోధ భావంతో వ్యవహరిస్తూ, ప్రజా సేవకులే నిందితులుగా వున్నప్పుడు వారిపై కేసు నమోదు చేయడానికి ఆ ప్రజా సేవకుడు లేదా సేవకురాలిని నియమించిన అధికారి నుంచి లిఖిత పూర్వకంగా అనుమతి తీసుకోవాలి. అదే నేరారోపణలపై ప్రైవేట్ వ్యక్తులను అరెస్టు చేయాలంటే ముందుగా సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ నుంచి లిఖిత పూర్వక అనుమతి తప్పనిసరి అని సుప్రీం తన మార్గదర్శకాల్లో పేర్కొంది. సరైన ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించని పక్షంలో లేదా కేసుపై దర్యాప్తు జరుగుతున్న సమయంలో, అత్యాచార నిరోధక చట్టం కింద నమోదయిన కేసు తప్పుడుదని అనుకున్నప్పుడు నిందితులకు ముందస్తు బెయిలు మంజూరుపై ఎలాంటి పూర్తిస్థాయి నిషేధం లేదని కోర్టు చెప్పింది. ఈ షరతులన్నీ అత్యాచార నిరోధక చట్టం మౌలిక స్ఫూర్తికే విరుద్ధం. దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు, దోపిడీ, అవమానాలు ఇలా నానా రకాల హింసకు గురవుతున్న ఎస్సీ, ఎస్టీల రక్షణకు కొంతమేరకైనా గ్యారంటీ ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ చట్టాన్ని ప్రత్యేకంగా రూపొందించడం జరిగింది. దీనిని నీరుగార్చడంపై ఎస్సీ, ఎస్టీల్లోనే కాదు, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రగతిశీల శక్తుల్లోనూ తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

ఈ చట్టం దుర్వినియోగమవుతోందనడం పూర్తిగా సత్య దూరం. పాలనా, న్యాయ వ్యవస్థల్లో ఉన్నత స్థానాల్లో కులతత్వం తిష్టవేసుకు కూర్చోవడం వల్ల ఈ చట్టం ఇప్పటికీ నిజాయితీగా అమలు కావడం లేదు. జాతీయ నేర గణాంకాల బ్యూరో ఇచ్చిన సమాచారం ప్రకారం ఎస్‌సి, ఎస్టీలపై నేరాలు బాగా పెరిగిపోయాయి. 2015-17 సంవత్సరాల మధ్య కాలంలో ఎస్సీలపై 5.5శాతం, ఎస్టీలపై 4.7 శాతం నేరాలు పెరిగాయి. ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం అమలు తీరు తెన్నులకు సంబంధించి విడుదలజేసిన సమాచారాన్ని బట్టి అందిన మొత్తం ఫిర్యాదుల్లో 77 శాతం కేసుల్లో మాత్రమే నేరాభియోగాలు (చార్జిషీట్) నమోదయ్యాయి. అందులో శిక్షలు పడినవి 15.4 శాతం మాత్రమే.

చట్టం అమలు తీరే అంతంతమాత్రంగా వుంటే, దీనిని మరింత నీరుగార్చేలా సుప్రీం తీర్పు ఉంది. అందుకే ఈ తీర్పుకు వ్యతిరేకంగా ఒక్కసారిగా నిరసనలు వెల్లువెత్తాయి. దళిత సంఘాలు ఏప్రిల్ 2న భారత్ బంద్‌కు ఆకస్మికంగా ఇచ్చిన పిలుపుకు పెద్దయెత్తున స్పందన లభించింది. ఈ బంద్ పిలుపునకు డిఎస్‌ఎంఎంతో సహా అనేక సంఘాలు, సంస్థలు తమ పూర్తి మద్దతు తెలిపాయి. సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరిగింది. దళిత యువకులు, బాలికలు, మహిళలు పెద్ద యెత్తున వీధుల్లోకి వచ్చి, రోడ్లపై బైఠాయించారు. ప్రదర్శనలు నిర్వహించారు. బంద్‌ను బ్రహ్మాండంగా విజయవంతం చేశారు. దీనిని చూసి ఓర్వలేని సంఘ్ పరివార్ మూకలు దేశంలో పలు చోట్ల బంద్ నిర్వాహకులపై దాడులకు తెగబడ్డాయి. దీంతో బంద్ హింసాత్మకంగా మారింది. మరీ ముఖ్యంగా యుపి, మధ్యప్రదేశ్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాల్లో పరివార్ గూండాలు యధేచ్ఛగా చెలరేగిపోయారు. పెద్దయెత్తున చెలరేగిన ఈ హింసాకాండలో మొత్తం ఎనిమిది మంది దళితులు బలి అయ్యారు. వీరిలో ఆరుగురిని సంఘ్ పరివార్ కసాయి మూకలు పొట్టనబెట్టుకున్నాయి. గ్వాలియర్, మొరెనా, భింద్ తదితర ప్రాంతాల్లో సంఘ్ పరివార్ గూండాల అకృత్యాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. వీడియోల్లో అవన్నీ రికార్డయ్యాయి. హంతకులు స్పష్టంగా కనిపిస్తున్నా ఇంతవరకు ఏ ఒక్కరినీ అరెస్టు చేయలేదు. దీనికి భిన్నంగా వేలాది మంది దళితులపై (వారిలో చాలా మంది యువ కార్యకర్తలు) ఖూనీ, ఇతర నేరాభియోగాలను మోపి అరెస్టు చేశారు. పెద్దలని కూడా చూడకుండా విచక్షణారహితంగా బాదారు... వేధిస్తున్నారు.

ఈ రెండు రాష్ట్రాల్లోను ఆరెస్సెస్, బజరంగ్ దళ్, బిజెపి ప్రభుత్వాలు కూడబలుక్కొని దళిత కుటుంబాలపై దుర్మార్గంగా దాడులు చేశాయి. దళితుల్లో బిజెపి మద్దతుదారులను సైతం ఈ మూకలు వదల్లేదు. రాజస్థాన్‌ల్లో దళిత బిజెపి ఎమ్మెల్యే, దళిత కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఇళ్లను తగులబెట్టారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళిత వాడలు ఇప్పటికీ భయం గుప్పెట్లో గజగజలాడుతున్నాయి. ఆరెస్సెస్, భజరంగ్‌దళ్ మూకలు ఎప్పుడు ఏ రూపంలో విరుచుకుపడతాయోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు. కొన్నిచోట్ల ఆరెస్సెస్, భజరంగ్‌దళ్ గూండాలు పోలీసులను వెంట తీసుకుని వెళ్లి దళిత కుటుంబాలను బెదిరించారు. అంతేకాదు, దళితులకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఈ మూకలు విష ప్రచారం చేశాయి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అపవిత్రం చేశాయి. ఏప్రిల్10న అగ్రవర్ణాలు బంద్‌ను ప్రకటించాయి. అయితే, ఇది ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. ఆ రోజున బీహార్‌లో దళితులపై దాడులు జరిపారు. ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టాన్ని నీరుగార్చే సుప్రీం కోర్టు తీర్పును సమీక్షించాలని కోరుతూ కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడాన్ని సిపిఐ(ఎం) స్వాగతించింది.

***(హైదరాబాద్‌లో ఏప్రిల్ 18 నుండి 22 వరకు జరిగిన సిపిఐ(ఎం) 22వ మహాసభలో ఆమోదించిన తీర్మానం నుండి ఈ భాగం గ్రహించబడింది)***

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.13, No.1. Published on May 1, 2018